అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 23-5-2023

సంపుటి : 9 | సంచిక : 142 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

నార్కోటెక్ పరీక్షలకు సిద్ధం



- బ్రిజ్ భూషణ్ ఛాలెంజ్‌ని స్వీకరించిన రెజ్లర్లు
- "దేశం ముందు రియల్ టైమ్ లైవ్ టెస్ట్ చేద్దాం"
- సుప్రీంకోర్టు పర్యవేక్షించాలి

వివరాలు 5లో..

జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తాం

విధి విధానాలు ఖరారు చేయాలంటూ సీఎం కేసీఆర్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)ల సర్వీసును క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. అందుకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయాలంటూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను ఆయన ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం ఈ మేరకు నిర్ణయించారు. జేపీఎస్‌ల పనితీరును మదింపు చేయటానికి వీలుగా జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని సూచించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా ఫారెస్టు అధికారి, జిల్లా ఎస్పీ లేదా డీసీపీ సభ్యులుగా ఉంటారు. దీనికి రాష్ట్రస్థాయి నుంచి ఒక సెక్రటరీ స్థాయి లేదా హెచ్‌వోడీ స్థాయి అధికారి పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమిస్తారు. జిల్లా స్థాయి కమిటీలు పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ కమిటీ ఒక నివేదికను సమర్పిస్తుంది. రాష్ట్రంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో తాత్కాలిక ప్రాతిపదికన జేపీఎస్‌లను గతంలో కలెక్టర్లు ...5లో



దశాబ్ది ఉత్సవాల్లో ప్రగతి ప్రస్థానాన్ని ప్రతిబింబిద్దాం...

- లోగో ఆవిష్కరణలో సీఎం కేసీఆర్

వివరాలు 2లో..






అవమానం

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతికి అందని ఆహ్వానం

- మోడీ.. రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసానికి పరాకాష్ట
- సావర్కర్ పుట్టినరోజునే నూతన భవన ప్రారంభం
- భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అవమానించినట్టే-ప్రతిపక్షాలు
- మోడీకి అనుకూల నిర్ణయం తీసుకున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

దేశంలో రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసం పతాక స్థాయికి చేరింది. ప్రధాని మోడీ ఈ ధ్వంస రచనలో దేన్నీ లెక్కచేయట్లేదు. చివరకు స్వాతంత్ర్యోద్యమ చరిత్రను కూడా వక్రీకరిస్తూ, ఆ జాతీయోద్యమంతో ఎలాంటి సంబంధం లేని సావర్కర్ పుట్టినరోజు నాడు పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి పూనుకున్నారు. ఈ భవనాన్ని తొలి ఆదివాసీ మహిళా రాష్ట్రపతి ద్రౌపదీముర్ముతో ప్రారంభింపచేయాలని ప్రతిపక్షాలు సూచించినా, కాదు పొమ్మన్నారు. పైగా సావర్కర్ పుట్టినరోజు (మే 28) నాడే దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంత్యక్రియలు జరిగాయి. దాన్ని కూడా మోడీ సర్కారు పట్టించుకోకపోవడం గమనార్హం. మోడీ చర్య రాష్ట్రపతిని జాతీయోద్యమ నేతలను అవమానించినట్టే అని ప్రతిపక్షాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. మోడీ దుందుడుకు చర్య ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతుంది.

న్యూఢిల్లీ: రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థల్ని ధ్వంసం చేస్తున్న కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం మనుధర్మ వర్ణాశ్రమ అమలుకు ఏమాత్రం వెనకాడట్లేదు. భారతదేశ హృదయ స్పందన అయిన నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి ఏకంగా రాష్ట్రపతినే అవమానించేలా నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమానికి తొలి ఆదివాసీ మహిళా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానమే పంపలేదు. నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభింపచేసేందుకు మోడీ సర్కారు అంగీకరించలేదు. పైగా భారత స్వాతంత్ర్యోద్యమంతో ఎలాంటి సంబంధం లేని ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు వినాయక్ దామోదర్ సావర్కర్ 140వ జన్మదినమైన మే 28వ తేదీ భారత పార్లమెంట్ నూతన భవనాన్ని, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. కేంద్రం చర్య భారత స్వాతంత్ర్య పోరాట యోధులను అవమానించినట్టేనని తీవ్రంగా విమర్శించాయి. అయితే ప్రధానితో ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలనే నిర్ణయాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్నారు. ఈ ఏడాది చివర్లో రాజస్థాన్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే, ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే కోరికతోనే ఓంబిర్లా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని ప్రతిపక్షాలు ఆక్షేపిస్తున్నాయి. నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాల్సిందిగా రాష్ట్రపతిని కోరివుంటే బాగుండేదని జనతాదళ్ ఎంపీ మనోజ్ ఝా సహా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రధాని కాకుండా రాష్ట్రపతే ఈ భవనాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అసలు రాష్ట్రపతికి ఆహ్వానమే పంపకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే తప్పుపట్టారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుఖేందు శేఖర్ రే సైతం ట్విటర్ వేదికగా దీనిపై స్పందించారు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారనీ, దానికి గుర్తుగా ఆ తేదీన పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రారంభిస్తే బాగుండేదని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ అన్నారు. అలాకాకుండా ...2లో



జీవో 111 రద్దు వెనుక భారీ కుంభకోణం

అది అణు విస్ఫోటనం లాంటిది

- వెంటనే రద్దు చేయాలి
- కాంగ్రెస్ నేతృత్వంలో నిజ నిర్ధారణ కమిటీ
- బీజేపీ నేతలు కేంద్ర సర్కారుకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రపంచ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో జీవో నెంబర్ 111 రద్దు చేయడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ కుంభకోణం ...5లో



ఊగిసలాట

రాష్ట్ర బీజేపీలో అసంతృప్తి స్వరాలు

- కర్నాటక ఫలితాలతో పునరాలోచనలో నేతలు
- ఢిల్లీ వెళ్లిన ఈటల
- అధిష్టానం ఎదుట పలు డిమాండ్లు
- కొండా విశ్వేశ్వరరెడ్డి హాట్ కామెంట్స్
- క్రమశిక్షణ తప్పితే 'వేటు' తప్పదంటున్న బండి




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. కర్నాటకలో ఆపార్టీ ఓటమి తర్వాత ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన నేతలు పునరాలోచనలో పడ్డారు. బీజేపీ నుంచి పోటీచేస్తే గెలుపోటములపై లెక్కలు కట్టుకుంటున్నారు. దక్షిణాదిలో ఆపార్టీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారనే సంకేతాలను కర్నాటక ప్రజలు ఇచ్చారనీ, తెలంగాణలో కూడా అందుకు భిన్నమైన తీర్పు ఉండబోదనే అంచనాలతో రాజకీయ భవిష్యత్‌పై పునరాలోచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇలాంటి వారి జాబితా రోజురోజుకూ పెరుగుతుంది. ఇప్పటికే గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ ఆపార్టీలో ఉన్నట్టో, లేదో అర్థంకాని పరిస్థితి. దీనితో ఆయన ఇతరపార్టీలవైపు చూస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడి మార్పు అంశం తెరపైకి వస్తున్నది. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రెండ్రోజులు ఢిల్లీలో మకాం వేసి, రాష్ట్ర నాయకత్వంపై అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. అదే సమయంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా రాష్ట్ర నాయకత్వంపై ఘాటైన వ్యాఖ్యలే చేశారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఢిల్లీలో దోస్తీ...గల్లీలో కుస్తీ అంటూ కామెంట్స్ చేశారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ చాలామంది బీజేపీ నేతలు మెల్లగా అక్కడి నుంచి సర్దుకోవాలని చూస్తున్నట్టు రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ఈ తలనొప్పులు తట్టుకోలేని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పార్టీ కట్టుబాట్లు, క్రమశిక్షణ తప్పితే వేటు తప్పదంటూ తీవ్ర అసహనంతో మీడియా సమక్షంలో హెచ్చరికలు చేస్తున్నారు. దీనితో పువ్వు పార్టీలో ఏదో గడబిడ జరుగుతున్నదనే చర్చ మొదలైంది. వీటన్నింటికీ కర్నాటక ఎన్నికల్లో ఓటర్లు కొట్టిన చావుదెబ్బలే కారణమని విశ్లేషిస్తున్నారు. ఇక ఢిల్లీ వెళ్లిన ఈటల రాజేందర్ తాను చేరికల ...2లో

జవాన్ల శవాలపై 2019 ఎన్నికలు

జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ మాలిక్

- అదానీ సంపద అంతా ప్రజలదే
- ప్రభుత్వాన్ని మార్చాల్సిందే..



జైపూర్ : కేంద్ర ప్రభుత్వంపై జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మరోసారి నిప్పులు చెరిగారు. 2019 లోక్‌సభ ఎన్నికలు సైనికుల మృతదేహాల పైనే జరిగాయని విమర్శించారు. పుల్వామా ఘటనపై విచారణ జరిగి ఉంటే అప్పటి కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాజీనామా చేయాల్సి వచ్చేదని, అనేక మంది అధికారులు జైలుకు వెళ్లే వారని, పెద్ద వివాదమే చెలరేగేదని ఆయన అన్నారు. పుల్వామా దాడి జరిగిన వెంటనే ఆ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీకి తెలియజేశానని, అయితే ఆయన మౌనంగా ఉండాలంటూ హుకుం జారీ చేశారని ...5లో

కేతు విశ్వనాథ్‌రెడ్డి కన్నుమూత



(ఫైల్)

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కథా రచయిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కథా రచయిత, రాయలసీమ కథారత్న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84) సోమవారం తెల్లవారు జామున 5.30 గంటలకు ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో గుండెపోటుతో ...2లో



విలక్షణ నటుడు శరత్ బాబు ఇకలేరు..

విషాదంలో తెలుగు చిత్రసీమ

- నేడు చెన్నైలో అంత్యక్రియలు

వివరాలు 10లో..

ఖర్గే, రాహుల్‌తో నితీశ్ భేటీ

- ప్రతిపక్షాల ఐక్యతపై చర్చ
- నెలన్నర వ్యవధిలో ఇది రెండో సమావేశం



న్యూఢిల్లీ : కేంద్రంలోని అధికార బీజేపీకి వ్యతిరేకంగా దేశంలోని వివిధ పార్టీల నాయకులతో చర్చలు జరుపుతూ వస్తున్న బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీని ...5లో

మా డిమాండ్లు పరిష్కరించాల్సిందే



కలెక్టరేట్ల వద్ద వీవోఏల ముట్టడి ఉద్రిక్తం

- పలుచోట్ల పోలీసుల అడ్డగింతలు
- తోపులాటలో సొమ్మసిల్లిన ఐకేపీ వీవోఏలు
- సీఐటీయూ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ- విలేకరులు

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 36 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు సోమవారం కలెక్టరేట్లను ముట్టడించారు. ఈ క్రమంలో పలు చోట్ల ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి పలువురు వీఓఏలు సొమ్మసిల్లి పడిపోయారు. సీఐటీయూ నేతలను అరెస్టు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎస్‌హెచ్‌జి సభ్యులకు పావుల వడ్డీ, శ్రీనిధి, అభయహస్తం డబ్బులు చెల్లించాలని కోరారు. ఐదు లక్షల ...2లో

లాఠీచార్జిని ఖండిస్తున్నాం

ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

వివరాలు 5లో..

జైలుకు పంపినా భూమిని వదలం

గుడిసెలు కూల్చడం కాదు.. ఇండ్లు నిర్మించండి

- పేదలది వెయ్యి శాతం న్యాయమైన పోరాటం
- భూమిపై జీవించే హక్కును కాల రాయొద్దు: మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి , సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య,డీజీ



నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పేదల గుడిసెలు కూల్చడం కాదు.. గృహాలు నిర్మించాలని, జైల్లో పెట్టినా భూమి వదిలేది లేదని, ప్రాణాలకు తెగించైనా భూ పోరాటం కొనసాగిస్తామని, పేదల గుడిసెలపైనే సీఎం కేసీఆర్ భవితవ్యం ఆధారపడి ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

కేతు విశ్వనాథ్‌రెడ్డి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య పద్మావతమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తెలుగు సాహిత్యంలో కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులైన ఆయన 1939 జులై పదిన కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం రంగసాయిపురంలో కేతు వెంకటరెడ్డి, నాగమ్మ దంపతులకు జన్మించారు. విశ్వనాథరెడ్డి అంత్యక్రియలు ఆయన సొంతూరులో మంగళవారం మధ్యాహ్నం జరగనున్నాయి. ఆయన మృతికి ఏపీ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

రాయలసీమ వేదనలకు అక్షరరూపమివ్వడంలో ఆయనది గొప్ప ముద్ర : తెలకపల్లి రవి, కెంగార మోహన్

భారతీయ సాహిత్యంలో తెలుగు కథను ఉన్నత శిఖరానికి చేర్చిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి మరణం తీరని లోటని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు కెంగార మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు సంతాప ప్రకటన విడుదల చేశారు. సాహితీ స్రవంతికి ప్రారంభం నుంచి తోడ్పాటునందించి సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో అనేక కథలు, వ్యాసాలు అందించారని, కథా సాహిత్యంలో ఆయన చిరస్మరణీయమైన కృషి చేశారని అన్నారు. అభ్యుదయ రచయితల ఉద్యమంలో విశాలాంధ్ర ప్రచురణాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయ సిలబస్‌ను రూపొందించడంలో భాష మాండలిక ప్రయోగాల అధ్యయనంలో రాయలసీమ వేదనలకు అక్షర రూపమివ్వడంలో ఆయనది గొప్పముద్ర అని పేర్కొన్నారు. కేతు విశ్వనాథరెడ్డి మరణం పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

కేతు విశ్వనాథరెడ్డి మరణం పట్ల తెలంగాణ సాహితి సంతాపం

అభ్యుదయ సాహిత్యోద్యమ నాయకుడు, ప్రసిద్ధ కథా రచయిత, పరిశోధకులు, విమర్శకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఆకస్మిక మరణం పట్ల తెలంగాణ సాహితి తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన, ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు, అమానవీయ వ్యవస్థకు, మతతత్వానికి వ్యతిరేకంగా సాహిత్య సృజన చేసి, ఎంతోమంది రచయితలకు ప్రేరణనిచ్చిన విశ్వనాథరెడ్డి నిబద్ధత, నిజాయితీ కలిగిన సాహిత్యకారుడని పేర్కొంటూ వారు జోహార్లర్పించారు.

తీర్చలేని లోటు : సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్

ఆధునిక తెలుగు సాహిత్య దిగ్గజ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి మరణం సాహిత్య రంగానికి తీరని లోటని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అకాడమీ కార్యాలయంలో విశ్వనాథరెడ్డి చిత్రపటానికి జూలూరు పూలమాలవేసి నివాళులర్పించారు. పాత్రికేయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన విశ్వనాథరెడ్డి... అధ్యాపకుడిగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశారని తెలిపారు. పాఠ్య పుస్తకాల రూపకల్పనలో సంపాదకుడిగా వ్యవహరించారని వివరించారు.

ఒక మంచి ఆత్మీయుడిని కోల్పోయా
-ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

విశ్వనాథరెడ్డి మరణంతో ఒక మంచి మిత్రుడిని, ఆత్మీయుడిని కోల్పోయానని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. ఇరవై ఏండ్ల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మహాసభల నిర్వహణలో విశ్వనాథరెడ్డి విశిష్ట పాత్రను పోషించారని తెలిపారు.

అరసం సంతాపం...

విశ్వనాథరెడ్డి మరణం పట్ల తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్వీ రామారావు, డాక్టర్ రాపోలు సుదర్శన్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. అరసం పునర్నిర్మాణం తర్వాత కార్యవర్గ సభ్యులుగా, అధ్యక్షులుగా,అధ్యక్షవర్గ సభ్యులుగా ఆ సంఘం నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారని పేర్కొంటూ నివాళులర్పించారు.

మా డిమాండ్లు పరిష్కరించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో వందలాది మంది వీవోఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో మండుటెండల్లో కలెక్టరేట్లను ముట్టడించారు. తమ సమస్యల్ని పరిష్కరించే వరకు తమ పోరాటం ఆపబోమంటూ బైటాయించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వందలాది మంది వీవోఏలు భారీ ప్రదర్శనగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అధికారులకు విన్నవిస్తామంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, నాయకులు అనిత ఇతరులను అరెస్టు చేశారు. వీవోఏలను ఈడ్చుకెళ్లారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తోపులాటలో పదుల సంఖ్యలో అస్వస్థతకు గురయ్యారు. కలెక్టరేట్ వద్దకు ఏపీడీ వచ్చి తమ పరిధిలో ఉన్నవి పరిష్కారం చేస్తామని, మిగతా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.నల్లగొండ కలెక్టరేట్‌ను ముట్టడించారు. సీఐటీయూ, వీఓఏలు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, 400మంది వీఓలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన వివోఏలు కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేట్ల ముందు బైటాయించి అధికారులు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులను వీవోఏలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కారు దిగి వచ్చి వారితో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖ మంత్రికి, సెర్ఫ్ సీఈఓకు, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు తెలియజేస్తామని చెప్పారు. దాంతో సీఐటీయూ నాయకులతో కలిసి ఐకేపీ వివోఏలు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు పోలీసులకు.. వీఓఏలకు వాగ్వాదం జరిగింది.కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీవోఏలు ధర్నా చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వరకు వీఓఏలు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఆసిఫాబాద్ జిల్లాలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. వీఓఏల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. అదనపు కలెక్టర్ రాజేశానికి దారి వదలకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. చివరకు 11 గంటలకు కలెక్టర్ వచ్చే సమయానికి వీఓఏలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో వీఓఏల ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజీత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు.

అవమానం

(మొదటిపేజీ తరువాయి)

సావర్కర్ పుట్టినరోజు నాడు భవనాన్ని ప్రారంభించడమంటే, స్వాతంత్ర్య సమరయోధులందరినీ అవమానించినట్టేనని అభిప్రాయపడ్డారు.

పార్లమెంట్ భూమిపూజ మొదలుకుని....

పార్లమెంట్ నూతన భవన నిర్మాణానికి 2020 డిసెంబర్‌లో భూమిపూజ చేసింది కూడా ప్రధాని మోడీనే. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఆ పని చేయించి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు అప్పుడే వ్యక్తం అయ్యాయి. మోడీ చర్యను సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం వంటి నేతలు తప్పుపట్టారు. ప్రధాని కార్యాలయానికి పార్లమెంట్ నిర్వహణ, పనితీరుతో ఎలాంటి సంబంధం ఉండదు. ప్రధాని కేవలం మంత్రిమండలికి నేతృత్వం వహిస్తారు. ఆయనకు పార్లమెంటులో ప్రత్యేకంగా ఎలాంటి హోదా ఉండదు. అలాంటప్పుడు మోడీ ఈ భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. అయితే ఎక్కడ భూమి పూజలు జరిగినా, ఎక్కడ ప్రారంభోత్సవాలు జరిగినా మోడీ హాజరై అన్నీ తానై జరిపిస్తుంటారనీ, బహుశా తన పేరిట అత్యధిక 'శిలాఫలకాలు' ఉండాలన్న కోరికతో ఇలా చేస్తూ ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నెహ్రూ స్మారకకేంద్రాన్ని సందర్శించని మోడీ

1964 మే 28వ తేదీనే భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంత్యక్రియలు జరిగాయి. మోడీ ప్రధానిగా తొలిసారి 2014 మే 26న ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆయన ఒక్కసారి కూడా నెహ్రూ స్మారక కేంద్రమైన శక్తివనాన్ని సందర్శించలేదు. నెహ్రూ కంటే సావర్కర్‌కే మోడీ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వదలచుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయోద్యమంలో భాగస్వాములైన నేతలను కాదని, ఆ ఉద్యమానికి వెన్నుపోటు పొడిచిన, చరిత్రను వక్రీకరించిన సావర్కర్‌కే ప్రాధాన్యం ఇవ్వడంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సావర్కార్ స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకోకపోగా, 1937లో నిర్బంధం నుండి విడుదలైన తర్వాత, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భారతదేశ యువత బ్రిటన్ దళాల్లో చేరాలంటూ పిలుపునిచ్చారు. ఆయన ఏనాడూ బ్రిటిష్ వారిని వ్యతిరేకులుగా చూసిన దాఖలాలే లేవు. సావర్కర్ దృష్టిలో ముస్లింలే హిందువులకు శత్రువులు. మహాత్మాగాంధీ హత్యకు జరిగిన కుట్రలో సావర్కర్ కూడా నిందితుడే. విచారణలో కోర్టు ఆధారాలు లేని కారణంగా ఆయన్ని నిర్దోషిగా విడిచిపెట్టినప్పటికీ, గాంధీని హత్య చేసిన గాడ్సే, ఆతని సన్నిహితుడు నారాయణ్ ఆప్టేలను ఆయనే ప్రభావితం చేశాడనేది వాస్తవం. ఈ అభిప్రాయంతో ఎవరూ విభేదించడం లేదు. 1966లో సావర్కర్ చనిపోయారు. ఇందిర, వాజ్‌పేయిల హయాంలో ఆయనకు సముచిత ప్రాధాన్యతే లభించింది. సావర్కర్ పేరిట ఇందిర ప్రభుత్వం తపాలా బిళ్లను విడుదల చేస్తే, వాజ్‌పేయి సర్కారు ఆయనకు ఏకంగా భారతరత్న ఇచ్చేందుకు సిద్ధపడింది. అయితే అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆ ఫైలుపై సంతకం చేసేందుకు నిరాకరించడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. అయినప్పటికీ కేంద్రం ఆయన చిత్రపటాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాలులో ఆవిష్కరించింది. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సావర్కర్ పుట్టినరోజు నాడు ఆ చిత్రపటానికి పూలమాలలు వేస్తూ నివాళులు అర్పిస్తూనే ఉన్నారు. ఎన్ని విమర్శలు వెల్లువెత్తినా, ప్రధాని మోడీ మాత్రం ఈ నెల 28న సావర్కర్ పుట్టినరోజు నాడే పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రారంభించేందుకే సిద్ధమవుతున్నారు.



ఊగిసలాట

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ చైర్మెన్‌గా ఉండనీ, రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని అధిష్టానాన్ని కోరినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికల విషయంలో దూకుడేది అని అధిష్టానం ప్రశ్నిస్తే...పార్టీలోని ఓ వర్గం సహకరించడం లేదంటూ ఆయన ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అదే సమయంలో కొండావిశ్వేశ్వర రెడ్డి రాష్ట్ర బీజేపీ నాయకత్వంలో కొన్ని మార్పులు అవసరమనీ, అధికారంలోకి రావాలంటే ఇప్పుడున్న స్పీడ్ చాలదంటూ మీడియా ఎదుట విశ్లేషణ చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో తాను కేసీఆర్‌ను ఓడించే వారెవ్వరితోనైనా జట్టు కడతాననీ ప్రకటించడం కమలంలో కలకలం సృష్టించింది. లిక్కర్ స్కామ్ కేసులో కవిత అరెస్టుపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అసందర్భంగా పదేపదే వ్యాఖ్యలు చేయడం, ఇప్పటి వరకు ఆమె అరెస్టు కాకపోవడం వంటి అనేక విషయాలను అసంతృప్తనేతలు ప్రస్తావిస్తున్నారు. నోటికొచ్చిన మాటలు మాట్లాడి బండి పార్టీకి నష్టం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. బండికి వ్యతిరేకంగా ఆపార్టీ ఎంపీ అర్వింద్‌కుమార్ కూడా కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. కవితపై బండి చేసిన కామెంట్స్ బండి వ్యక్తిగతమనీ, దానికీ బీజేపీకి సంబంధం లేదంటూ ఆయన పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో రహస్యంగా చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తుంది. మరోవైపు కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లి, మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటమి పాలైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా పునరాలోచనలో ఉన్నట్టు సమాచారం. ఓటమి తర్వాత ఆయన పార్టీలో ఎక్కడా క్రియాశీలంగా కనిపించట్లేదు. మాజీ ఎంపీ జీ వివేక్ కూడా పార్టీలో తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వట్లేదంటూ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. ఇప్పుడు బీజేపీ నుంచి ప్రజాప్రతినిధులుగా ఉన్నవారిలోనూ ఆ పార్టీలో ఉంటే తాము గెలవలేమోనన్న సందేహం మొదలైంది. దీంతో వారంతా కాంగ్రెస్, బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని సమాచారం. బీజేపీలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీల్లో వారిలో వారికే సఖ్యత లేదనే చర్చా జరుగుతున్నది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు బీజేపీ అధికారిక కార్యక్రమాల్లో మొక్కుబడిగా పాల్గొంటున్నారు. ఖమ్మం జిల్లా నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు నిన్న మొన్నటి వరకు కమలం కండువా కప్పుకొనే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. కర్నాటక ఫలితాల తర్వాత వారు కూడా పునరాలోచనలో పడినట్టు తెలుస్తుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీలో ఈ ముసలం తారాస్థాయికే చేరేట్టు కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో ప్రగతి ప్రస్థానాన్ని ప్రతిబింబిద్దాం...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానాన్ని, దాని అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన లోగోను ఆయన సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు.

కాళేశ్వరం వంటి సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్తు, వ్యవసాయం, మిషన్ భగీరథ, సాంస్కృతిక రంగాలు, యాదాద్రి వంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, మెట్రో రైలు, టీ-హబ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం చిహ్నాలను సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు లోగోలో పొందుపరిచారు. వీటితోపాటు తెలంగాణ తల్లి, బతుకమ్మ, బోనాలు, పాలపిట్ట, అమరవీరుల స్మారకం, తెలంగాణ అస్తిత్వ చిహ్నాలతో రాష్ట్ర ఖ్యాతి మరింత ఇనుమడించేలా అది రూపుదిద్దుకున్నది.లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ శాంతి కుమారి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పర్సా జీవితం ఆదర్శనీయం

- ఆయన అడుగుజాడల్లో నడవాలి
- పర్సా వర్థంతి సభలో పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

సుదీర్ఘకాలం కార్మికోద్యమంలో సేవలందించిన పర్సాసత్యనారాయణ జీవితం ఆదర్శనీయమనీ, ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేసిన పర్సా సత్యనారాయణ ఎనిమిదో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..19 ఏండ్ల వయస్సులోనే పర్సా తన ఉద్యమ జీవితాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. కార్మికుల జీవితాల్లో వెలుగు నింపడానికి ఉద్యమాలను ఆయుధంగా చేసుకున్నారని కొనియాడారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లు - మతోన్మాద శక్తులతో కలిసిపోయి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. నయా ఉదారవాద విధానాలకు మతోన్మాదం తోడై కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదని వాపోయారు. ఈ పరిస్థితుల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే పర్సాకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయన నిరాడంబర జీవితాన్ని గడిపారని గుర్తుచేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ మాట్లాడుతూ గని కార్మికుల జీవితాల్లో మార్పు కోసం చేసిన పోరాటాల్లో పర్సా తన ఉద్యోగాన్ని సైతం కోల్పోయారన్నారు. ఆయన ఆశయాల్ని ముందుకు తీసుకు పోవడానికి మరింత పట్టుదలతో కృషి చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు కె. ఈశ్వర్‌రావు, పి. శ్రీకాంత్, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. కోటంరాజు, ఎస్ఎస్ఆర్ఎ ప్రసాద్, యాటల సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత తదితరులు పర్సా చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.


నల్లగొండలో...


జనగామలో...



కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేసి.. వినతిపత్రాలు అందజేశారు.

కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందిని
రెగ్యులరైజ్ చేయండి

- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నా

నవతెలంగాణ- విలేకరులు

వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంకట్‌రత్నం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్ పనిచేస్తున్న ఉపాధ్యా యుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య డిమాండ్ చేశారు. రంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీటీడి కల్యాణ మండపం వద్ద ధర్నా నిర్వహించారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.కురుమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంతచారి మద్దతు తెలిపారు. కేజీబీవీ యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులకు బేసిక్‌పే మంజూరీ చేసి రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కేజీబీవీ యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు బేసిక్ పే ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి, సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తదనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కేజీబీవీ, యుఆర్ఎస్ సిబ్బంది వనపర్తి కలెక్టర్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవి ప్రసాద్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం ఏవో మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గా భవాని మాట్లాడుతూ.. కస్తూర్బా బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బందిలో దాదాపు అందరూ మహిళలేనని తెలిపారు. వారి సేవలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజే శారు. ఆసిఫాబాద్, ఆదిలాబాద్ కలెక్టర్గేట్ల ఎదుట ధర్నా చేపట్టారు. జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు బైటాయించి ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి చొరవచూపిన..

- తమ్మినేనికి కృతజ్ఞతలు తెలిపిన వీఆర్ఏ జేఏసీ



నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్రవ్యాప్తంగా 80 రోజుల పాటు దీర్ఘకాలిక సమ్మె చేసి, రెగ్యులరైజేషన్, ఇతర పెండింగ్ సమస్యలు సాధించుకున్న వీఆర్ఏలకు అండగా నిలబడిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వీఆర్ఏ జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో తమ్మినేనిని కలిసిన వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర నాయకులు.. అయన్ని శాలువాతో సన్మానించి, బోకే ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ జేఏసీ కో చైర్మెన్ రమేష్ బహదూర్, సెక్రెటరీ జనరల్ ఎస్కే దాదేమియా మాట్లాడుతూ.. వీఆర్ఏల పోరాటంకు మొదటి నుంచి అండగా నిలబడి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి మూడు దఫాలుగా బహిరంగ లేఖలు ముఖ్యమంత్రికి రాశారని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, అధికారులు, మంత్రుల దృష్టికి తమ సమస్యను తీసుకుపోయి పరిష్కారం చేయడానికి తమ్మినేని చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. వీఆర్ఏల సమ్మె పోరాటం జరిగినన్ని రోజులు హైదరాబాద్‌లో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, మాకినేని బసవపున్నయ్య భవనాలు తమ పోరాటానికి, సభలు సమావేశాలు పెట్టుకోవడానికి అవకాశం కల్పించి, పోరాటానికి అండ దండ కల్పించిన సీపీఐ(ఎం)కు రాష్ట్రంలో ఉన్న 23,000 మంది వీఆర్ఏలు రుణపడి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. వీఆర్ఏల అన్ని సంఘాలు ఐక్యమై జేఏసీగా ఏర్పడి సమరశీలంగా పోరాటం చెయ్యటం ఫలితంగానే ప్రభుత్వం దిగి వచ్చి వారి సమస్యలు పరిష్కరించిందని తెలిపారు. నూతన సెక్రటేరియట్‌లో మొదటి క్యాబినెట్ సమావేశంలో వీఆర్ఏల రెగ్యులరైజేషన్ ప్రకటించటం హర్షించదగినదన్నారు. వెంటనే వీఆర్ఏలకు క్యాబినెట్ నిర్ణయం ప్రకారం జీవోలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ్మినేనిని కలిసిన వారిలో వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ వంగూరు రాములు, ఎస్ కే రఫీ, మాధవ నాయుడు, సీఐటీయూ ఖమ్మం జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు వై విక్రం, రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, ఖమ్మం జిల్లా వీఆర్ఏ జేఏసీ చైర్మెన్ అజీజ్ ఖాన్, భరత్ జానీమియా తదితరులు ఉన్నారు.

బెంగాల్‌లో ఉపాధి హామీ దూరం

- కోటి సంతకాలతో సీజేఐ కి విజ్ఞప్తి
- ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి వెంకట్



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో ఏడాదిగా గ్రామీణ పేదలు ఉపాధి హామీకి దూరమయ్యారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం అవినీతి, అరాచకత్వానికి తోడు కేంద్ర ప్రభుత్వ ద్రోహం వల్ల కోట్లాది మంది బెంగాల్ గ్రామీణ పేదలు ఉపాధి హామీని కోల్పోయారని విమర్శించారు. బెంగాల్‌లో ఉపాధి హామీ పనులు, గ్రామీణ పేదల స్థితిగతులను పరిశీలించేందుకు ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, బెంగాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుషార్ ఘోష్ నాయకత్వంలోని బృందం సోమవారం అనేక గ్రామాల్లో పర్యటించింది. ఉపాధి హామీ పనులు లేక, ఇతర పనులేమీ లభించక, వలసలుపోలేక జీవనం కడు దుర్భరంగా మారిందని బృందానికి గ్రామీణ పేదలు చెప్పుకున్నారని వెంకట్ తెలిపారు. బెంగాల్‌లో మూడు కోట్ల మందిపైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారని, వారికి వంద రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని అన్నారు. పని కల్పించలేక పోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని చట్టం చెబుతున్నదనీ, ఆ చట్టాన్ని చాప చుట్టే చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని విమర్శించారు. గత ఏడాది క్రితం ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు రూ. 5,520 కోట్లకుపైగా ఉపాధి బకాయిలు ఉన్నాయనీ, నిజమైన లబ్దిదారులకు ఏడాది కాలంగా ఈ డబ్బులు అందక నిస్సహాయ స్థితిలో పేదలు ఉన్నారని తెలిపారు.

ఇక 'దూకుడే'!

- పీపుల్స్ మార్చ్ పేరుతో బహిరంగ సభలు
- జూన్ 2న బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ ఆఫీస్‌కు శంకుస్థాపన
- సోనియాగాంధీ లేదా ప్రియాంకగాంధీ హాజరు?
- టీపీసీసీ విస్తృత సమావేశంలో కీలక నిర్ణయాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ సన్నద్ధమవుతున్నది. కర్నాటక ఫలితాల జోష్‌లో తమ క్యాడర్‌ను సంసిద్ధత చేసుకుంటున్నది. పార్టీ రూపొందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని కార్యాచరణకు సిద్ధమవుతున్నది. ముందస్తుగానే ఎన్నికల కదనరంగంలోకి దూకాలని ఆదేశించింది. వడివడిగా అడుగులేస్తూ...ప్రజలకు చేరువ కావాలని దిశానిర్దేశం చేసింది. పార్టీ అధిష్టానం నుంచి ఏ కార్యక్రమాన్ని పిలుపునిచ్చినా తూ చ తప్పకుండా నిర్వర్తించాలని చెప్పింది. అందుకనుగుణంగా క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో పని చేయాలని సూచించింది. సోమవారం ఈమేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలుకీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ మార్చ్ పేరిట సభలు, సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. జూన్ 2న బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి శంకుస్థాపనకు సోనియాగాంధీ లేదా ప్రియాంకగాంధీని ఆహ్వానించాలని భావిస్తున్నది. అదే రోజు పరిస్థితులు అనుకూలిస్తే నల్లగొండ జిల్లాలో పీపుల్స్ మార్చ్ సభ భారీ ఎత్తున నిర్వహించాలని ఆ జిల్లాకు చెందిన నేతలు భావిస్తున్నారు. జూన్ 25న జడ్చర్లలో మరో బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సభకు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గ్లెహాట్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను ఆహ్వానించాలని నిర్ణయించారు. తర్వాత ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నారు. ఈ మొత్తం సభలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావారణాన్ని తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నది.

దశాబ్ది ఉత్సవాలు కాదు....దశాబ్ది దగా

దశాబ్ది వేడుకలు...శతాబ్ది అభివృద్ధి' పేరుతో జూన్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఉత్సవాలను కాంగ్రెస్ తప్పుపట్టింది. తెలంగాణ ఏర్పడిన పదేండ్లలో ప్రజలను దగా చేసిందంటూ విమర్శలు చేసింది. అందుకే దశాబ్ది దగా పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని ఊరూరా ప్రచారం చేయాలని నిర్ణయించింది. జూన్ 2న సోనియా గాంధీకి ధన్యవాదాలు చెప్పే కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చింది. సమావేశానంతరం పార్టీ నేతలు సంపత్‌కుమార్, పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ టీపీసీసీ విస్తత స్థాయి సమావేశంలో మూడు తీర్మానాలు అమోదించినట్టు తెలిపారు. భారత్ జోడోయాత్ర ఫలితాన్ని కర్నాటకలో చూశామని పేర్కొన్నారు. చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన కర్నాటక ప్రజలను అభినందిస్తూ తీర్మానం చేసినట్టు తెలిపారు. రబ్బరు చెప్పులతో వచ్చి కోట్ల రూపాయలు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. జూన్ 18న రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ ఉంటుందనీ, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పరిచయాలు ఉన్నంత మాత్రానా టికెట్లు రావు : ఠాక్రే

'బాధ్యత ఇచ్చిన తర్వాత పని చేయలేకపోతే పని చేయలేమని చెప్పేయండి. బాధ్యతలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదు. పని చేయని వారిని పక్కన పెట్టేద్దాం. సర్వేల ఆధారంగా టికెట్ల వస్తాయి. పరిచయాలు ఉన్నంత మాత్రానా టికెట్లు రావు' అంటూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే చెప్పారు. కాంగ్రెస్ పార్టీని నష్టపరిచే పనులు ఎవరు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. పొరపాటున కూడా పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరించకూడదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీతో స్నేహంగా ఉన్నారని చెప్పారు. ఈ అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ప్రజా సమస్యలపై అన్ని స్థాయిల్లో పోరాట కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

పేదలపై పోలీసుల జులుం వద్దు..

అధైర్యపడొద్దు..
అండగా ఉంటాం..

- పట్టాలిచ్చే వరకు మీ వెంటే ఉంటాం.. : గుడిసెవాసులతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-నర్సంపేట

నిల్వ నీడలేని పేదలపై పోలీసులు జులం ప్రదర్శించడం మానేసి చట్టాన్ని గౌరవించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం వరలంగల్ జిల్లా నర్సంపేట పట్టణం కాకతీయ నగర్‌లోని సర్వే నెంబర్ 601/1/1లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను సందర్శించి, వారి సమస్యలను అడిగి తెల్సుకున్నారు. పోలీసులు భూకబ్జాదారులతో కలిసి వచ్చి ఖాళీ చేయాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేదలు ఏకరువు పెట్టారు. 'అధైర్యపడొద్దు..అండగా ఉంటామని, ప్రభుత్వం పట్టాలిచ్చే వరకు మీ వెంటనే ఉంటామంటూ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గుడిసెవాసులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించి పట్టాలివ్వాలని ఇటీవల మండలి సమావేశాల్లో ప్రస్తావించానని గుర్తు చేశారు. ఇండ్ల స్థలాల కోసం పేదలు చేపట్టిన పోరాటం న్యాయమైనదని, నిల్వ నీడ లేకనే కష్టమైనా 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకొని ఇక్కట్ల పాలవుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను ఎక్కడికక్కడ ఆక్రమించుకొన్న వారి జోలికి పోకుండా పోలీసులు పేదలపై తమ జులం ప్రదర్శించడం సరైందికాదన్నారు. పోలీసులు క్రిమినల్ కేసులు ఉన్న నేరస్తుల వద్దకు వెళ్లాలే తప్పా ఇలా పేదల గుడిసెలను ఖాళీ చేయించడానికి వారికి ఎలాంటి అధికారాలు ఉన్నాయని ప్రశ్నించారు. చట్టం పట్ల పోలీసులకు ఏమాత్రం గౌరవం ఉన్నా పేదల జోలికి వెళ్లొద్దని హితవు పలికారు. ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఈ హామీని ప్రభుత్వ అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పటి వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరాటాల్లో పాలుపంచుకొంటూ ఇండ్ల స్థలాల పట్టాలను సాధించుకోవాలని సూచించారు. సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ.. నర్సంపేట పట్టణంలోని సర్వే నెంబర్ 601లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న పేదలపై కొందమంది భూకబ్జాదారులతో చేతులు కలిపిన పోలీసులు.. వారిని ఇండ్ల నుంచి ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములపై పేదలకు మాత్రమే హక్కు ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల గుడిసె పోరాటాలకు ప్రభుత్వం తలవంచి జీవో 58,59 కింద పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించిందని తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెలు కాపాడేందుకు మరిన్ని పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, గుజ్జుల ఉమ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కర్నాటక తరహా సమాధానం

- ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా బహిరంగ సభలో వక్తలు
- విశాఖలో ప్రారంభమైన ఎల్ఐసీఏఓఐ ఆరో జాతీయ మహాసభ
- వందలాది మందితో భారీ ప్రదర్శన



గ్రేటర్ విశాఖ : కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలతో ఉద్యోగులు, కార్మికులు పెను సవాళ్లను ఎదుర్కొనడమే కాక ప్రభుత్వ రంగం కనుమరుగై దేశం సర్వనాశనమయ్యే పరిస్థితులు దాపురించాయని, ఈ నేపథ్యంలో ఆ పార్టీకి ఎన్నికల్లో కర్నాటక తరహా సమాధానం చెప్పాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సోమవారం ఉదయం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీఏఓఐ) ఆరో జాతీయ మహాసభ ప్రారంభమైంది. తొలుత ఎల్ఐసీలో ఏజెంట్ల వ్యవస్థకు హాని తలపెట్టే చర్యలను కేంద్రం విరమించుకోవాలంటూ ఎల్ఐసీ ఏజెంట్లు నగరంలోని ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సెంట్రల్ పార్క్ మీదుగా జీవిఎంసి గాంధీ విగ్రహం వరకూ భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జాతీయ కార్యదర్శి కె.ఉమేష్ మాట్లాడుతూ.. దేశంలో 2019లో రెండోసారి మోడీ అధికారం చేపట్టాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నేషనల్ మానిటైజేషన్ పాలసీ కింద కార్పొరేట్లకు కట్టబెట్టడం, అందుకు తగ్గట్టుగా కార్మిక చట్టాలను మార్చేసి ఉద్యోగులు, కార్మికులపై దాడిచేయడం ఉధృతమైందన్నారు. కర్నాటకలో విద్యుత్, ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్లను అసెట్స్ మానిటైజేషన్ పేరుతో రూ.29 వేల కోట్ల విలువైన ఆస్తులను అమ్మకానికి పెట్టిన ఫలితంగా అక్కడి ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5న బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఢిల్లీలో లక్షల మంది కార్మికులు, ఉద్యోగులతో జరగనున్న కన్వెన్షన్‌లో 'దేశ రక్షణ నినాదాలు' మార్మోగనున్నాయన్నారు. బీజేపీకి లోక్‌సభలో మెజారిటీ ఉండొచ్చేమోగానీ వీధుల్లో లేదని తెలుసుకోవాలన్నారు.

నయా ఉదారవాద విధానాలతో దేశానికి ముప్పు : హేమలత

నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో ప్రభుత్వ రంగం, సహజ వనరులన్నీ కార్పొరేట్లచే లూటీ చేయబడి దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందని సీఐటీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో అఖిల భారత మహాసభ ప్రతినిధుల సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం ఉందనీ, తాజాగా అమెరికాలోని మూడు బ్యాంకులు మూతపడ్డాయని, స్విట్జర్లాండ్‌లోనూ ఇదే స్థితి కనిపిస్తున్నదని అన్నారు. దేశంలోని పెట్టుబడిదారులు ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి కార్మికుల హక్కులపై దాడి చేయడం, ఆర్థిక వ్యవస్థలను కాజేసే పథక రచనలు, సహజ వనరులను దోచేసే వ్యూహాలతో ముందుకెళ్తూ మరింత బలోపేతమవుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. రానున్న కాలంలో దేశ కార్మికవర్గం నయా ఉదారవాద విధానాలను ఓడించేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని ఆమె కోరారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలో 18 రాష్ట్రాల నుంచి 500 మంది ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

గేట్లు...ప్రధాన కాల్వల మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలి : తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 56 సంవత్సరాలుగా 20 లక్షల ఎకరాలకు సాగునీరు, ఎనిమిది జిల్లాలకు త్రాగునీరు అందిస్తున్నదని తెలంగాణ రైతు సంఘం పేర్కొంది. అంత ప్రాధాన్యత కలిగిన భారీ ప్రాజెక్టు క్రెస్ట్ గేట్లను ఎప్పుడూ రిపేర్లు చేయాల్సి వస్తున్నదని తెలిపింది. ప్రధానంగా ఎడమ కాలువ నీరు వదలగానే ఎక్కడో ఒక చోట తెగిపోవడం, వేలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లడం కొనసాగుతున్న దని ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు సోమవార ం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ బ్యాంకు సహాయంతో రూ.4,444 కోట్లతో నాగార్జున సాగర్, సాగర్ ఆయకట్టు కాలువలు రిపేర్లు చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్ నుంచి 50 శాతాన్ని భరించిందని తెలిపారు. మళ్ళ ఎడమ కాలువ రిపేర్లకు వచ్చిందని పేర్కొన్నారు. మరో 15-20 రోజుల్లో వర్షాలు మొదలైతే ప్రాజెక్టులోని నీరు చెడిపోయిన క్రెస్ట్ గేట్ల ద్వారా సముద్రం పాలవుతాయని గుర్తు చేశారు. డెడ్ స్టోరేజీ 130 టీఎంసీలు ఉండాలనీ, ఆ నీరు కూడా బయటకు వెళ్ళిపోతే తిరిగి డెడ్ స్టోరేజీతోపాటు మొత్తం ప్రాజెక్టు నిండడానికి చాలా కాలం పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల్లోని గేట్లు కూడా పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయని వివరించారు. కడెం ప్రాజెక్టు గేట్లు అనేక సార్లు దెబ్బతిన్నాయనీ, ఒకసారి ప్రాజెక్టుకు గండి పడగా ఆ ప్రాంతంలో కొత్తగా ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. అయినప్పటికీ ఇంకా రిపేర్లు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఖమ్మం, అసిఫాబాద్ జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల క్రెస్ట్ గేట్ల పరిస్థితి కూడా అధ్వాన్నంగానే ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సేవలందిస్తున్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల రిపేర్లకు నిధులు కేటాయించినప్పటికీ, సకాలంలో విడుదల చేయక పోవడంతో దీర్ఘకాలంపాటు రిపేర్ల కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. జనవరి నుంచి మే ఆఖరి వరకు మాత్రమే ప్రాజెక్టు రిపేర్లకు అవకాశాలు ఉంటాయనీ, జూన్‌లో వర్షాల వల్ల రిపేర్లకు ఆటంకం ఏర్పడుతుందని వివరించారు. ఈ క్రమంలో ఇరిగేషన్ శాఖ నిర్లిప్తత కారణంగా 100ల టీఎంసీలు వధాగా సముద్రంపాలవుతున్నాయని విమర్శించారు. సాగు నీటికి వేల కోట్ల ఖర్చు పెడుతున్న ప్రభుత్వం అర్.ఆర్.గ్రాంట్స్ కింద కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి ఈ నెలాఖరు నాటికి అన్ని ప్రాజెక్టుల గేట్లు, ప్రధాన కాల్వలు, పంట కాల్వలను రిపేర్లు చేయాలని డిమాండ్ చేశారు. అందుకనుగుణంగా ఇప్పటికే ప్రణాళిక రూపొందించుకుని పని చేయాలని సూచించారు. ఇప్పటికైనా త్వరితగతిన దెబ్బతిన్న ప్రాజెక్టుల రిపేర్లను పూర్తి చేయుటకు కేంద్రీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రాజెక్టుల, కాల్వల రిపేర్లు సకాలంలో జరక్కపోవటంతో అనేక నష్టాలు జరిగాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా నిర్మాణ పనుల్లో అవినీతి జరుగకుండా రిపేర్లు చేయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం వచ్చాకే మత్స్యరంగం అభివృద్ధి

- జూన్ 8న అన్ని జిల్లా కేంద్రాల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మత్స్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందని, మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని మత్స్య భవన్‌లో సోమవారం జరిగిన మత్స్య సహకార సొసైటీల చైర్మెన్ పిట్టల రవీందర్ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌కు మంత్రి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభలో మంత్రి మాట్లాడుతూ.. మత్స్యరంగంపై ఎంతో అనుభవం ఉన్న పిట్టల రవీందర్ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టడం వల్ల ఈ రంగం మరింత అభివృద్ధిలో ముందుకు వెళుతుందని అన్నారు. వివిధ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబాల్లో వెలుగులు నింపడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేదే సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా కోట్లాది రూపాయలతో అన్ని నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్టు చెప్పారు. చేపలను తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. వివిధ రకాల చేపల వంటకాలను అమ్ముకోనేందుకు వీలుగా సంచార విక్రయ వాహనాలను ప్రభుత్వం అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంకా మిగిలిన అర్హులైన మత్స్య కారులకు కూడా సబ్సిడీపై వాహనాలు అందజేసే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వచ్చే నెల 8వ తేదీన మృగశిర కార్తె సందర్భంగా మొదటి సారిగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల చేపల వంటకాలకు స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్ రెడ్డి, నారదాసు లక్ష్మణరావు, కార్పొరేషన్ చైర్మెన్‌లు దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, కోలేటి దామోదర్ గుప్తా, గెల్లు శ్రీనివాస్ యాదవ్, అల్లం నారాయణ, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో మంత్రి గంగుల కమలాకర్ చర్చలు సఫలం

- సమ్మె ఉపసంహరిస్తున్నట్టు ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్లతో పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. రేషన్ డీలర్లు జూన్ ఐదు నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రితో రేషన్ డీలర్ల జేఏసీ చైర్మెన్ నాయికోటి రాజు, వైస్ చైర్మెన్ బంతుల రమేష్ బాబు, కన్వీనర్ దుమ్మాటి రవీందర్, కో కన్వీనర్ గడ్డం మల్లికార్జున్ సమావేశమై 22డిమాండ్లపై చర్చించారు. 20 సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నట్టు మంత్రి వారితో తెలిపారు. వీటికి సంబంధించి వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. గౌరవ వేతనం, కమీషన్ పెంపు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మాటిచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌పై తమకు సంపూర్ణ నమ్మకం ఉందనీ, సమ్మె ఆలోచనను విరమించుకుంటున్నట్టు ప్రకటించారు.

అర్హులైన వారికి మైనారిటీ కార్పోరేషన్ లోన్లు ఇవ్వాలి : ఆవాజ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీ నిరుద్యోగ యువతకు, పేదలకు, చిన్న వ్యాపారస్తులకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వెంటనే లోన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆలం ఖుంద్ మీరి భవన్‌లో అజీజ్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏండ్ల తరబడి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లోన్లు ఇవ్వటం లేదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ తెలిపారు. మైనార్టీ యువత పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని విమర్శించారు. నిధుల లేమితో కార్పొరేషన్ ఎలాంటి పథకాలు అమలు చేయలేక పోతున్నదని తెలిపారు. దీంతో లక్షలాది మంది మైనారిటీ యువతకి అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా యువతకి లక్ష రూపాయలు డైరెక్ట్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలు విలువగల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. వాటి రక్షణ కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ పవర్ కల్పించి వక్ఫ్ భూములను పరిరక్షించాలని కోరారు. మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న సమస్యల్ని పరిష్కరించి, సౌకర్యాలు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించాలని, మతోన్మాద ఫాసిస్టు శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలను చైతన్య పరిచే విధంగా రాజ్యాంగ రక్షణ కోసం కషి చేయాలని రాష్ట్ర కమిటీ పలు తీర్మానాలు చేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర కోశాధికారి అబ్దుల్ సత్తార్, సీనియర్ నాయకులు పాషా, అజ్మత్ ఖాన్, అక్మల్ పాషా, యాకూబ్, ఖలీమ్, నశీర్, ఇబ్రహీం, ఖాజా, బాబా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రజాస్వామ్యంపై ప్రత్యక్షదాడి!

ప్రజాస్వామ్యంలో ఓటుకు విలువ లేకుండా ఉంటుందా? అలాంటప్పుడు ప్రజాస్వామిక ఎన్నికలకు అర్థం ఏముంటుంది? అధికారాలన్నిటినీ కేంద్రం తన వద్ద పెట్టుకుంటే ప్రజలచేత ఎన్నికైన ప్రభుత్వాలు ఏమి చేయాలి? సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా

> కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు, రాజ్యాంగ దుర్వినియోగాలకు దేశంలో కమ్యూనిస్టులే తొలి బాధితులు. 1959లో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే కూలదోసింది. అంతకంటే ఎక్కువగా మోడీ హయాంలో బీజేపీ ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నది. తాజాగా ఢిల్లీ సర్కార్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ధిక్కరించే ఈ చర్య మోడీ ప్రభుత్వ దారుణమైన నియంతృత్వ స్వభావానికి మచ్చుతునక.

పాటించకుండా.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి భిన్నంగా రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తుండటం ఏమి వైఖరి? కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటం ముఖ్యమైన విధి. కానీ మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఫెడరలిజం అన్న మాటకు విలువ లేకుండా ధ్వంసం చేస్తోంది. బ్యూరోక్రసీ నియంత్రణతో సహా ప్రధాన పాలనా రంగాలపై ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి గల హక్కులను పరిరక్షిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునివ్వగా, అందుకు విరుద్ధంగా కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం దారుణం. ఇది కోర్టు ధిక్కరణే కాదు, ముమ్మాటికీ సమాఖ్య స్వభావంపైనా, సుప్రీంకోర్టు నిర్వచించిన ప్రజాస్వామ్య పాలనపైనా ప్రత్యక్షదాడి.



కేంద్ర ప్రభుత్వం ఢిల్లీపై తనదే అధికారం అని స్వయంగా ఎనిమిదేండ్ల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. దానిని ఢిల్లీ ప్రభుత్వం కేజ్రీవాల్ నాయకత్వంలో సవాల్ చేయగా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం 11 మే 2023 రోజున తీర్పు చెప్పింది. ఢిల్లీ శాంతి భద్రతలు, పోలీస్ శాఖ, భూమి మినహా మిగిలిన పరిపాలనా వ్యవహారాలపై పూర్తి అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానివే అని స్పష్టం చేసింది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికే అధికారాలుంటాయని అత్యున్నత న్యాయస్థానమే స్పష్టం చేసినా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టడ మంటే... న్యాయస్థానాల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల వారికి ఎలాంటి గౌరవముందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కర్నాటక ప్రజలు కేంద్రం విధానాలను వ్యతిరేకిస్తూ స్పష్టంగా తీర్పు చెప్పినా చెవికెక్కించుకోలేదంటే.. ఎవరి మార్గదర్శకత్వంలో ఈ ప్రభుత్వం పని చేస్తోందో తెలుస్తోంది.

ఎన్నికైన సర్కార్ కొలువుదీరి ఉన్నప్పుడు అన్ని అధికారాలు తమ గుప్పిట్లోనే ఉండాలనుకోవడం ఏమి నీతి? కర్రపెత్తనం చేస్తామనడం ఎంతవరకు సమంజసం? ఢిల్లీ ప్రభుత్వమేమీ ఉత్సవ విగ్రహం కాదు. ఢిల్లీ ప్రత్యేకతల రీత్యా రాజ్యాంగంలోని 239-ఎఎ అధికరణం ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు శాంతి భద్రతలు, పోలీసులు, భూములను రిజర్వ్ చేశారు. పాలనాధికారమంతా ప్రజలెన్నుకున్న ప్రభుత్వానిదే. ఆ అధికారాలు కూడా కేంద్రం తమకే కావాలనడం ప్రజాతీర్పును అవమానించడమే.


కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు, రాజ్యాంగ దుర్వినియోగాలకు దేశంలో కమ్యూనిస్టులే తొలి బాధితులు. 1959లో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే కూలదోసింది. అంతకంటే ఎక్కువగా మోడీ హయాంలో బీజేపీ ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నది. తాజాగా ఢిల్లీ సర్కార్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ధిక్కరించే ఈ చర్య మోడీ ప్రభుత్వ దారుణమైన నియంతృత్వ స్వభావానికి మచ్చుతునక. నిత్యం ప్రజాస్వామ్య నీతి సూత్రాలు వల్లిస్తూ నాలుకను పలు రకాలుగా మడతవేసి వాటికి పూర్తి బిన్నమైన వైఖరిని ప్రదర్శిస్తూ, రాజ్యాంగ విలువలు, మర్యాదలను వెక్కిరిస్తూ అపహాస్యం చేసే ఈ తీరును ఏమనాలి? ఇది కేవలం ఢిల్లీ ప్రభుత్వానికో, ఢిల్లీ ప్రజలకో మాత్రమే సంబంధించిన అంశం కాదు. ఈదేశ సమాఖ్య వ్యవస్థను కేంద్రప్రభుత్వం ధ్వంసం చేస్తున్నందున దేశప్రజలందరి సమస్య. కేంద్రం నిర్ణయాన్ని ప్రజాస్వామిక వాదులందరూ వ్యతిరేకించాలి. ఆర్డినెన్స్‌ను తక్షణమే ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలి.

అమెరికా రుణపరిమితి వివాదం

> అమెరికాలో ఉదారబూర్జువా వైఖరి అవలంబిస్తున్న బైడెన్ ప్రభుత్వం మరోపక్కన చాలా ఎక్కువ దేశాలమీద ఆంక్షలు విధించడానికి మొగ్గు చూపిస్తోంది. ఈ ఆంక్షల ఫలితాలు అమెరికాలో ఉదారబూర్జువా దృక్పథాన్ని అమలు చేయడానికి ఆటంకంగా పరిణమిస్తున్నాయి. ఒకవైపున నయా ఉదారవాదంతో ప్రేరణ పొందిన సామ్రాజ్యవాద ఆధిపత్యధోరణిని సమర్థిస్తూ మరోపక్క కీన్స్ సూచించిన ఉదారవాద సంక్షేమ విధానాలను అమలు చేయడం సాధ్యం కాదు. రెండు వేరువేరు దిశల్లో ప్రయాణం చేసే పడవలమీద చెరో కాలునూ ఉంచి ప్రయాణించాలనుకోవడం వంటిదే ఇది.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెట్టే ఒత్తిడికి తలొగ్గి ప్రపంచంలో అనేక దేశాలు తమ తమ బడ్జెట్‌ల ద్రవ్యలోటు తమ జీడీపీలో ఒకానొక శాతానికి మించకుండా ఉండాలని చట్టాలు చేశాయి. ఎక్కువ దేశాల్లో ఇది 3శాతంగా ఉంది. మన దేశంలో కూడా అటు కేంద్ర బడ్జెట్‌లో గాని, ఇటు రాష్ట్రాల బడ్జెట్‌లలో గాని ద్రవ్యలోటు జీడీపీలో 3శాతానికి మించివుండకూడదన్న చట్టాలు చేశారు. అయితే, అమెరికాలో ఈ తరహా చట్టం ఏదీ లేదు. దానికి బదులు అక్కడ ప్రభుత్వం చేయగల రుణానికి ఒక గరిష్ట పరిమితిని పెట్టుకున్నారు. ఇది కొంత తేడా వ్యవహారంలా ఉంటుంది. దేశ ఆర్థికవ్యవస్థ పెరుగుతున్నకొద్దీ ఈ గరిష్ట పరిమితిని మార్చుకోవలసివుంటుంది. అందుకే అమెరికాలో 1960 నుంచీ ఇప్పటిదాకా ఈ ప్రభుత్వ రుణ గరిష్ట పరిమితిని 78సార్లు సవరించారు.

ప్రస్తుతం ఈ పరిమితి 31.4లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. ఈ పరిమితి మేరకు ఇప్పటికే ప్రభుత్వ రుణం చేరుకుంది. అందువలన బైడెన్ ప్రభుత్వం ఆ రుణ పరిమితిని పెంచమని అమెరికన్ కాంగ్రెస్‌ను అనుమతి కోరింది. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల బలం ఎక్కువ. అందువలన వాళ్ళు రుణపరిమితి పెంపు ఒక మామూలు వ్యవహారంగా పరిగణించడానికి తిరస్కరించారు. రుణపరిమితిని పెంచేబదులు బడ్జెట్‌లో కొన్ని పద్దుల్లో కోతలు పెట్టాలని వాళ్ళు కోరుతున్నారు. ముందు రుణపరిమితిని పెంచడానికి ఒప్పుకుంటే ఆ తర్వాత బడ్జెట్‌లో పద్దులు కొన్నింట్లో కోతల విషయం చర్చించడానికి బైడెన్ సంసిద్ధత వ్యక్తం చేశాడు. కాని కోతలకు ఒప్పుకుంటేనే రుణపరిమితి పెంపుదలకు అంగీకరిస్తామన్న రిపబ్లికన్లు షరతు పెట్టారు. దీనికి బైడెన్ అంగీకరించలేదు. దీంతో వ్యవహారం ప్రతిష్టంభనలో పడింది. అది గనక పరిష్కారం కాకపోతే బైడెన్ ప్రభుత్వం ఇంతవరకూ తీసుకున్న రుణాలమీద వడ్డీ వాయిదాలు చెల్లించ లేక ఎగవేతదారుగా నిలవవలసివస్తుంది. అంతేగాక ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి వస్తుంది.


ప్రభాత్ పట్నాయక్

ఇక్కడ రెండు వేరు వేరు అంశాలు ఉన్నాయి. మొదటిది: అసలు ప్రభుత్వం అప్పు చేయడం వెనుక ఉన్న హేతుబద్ధత ఏమిటన్నది. తాను చేయవలసిన ఖర్చుకు కావలసిన ధనాన్ని సమకూర్చుకోడానికి సంపన్నులమీద అదనంగా పన్నులు

> ఉదార బూర్జువా దృక్పధానికి సాంప్రదాయ బూర్జువా దృక్పధానికి మధ్య తేడా ఇక్కడే కనిపిస్తుంది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవడం కోసం బలవంతంగానైనా కార్మికులను అణచివేయడానికి, నిరుద్యోగాన్ని బాగా పెంచివేయడానికి సాంప్రదాయ బూర్జువాదృక్పథం వెనుకాడదు. అదే ఉదార బూర్జువా దృక్పథం అయితే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కొనసాగించడానికి కార్మికుల మద్దతును కూడా పొందాలని ప్రయత్నిస్తుంది. భారీస్థాయిలో నిరుద్యోగం పెరిగిపోకుండా ఉండడానికి ప్రయత్నిస్తుంది. కార్మికులకు సంక్షేమం పేర కొంత ధనం బదిలీ అయేటట్లు చూస్తుంది.


వేయవచ్చు. అలా చేయకుండా రుణం తీసుకోడానికే మొగ్గు చూపుతోందంటే ఆ ప్రభుత్వం సంపన్నులమీద పన్నులు వేయడానికి సిద్ధంగా లేదని భావించాలి. ప్రస్తుత నయా ఉదారవాద కాలంలో తక్కిన ప్రపంచంతోబాటు అమెరికాలో కూడా ఆదాయాలలో, సంపదలో అసమానతలు బాగా పెరిగాయి. సంపన్నుల దగ్గర సంపద పెరిగినప్పుడు వారిమీద సంపద పన్ను, కార్పొరేట్ లాభాలమీద పన్ను అదనంగా విధించి ప్రభుత్వం తనకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చుకోవచ్చు. అలా సంపన్నులమీద అదనపు పన్ను విధించినంత మాత్రాన సంపదలోని అసమానతలు తగ్గిపోతాయని భావించకూడదు. ఏ దేశపు ఆర్థిక వ్యవస్థలోనైనా, శ్రామిక ప్రజలు తమకు వచ్చే ఆదాయాలకు దాదాపు సరిసమానంగా ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవస్థలో ఎక్కువగా పొదుపు చేసేది సంపన్నులే. ప్రభుత్వం చేసే అదనపు వ్యయం 100డాలర్లు అనుకుందాం. అందుకోసం ప్రభుత్వం రుణం తీసుకుందనుకుందాం. అప్పుడు ఆ 100డాలర్లూ ప్రభుత్వ వ్యయం తర్వాత సంపన్నుల దగ్గరికే చేరుతాయి. (కాసేపు విదేశీ లావాదేవీలను పక్కన పెడదాం) దాంతో వారు పొదుపు చేసే మొత్తం 100డాలర్ల మేరకు పెరుగుతుంది. దానిని ప్రభుత్వం మళ్ళీ వారివద్దనుండి రుణం రూపంలో తీసుకుంటుంది. ఈ విధంగా ప్రభుత్వం తాను చేసే అదనపు వ్యయానికి రుణం తీసుకోవడం వలన సంపద అసమానతలు మరింత పెరుగుతాయే తప్ప తగ్గవు. అదే అదనపు వ్యయం కోసం ప్రభుత్వం ఆ సంపన్నులమీద అదనపు పన్నులు విధిస్తే అప్పుడు పన్ను రూపంలో వారివద్దనుంచి వసూలు చేసిన సొమ్ము ప్రభుత్వ వ్యయం అనంతరం మళ్ళీ వారివద్దకే వచ్చి చేరుతుంది. అంటే అదనపు పన్ను విధించి నందువలన సంపదలో అసమానతలు అంతకు ముందు ఉన్న స్థాయిలోనే యధాతథంగా కొనసాగుతాయి.

అయినా బైడెన్ ప్రభుత్వం కాని, రిపబ్లికన్లు గాని సంపన్నులమీద అదనపు పన్నులు వేయడానికి సిద్ధంగా లేరు. అమెరికన్ రాజకీయాలమీద బూర్జువా వర్గం ఎంత పట్టు కలిగివుందో దీనిని బట్టి గ్రహించవచ్చు. ప్రభుత్వానికి అదనపు ఆదాయం రాబట్టాలంటే సంపన్నులమీద అదనపు పన్ను విధించే వీలుందన్న అంశాన్నే వారు పూర్తిగా తమ చర్చల్లో ఎక్కడా లేవనెత్తడంలేదు. ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు పొందలేని పరిస్థితులు వస్తాయని బైడెన్ హెచ్చరిస్తున్నాడే తప్ప సంపన్నులమీద అదనపు పన్ను ప్రస్తావననే ముందుకు తేవడం లేదు. రిపబ్లికన్లు కూడా రుణపరిమితిని పెంచడానికి పూర్తి వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారే తప్ప ఈ ప్రత్యామ్నాయం ఊసే ఎత్తడం లేదు.

ఒక అగ్రగామి పెట్టుబడిదారీ దేశంలో ఇటువంటి పరిస్థితి ఉండడం ఏ మాత్రం ఆశ్చర్యాన్ని కలిగించదు. అయితే ఇక్కడ మన దృష్టి పడవలసిన అంశం మరొకటి ఉంది. బైడెన్ ప్రభుత్వానికి, రిపబ్లికన్లకు మధ్య ఈ తక్షణ సమస్య మీద ఉన్న భిన్నాభిప్రాయం వెనుక వారి వారి ఆర్థిక దృక్పథాలలో, ఆర్థిక వ్యూహాలలో ఉన్న లోతైన తేడాను మనం చూడాలి. ఒకరిది "ఉదారబూర్జువా" దృక్పథం అయితే మరొకరిది "సాంప్రదాయ బూర్జువా" దృక్పథం.

ఇందులో మొదటితరహాకి నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం ముందుదారి తోచని స్థితిలో చాలా కాలంగా పడివున్న సంగతి తెలుసు. అందుచేత మళ్ళీ కీన్స్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరుకుంటున్నారు. అందుకే వాళ్ళు బడ్జెట్ లోటును పెంచడానికి వెనకాడడం లేదు. అందుకోసమే వాళ్ళు (బైడెన్ ప్రభుత్వం) ప్రభుత్వ రుణ పరిమితిని పెంచాలని కోరుతున్నారు. ఆ విధంగా పెంచే రుణపరిమితి వలన ప్రభుత్వ వ్యయం పెరిగి అది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. అయినప్పటికీ, ఇప్పుడు ద్రవ్యోల్బణాన్ని ఎలాగైనా సరే అదుపు చేయడం ఒక్కటే లక్ష్యంగా వాళ్ళు భావించడం లేదు. నిరుద్యోగాన్ని ఎంతో కొంత అదుపు చేయడం, ఆర్థిక కార్యకలాపాలను మరింత హెచ్చు స్థాయిలో నిర్వహించడం కూడా ముఖ్యమే అని వాళ్ళు భావిస్తున్నారు. దానికి బదులు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే పేరుతో ప్రభుత్వ వ్యయాన్ని బాగా తగ్గించి దేశం మీద మరింత ఆర్థిక మాంద్యాన్ని రుద్దడం పరిష్కారం అని వాళ్ళు అనుకోడం లేదు.

అదే రెండో తరహాకి చెందినవాళ్ళు, "సాంప్రదాయ బూర్జువా దృక్పథం"తో ఉన్నవాళ్ళు మాత్రం ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం అన్నదొక్కటే తమ ఏకైక తక్షణ లక్ష్యం అని భావిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వ వ్యయాన్ని బాగా తగ్గించాలని వాళ్ళు కోరుతున్నారు. శ్రామిక ప్రజలకు ఇచ్చే నగదు బదిలీలలో కోతలు పెట్టాలని, వారికి సంబంధించిన



సంక్షేమ చర్యలలో కోత పెట్టాలని, ఆ విధంగా జరిగితేనే ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని వాళ్ళు వాదిస్తున్నారు.

కీన్స్ తన కాలంలో ఈ "సాంప్రదాయ బూర్జువా" అవగాహనను ఎదుర్కోవలసివచ్చింది. సంపన్నులమీద అదనపు పన్నులు విధించేబదులు ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా మార్కెట్‌లో పడిపోతున్న కొనుగోలుశక్తిని ఎంతో కొంతమేరకు నిలబెట్టడం వలన ప్రయివేటు పెట్టుబడికి ఎటువంటి ఇబ్బందీ కలగదని కీన్స్ వాదించాడు. కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థను గట్టిగా బలపరిచినవాడు. అయితే బోల్షివిక్ విప్లవం ప్రభావం బలంగా ప్రపంచంమీద పడుతున్న కాలంలో అతను ఉన్నాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ గనుక ఎక్కువగా ఉద్యోగాలు కల్పించలేకపోతే అసంతృప్తికి గురయ్యే కార్మికులు సోవియట్ విప్లవ ప్రభావానికి లోనై మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే ప్రమాదం ఉందని అతను నమ్మాడు. అటువంటి అసంతృప్తికి కార్మికులు లోనుగాకుండా వారిని బుజ్జగించడం ఎంతైనా అవసరం అని అతడు భావించాడు.

ఉదార బూర్జువా దృక్పధానికి సాంప్రదాయ బూర్జువా దృక్పధానికి మధ్య తేడా ఇక్కడే కనిపిస్తుంది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవడం కోసం బలవంతంగానైనా కార్మికులను అణచివేయడానికి, నిరుద్యోగాన్ని బాగా పెంచివేయడానికి సాంప్రదాయ బూర్జువాదృక్పథం వెనుకాడదు. అదే ఉదార బూర్జువా దృక్పథం అయితే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను కొనసాగించడానికి కార్మికుల మద్దతును కూడా పొందాలని ప్రయత్నిస్తుంది. భారీస్థాయిలో నిరుద్యోగం పెరిగిపోకుండా ఉండడానికి ప్రయత్నిస్తుంది. కార్మికులకు సంక్షేమం పేర కొంత ధనం బదిలీ అయేటట్లు చూస్తుంది.

ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న ప్రతిష్టంభన వెనుక ఈ రెండు భిన్నదృక్పథాలూ అంతర్లీనంగా ఉన్నాయి. ఉదార బూర్జువా దృక్పథం అమలు జరిగితే ప్రభుత్వ జోక్యం ఆర్థిక వ్యవస్థలో గణనీయంగా పెరుగుతుంది. అలా జరిగితే పెట్టుబడిదారీ వ్యవస్థలో సద్యోజనితంగా (స్పాంటేనియస్‌గా) వ్యక్తం అయే ధోరణులకు అది ఆటంకం అవుతుంది. (ప్రభుత్వ జోక్యం పెరిగితే పెట్టుబడిదారులు తమ ఇష్టం వచ్చినట్లు దోచుకోడానికి అవరోధాలు కలుగుతాయి) అందుకే ప్రభుత్వ జోక్యం ఉండాలని చెప్పిన కీన్స్ విధానాలను నయా ఉదారవాదం మొదట్లోనే పూర్తిగా తోసిపారేసింది. ఇప్పుడు తిరిగి అవే కీన్స్ విధానాలను మళ్ళీ అమలు చేయాలని అనుకోవడం, అదునా, నయా ఉదారవాద విధానాలు ముందుదారి కనపడని స్థితిలో దిగబడివున్నప్పుడు కీన్స్ విధానాలను అమలు చేయాలని భావించడం మరిన్ని వైరుధ్యాలలోకి వ్యవస్థనునెడుతుంది. ఇప్పుడు కీన్స్ విధానాలను అమలు చేయబూనుకుంటే అది మృతశిశువు చందమే అవుతుంది.

అటువంటి వైరుధ్యాలలో కేవలం ఒక్కదానిని మాత్రం నేను ఇక్కడ ప్రస్తావిస్తాను. అమెరికన్ ప్రభుత్వం గనుక అదనంగా అప్పు చేసి దానిని సంక్షేమ కార్యక్రమాలకోసం ఖర్చు చేస్తే, అప్పుడు అమెరికాలో సరుకుల గిరాకీ పెరుగుతుంది. అమెరికన్లు ఉపయోగించే సరుకులలో గణనీయమైన భాగం దిగుమతుల ద్వారా లభిస్తాయి. అంటే ప్రభుత్వ వ్యయం పెరిగితే అది దిగుమతుల పెరుగుదలకు దారి తీస్తుంది. అప్పుడు విదేశీ చెల్లింపులలో లోటు పెరుగుతుంది. దానిని అదుపు చేయడానికి అమెరికా విదేశాలలోని ఎగుమతిదారులకి తన ప్రభుత్వ బాండ్లను అమ్మవలసివస్తుంది. అలా అమెరికా విడుదల చేసే బాండ్లను విదేశీ ఎగుమతిదారులు తీసుకోడానికి సిద్ధపడాలంటే డాలర్ అంతర్జాతీయ రిజర్వుకరెన్సీగా తన ప్రాధాన్యతను నిలబెట్టుకోవలసివుంటుంది.

ఇప్పుడు అమెరికా డజన్లకొద్దీ దేశాలమీద విధిస్తున్న ఆంక్షల ఫలితంగా ఆ దేశాలనుండి తనకు అవసరమైన సరుకులను దిగుమతి చేసుకునే అవకాశాన్ని అమెరికా కోల్పోతున్నది. అందువలన తన దేశంలో వాటిని ఉత్పత్తి చేసుకోడానికి ఎక్కువ ఖర్చు చేయవలసివస్తోంది. అందువలన అమెరికాలో ద్రవ్యోల్బణం మరింత పెరుగుతోంది. ఇంకోపక్కన ఆంక్షలకు గురైన దేశాలు తమలో ఒకరితో మరొకరు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు. ఆ ఒప్పందాలలో డాలర్ ప్రమేయం లేదు. ఆ యా దేశాల స్వంత కరెన్సీలనే మార్పిడి చేసుకుంటున్నారు. దాని ఫలితంగా డాలర్ ఆధిపత్య స్థానం బలహీనపడుతోంది. ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలూ ఎదుర్కోని దేశాలు సైతం తమ వద్ద పెద్ద మోతాదులో డాలర్ నిల్వలను, (బాండ్ల రూపంలో ఉండే నిల్వలతో సహా) అట్టిపెట్టుకోడానికి సంసిద్ధంగా లేవు. ఒకవేళ భవిష్యత్తులో తమపై కూడా ఆంక్షలు వస్తే అప్పుడు ఈ డాలర్ నిల్వలు ఉపయోగపడకుండా పోతాయి. అందుకే డాలర్ నిల్వలను పెంచుకోడానికి అందరూ అంత సుముఖంగా లేరు. ఈ కారణాలన్నీ డాలర్ బలహీనపడడానికి దారి తీస్తున్నాయి.

అమెరికాలో ఉదారబూర్జువా వైఖరి అవలంబిస్తున్న బైడెన్ ప్రభుత్వం మరోపక్కన చాలా ఎక్కువ దేశాలమీద ఆంక్షలు విధించడానికి మొగ్గు చూపిస్తోంది. ఈ ఆంక్షల ఫలితాలు అమెరికాలో ఉదారబూర్జువా దృక్పథాన్ని అమలు చేయడానికి ఆటంకంగా పరిణమిస్తున్నాయి. ఒకవైపున నయా ఉదారవాదంతో ప్రేరణ పొందిన సామ్రాజ్యవాద ఆధిపత్యధోరణిని సమర్థిస్తూ మరోపక్క కీన్స్ సూచించిన ఉదారవాద సంక్షేమ విధానాలను అమలు చేయడం సాధ్యం కాదు. రెండు వేరువేరు దిశల్లో ప్రయాణం చేసే పడవలమీద చెరో కాలునూ ఉంచి ప్రయాణించాలనుకోవడం వంటిదే ఇది.

(స్వేచ్ఛానుసరణ)



ఫాతిమా

అలుముకుంటున్న చీకట్లలోకి ఆమె
వెర్రి చూపులు చూస్తోంది
ఆ చీకటెందుకుందో తన ఆరేళ్ళ ఆయేషా
అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక!
బుల్‌డోజర్లతో దేశాన్ని కూల్చవచ్చని,
కూలుస్తారని ఇప్పటిదాకా తాననుకోలేదు.
'నామ్ ఔర్ నిషాన్ మిట్టీమే మిలాదేంగే' నినాదాలు
ఓట్ల కోసమే అనుకుంది కాని
ఆ ఓట్లే, మెట్లయి అధికార పరమపద సోపాన పటంలో
అందలమెక్కిస్తాయని ఊహించలేదు.
అక్కడెక్కడో..సంగారెడ్డి జిల్లాలో
ఇస్మాయిల్‌ఖాన్‌పేటను ఈశ్వరాపురమని
ఖాఖీ లాగులోల్లు..
ఇప్పుడు అఫీషియల్‌గా
అలహాబాద్ ప్రయోగరాజై
లక్నో లక్షన్‌పూర్‌గా మారబోతూ..
ఆ మాటలు విన్నప్పుడు నిజంగానే అంత చేస్తారా అనుకుంది
కాకా, మామూ అని పిల్చిన పక్కింటి వాళ్ళే
అఖ్లాక్‌ని కొట్టి చంపినప్పుడు గానీ
విషం ఎక్కడిదాకా ఎక్కిందో అర్థంకాలే!

లక్ష్మీబాయి ఝాన్సీలో, బేగమ్ హజ్రత్ మహల్
లక్నోలో ఫిరంగీ దళాలపై విరుచుకుపడ్డనేల కదా
అనుకుందామె!
ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో
మా మీరట్ మా లక్నో మా ఝాన్సీ, మా కాన్పూర్‌లన్నీ
మా యూపీలోనే ఉన్నాయనీ,
మా హజరా బేగమ్‌ను కన్న సహ్రాన్‌పూర్
అబీదాబానో నెత్తురోడ్చిన మొరాదాబాద్‌లు మాయూపీలోవే..
అనే అతి విశ్వాసంలో ఆమె
ఆలోచనలు చరిత్రలో తిరుగుతున్నాయి, కానీ
వెనక నుండి చరిత్రను చెరిపేసుకుంటూ
వస్తున్నారన్న సంగతి, పాపం! ఆ తల్లికేం తెల్సు

చీకట్లు శాశ్వతమని
చీకట్లలోనే తాము స్వైర విహారం చేయొచ్చని
విర్రవీగే పరివారాల్లారా!
వైకుంఠపాళిలో
మీకు మెట్లయిన 'లేబర్‌గాళ్ళు'
జాతవ్‌లు, జాట్ సిక్కులు, కార్మికుల్ని చూసి
చెమటతో కల్సి
ముస్లింలతో కలగలిసి, కలివిడిగా
మోడీ మానస పుత్రికలు, ఎన్నో పత్రికలు
ఆకసానికెత్తిన వ్యవసాయ చట్టాలను
ఓడించలేదా?!
ఫ్యాక్టరీల్లో హలాలు, పొలాల్లో యంత్రాలు
తాబదలై, ఒకరికి ఒకరై
ఒకర్లో ఒకరైన తీరే
మా వెలుగు బావుటా!

- ఆరెస్బీ

ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు... ఒక పరిశీలన


'రాజ్యం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు, దాని ఫలితం సామాజిక సంక్షోభం, రాజకీయ సంక్షోభం, సాంస్కృతి సంక్షోభంగా విస్తరిస్తున్నప్పుడు నగ్నంగా, బహిరంగంగా రాజ్యమే టెర్రరిస్ట్ రూపం ధరిస్తుంది' అదే ఫాసిజం అని స్టాలిన్ నిర్వచించాడు. ఫాసిజం అంటే అసహనం దాని మౌలిక లక్షణం. ఆ అసహనం ద్వేషం వైపునకు దారితీస్తుంది. మనుషులను విభజిస్తుంది. ఈ విభజన రేఖను అడ్డుకునే కమ్యూనిస్టులు, ప్రగతిశీలశక్తులు ఈ సమాజం మారాలని, కులమత వ్యవస్థ లేని, మనుషుల మధ్య ఎలాంటి అంతరంలేని సమాజం సృష్టికోసం ప్రయత్నిస్తారు.


పి.బి.చారి

ఆ ప్రయత్నాన్ని ఆటంకపరిచేదే ఫాసిజం. 100సంవత్సరాలకు ముందే ఈ ఫాసిజం యూరప్‌ను కుదిపివేసింది. 1919లో మార్చ్ ఆన్ రోమ్ అనే పేరుతో "బెనిటో ముస్సోలిని" రోమన్ చక్రవర్తి ఇంటి మీద దాడి చేశాడు. ఆ దాడికి భయపడి చక్రవర్తి అధికారాన్ని ముసోలినికి అప్పగించాడు. ఈ ఫాసిస్ట్ సిద్ధాంతాలు జర్మనీకి వ్యాపించి అక్కడ హిట్లర్, అలాగే స్పెయిన్‌లో అప్పటికే ఉన్న ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని రద్దుచేసి "ఫ్రాంక్" అధికారంలోకి వచ్చాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో రెండుకోట్ల మంది సోవియట్ యూనియన్ రెడ్ ఆర్మీ ప్రాణత్యాగాలతో ఫాసిజం ఓడించబడింది. ముస్సోలిని నడిబజార్లో విప్లవశక్తులు, ప్రజలు ఖండ ఖండాలుగా నరికి చంపారు. రష్యన్ ఎర్రసైన్యం దెబ్బకు హిట్లర్ స్వగృహంలో ఆత్మహత్య చేసుకుని కుక్కచావు చచ్చాడు. 1930నాటి హిట్లర్ అకృత్యాలను గుర్తుచేస్తూ ఫాసిజం లక్షణాలను 'హోలోకాస్ట్' అనే మ్యూజియంలో ఒక పోస్టర్ మీద రాసి పెట్టారు. అలాంటి లక్షణాలు ఇప్పటికీ వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. అవి మన దేశంలో కూడా చొరబడ్డాయి. ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో శరవేగంగా అమలు చేయబడుతున్నాయి.

1. శక్తివంతమైన జాతీయవాదాన్ని ప్రబోధించటం: ప్రపంచంలోని అన్ని జాతుల కన్నా మన జాతి మాత్రమే ఉన్నతమైనదని, శక్తివంతమైనదనే ఆధిక్య భావనను ప్రదర్శించడం. హిట్లర్, జర్మన్ జాతి ఆర్యన్ జాతి అని అది అన్ని జాతులు కన్నా గొప్పదని ప్రపంచాన్ని పరిపాలించే శక్తి దానికే ఉన్నదని ఒక కుహనా జాతీయ భావనని రెచ్చగొట్టాడు. ఆ విధంగా జర్మన్లను జాతి పేరుతో ఏకం చేయటానికి ప్రయత్నించాడు. మనదేశంలో ఆర్‌ఎస్‌ఎస్ హిందూ మతాన్ని ఒక జాతిగా అంటే హిందూ జాతిగా చెబుతూ ఇతర మతాలను ఇతర జాతులుగా నిర్వచిస్తూ, మనమంతా 'హిందువులం, సింధూ నది బిందువులం. మన జాతి అత్యుత్తమమైనది, మన గతం ఎంతో గొప్పది, మనం విశ్వ గురువులం అంటూ లేని ఆధిక్యతను ప్రచారం చేస్తూ ఇతర మతాల మీద ద్వేష భావాన్ని రెచ్చగొట్టడం ద్వారా హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా పోలరైజ్ చేయటం చూస్తూనే ఉన్నాం. హిట్లర్ యూదులను టార్గెట్ చేస్తే మన దేశంలోని ఆర్‌ఎస్‌ఎస్ ముస్లింలను, క్రిస్టియన్లను, దళితులను టార్గెట్ చేస్తూ ఉంది.

2.మానవ హక్కుల పట్ల వ్యతిరేకత: మనుషులకు కొన్ని సహజమైన హక్కులు ఉంటాయని, ఆ హక్కులను గౌరవించాల్సి ఉంటుందని గుర్తించకపోవడం. ఇప్పుడు మనదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతున్నది. ప్రజలు ఏ దుస్తులు ధరించాలో, ఏ ఆహారాన్ని భుజించాలో నిర్ణయించుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆ హక్కుల మీద ఈ రోజున దాడి జరుగుతున్నది. మాంసాహారం తింటే తామస ప్రవృత్తి వస్తుందని, బ్రాహ్మణ సాత్వికాహారం తినాలని ప్రచారం చేస్తున్నారు. భారతదేశంలో 90 నుంచి 95శాతం మంది మాంసాహారులే. కేవలం ఐదు శాతం మంది మాత్రమే శాఖాహారులు. ఐదుశాతం మంది ఆహారపు అలవాట్లను 95శాతం మంది మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచంలో సైన్స్‌తో పాటు అనేక రంగాలలో కొత్తకొత్త ఆవిష్కరణలు చేసిన శాస్త్రవేత్తలు అందరూ మాంసాహారులే ఆ విషయాన్ని మరుగుపరిచి వీళ్ళు ప్రచారం చేస్తున్నారు. జర్నలిస్టులు, మేధావులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాస్తే, గళమెత్తితే, అది దేశ వ్యతిరేకత అని వారి మీద రాజద్రోహం కేసులను మోపటం మనం కళ్ళ ముందు చూస్తూనే ఉన్నాం.



ప్రభుత్వం మీద వ్యతిరేకంగా రాస్తే అది దేశానికి వ్యతిరేకం ఎలా అవుతుంది? అలా కాదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యక్తపరిచిన అభిప్రాయాలు, దేశ వ్యతిరేకంగా వ్యక్తపరిచినవిగా భావించ కూడదని కూడా సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే అది దేశ వ్యతిరేకమని ప్రచారం చేయడమే ఫాసిస్టు లక్షణాల్లో ఒకటి.

3. ఒక శత్రువును సృష్టించుకుని దానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం: లేని శత్రువుని, శత్రువు కాని వారిని శత్రువులుగా సృష్టించి ఆ శత్రువు మన మీద దాడి చేయబోతుంది. మనమందరం ఐక్యమై దానికి వ్యతిరేకంగా పోట్లాడాలి. ఆనాడు హిట్లర్ యూదులను శత్రువులుగా చిత్రీకరించి వారిని అంత మొందించే ప్రయత్నం చేశాడు. ఈనాడు మనదేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ముస్లింలను, క్రిస్టియన్లను, కమ్యూనిస్టులను శత్రువులుగా చిత్రీకరించటం చూస్తున్నాం.

4. స్త్రీలను చిన్నచూపు చూడటం: హోలోకాస్ట్ మ్యూజియంలోని పోస్టర్ మీద రాసి ఉన్న ఫాసిస్టు లక్షణాల్లో ఇది కూడా ఒకటి. స్త్రీలకు హక్కులను నిరాకరించడం, వంటింటి కుందేళ్లుగనే ఉండేట్లు చేయటం. మనదేశంలోని ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోహన్ భగవత్ ఆడవాళ్లు వంటింటికే పరిమితం అవ్వాలని బోధిస్తున్నాడు. మనుధర్మ శాస్త్రంలో ఉన్నట్లు స్త్రీ చిన్నప్పుడు తండ్రి మీద, పెళ్లయిన తర్వాత భర్త మీద, విధవరాలు అయితే పిల్లల మీద మాత్రమే ఆధారపడి ఉండాలని, ఆమెకి ఎలాంటి స్వతంత్రత లేదని ఆ శాస్త్రం చెబుతుంది. అదే మన సమాజానికి హితమైనదని ఆ మనస్మృతియే మన రాజ్యాంగం అని, దానిని అమలు పరచడమే మా కర్తవ్యం అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నది.

5. ప్రచార సాధనాలన్నీ తమ గుప్పెట్లో పెట్టుకోవటం: దేశంలోని ప్రచార సాధనాలు అన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని తాము చెప్పే అబద్ధాలే నిజాలుగా ప్రచారం చేయడం. హిట్లర్ పాలనలో ప్రచార మంత్రిగా ఉన్న "గోబెల్స్" ఒక అబద్ధాన్ని వందసార్లు చెప్తే అదే జనం నిజమని నమ్ముతారు అని అన్నాడు. అంటే అబద్ధాలే వాళ్ల ప్రచార ఆయుధాలు. ఈనాడు మన దేశంలో జాతీయ టీవీ చానల్స్ 70కి పైగా టీవీ 18 నెట్‌వర్క్ ఆధీనంలో ఉన్నాయి. దీని యజమాని అంబానీ. అంబానీ ఇప్పుడున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు, ప్రభుత్వానికి అత్యంత సన్నిహితుడు. ప్రభుత్వ వ్యతిరేక గళం, ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపే ఎన్డీటీవీ సహితం ఆదాని హస్తగతం చేసుకున్నాడు. అదాని మోడీ ప్రభుత్వానికి ఆప్త మిత్రుడు. ఇప్పటి ప్రభుత్వం మీడియా మొత్తాన్ని నియంత్రించడం, ఎవరైనా ప్రభుత్వాన్ని విమర్శించే ది వైర్ లాంటి, దైనిక్ భాస్కర్, న్యూస్ క్లిక్ లాంటి, ఇతర మాధ్యమాల మీద సిబిఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ లాంటి దర్యాప్తు సంస్థలు దాడి చేయటం. స్వతంత్రంగా ఉండాల్సిన ఈ సంస్థలను తమ జేబుసంస్థలుగా మార్చుకోవటం, దాడులు చేసి లొంగదీసు కోవడానికి ప్రయత్నం చేయటం, లొంగని వాళ్ళ మీద కేసులు పెట్టడం జైలుపాలు చేయటం మన దేశంలో నిత్య కృత్యంగా మారింది.

(మిగతా రేపటి సంచికలో)

సెల్:9704934614



ఆమె ఓ డాక్టర్. రక్షణ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం. కానీ అది ఆమెకు తృప్తినివ్వలేదు. సామాజిక మార్పు కోసం పని చేయాలనుకున్నారు. అందుకే ఉద్యోగాన్ని వదులుకున్నారు. సేవా రంగంలో ఉండాలని సివిల్స్ రాసి ఐఆర్ఎస్ అధికారి అయ్యారు. దేశీయ, అంతర్జాతీయ పన్నులు, ఆర్థిక నేరాల దర్యాప్తులో కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతేకాదు ఆరు రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న సమర్పన్ అనే ఎన్‌జీఓకు ముఖ్య సలహాదారుగా ఉన్నారు. గ్రామీణ పిల్లలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా తీర్చుదిద్దుతున్నారు. ఆమే **మేఘా భార్గవ**. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...



సాయం చేసినపుడే జీవితానికి ఓ అర్థం

మేఘా రాజస్థాన్‌లోని కోటాలో పెరిగారు. డాక్టర్ కావాలనేది ఆమె చిన్ననాటి కోరిక. ఆమె తల్లి ఓ పాఠశాల ప్రిన్సిపాల్. దాంతో చిన్నతనం నుండి తన కూతుర్లకు విద్యా విషయాలు, పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ ఉండేది. AIPMT పరీక్షలు రాసిన తర్వాత మేఘా డెంటిస్ట్రీని అభ్యసించడానికి ముంబయిలోని గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చేరారు. అది పూర్తి చేసిన తర్వాత రక్షణ మంత్రిత్వ శాఖకు సంబంధించిన డెంటల్ ఆసుపత్రిలో రెండేండ్లు పని చేశారు. "ఈ కాలంలో ఒక క్రమశిక్షణతో కూడిన సంస్థలో పని చేసే మంచి అవకాశం నాకు వచ్చింది. అలాగే నాలోని నిజమైన సామర్థ్యాన్ని గుర్తించడం కోసం ఇంకా ఏదైనా చేయాలనుకున్నాను. దానికి సివిల్ సర్వీసెస్ సరైన ఎంపిక అని అనిపించింది" అని మేఘా చెప్పారు.



మొదటి ప్రయత్నంలోనే...

ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో పనిచేసేవారు. సివిల్ పరీక్షల కోసం సిద్ధం కావడానికి సాయంత్ర సమయాన్ని కేటాయించుకున్నారు. Orkut, Facebook సమూహాలు, బ్లాగులను శోధించి, తన మొదటి ప్రయత్నంలోనే ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేకుండా పరీక్షలు రాసి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్)లో చేరారు. "అకాడెమీ నాకు అకౌంటింగ్, పన్ను చట్టాలు, వృత్తికి సంబంధించిన అన్ని విషయాల్లో నాకు శిక్షణ ఇచ్చింది. కానీ కేసులను సమీక్షించడం, బ్యాలెన్స్ షీట్‌లను పరిశీలించడం, పరిశోధనలు నిర్వహించడం వంటివి చేసినప్పటికంటే అసలు శిక్షణ ఉద్యోగంలోనే ఉంటుంది" అని ఆమె అంటారు.

కీలక పథకాలను అమలు చేస్తూ...

తనకు సుపరిచితమైన నగరం, భారతదేశ ఆర్థిక రాజధాని ముంబయిలో మేఘ మొదటి పోస్టింగ్. 2012 నుండి ఆమె పన్ను పరిపాలనలో భాగంగా, విచారణాధికారిగా కూడా ఉన్నారు. ఇది ఇప్పటివరకు అత్యంత సవాలుగా ఉన్న అసైన్‌మెంట్‌లలో ఒకటిగా ఆమె చెబుతారు. గోప్యత కారణంగా నిర్దిష్ట కేసులను బహిర్గతం చేయలేక పోయినప్పటికీ, పన్ను ఆధారాన్ని ఎలా పెంచుకోవాలో నేర్చు కోవడం, విచారణ సమయంలో, అసెస్‌మెంట్‌ల సమయంలో దానిని విస్తృతం చేయడం ద్వారా తనకు మంచి స్థానం లభించిందంటారు. అంతర్జాతీయ పన్నులలో ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పన్ను ఒప్పందాలు, OECD మోడల్ టాక్స్ కన్వెన్షన్‌ను అనుసరించి పన్నుల అమలును కూడా ఆమె బహిర్గతం చేశారు. జాయింట్ కమీషనర్, ఇన్‌కమ్ టాక్స్, ఆర్థిక మంత్రిత్వ శాఖతో పాటు గత ఏడాది ప్రారంభించిన ప్రభుత్వ ఇ-ధృవీకరణ పథకాన్ని అమలు చేయడంలో ఆమె ప్రస్తుతం నిమగ్నమై ఉన్నారు.

సామాజిక మార్పును నడిపిస్తుంది

మేఘా సోదరి రుమా భార్గవ ప్రారంభించిన ఎన్‌జీఓ సమర్పన్‌తో చేరి సామాజిక మార్పు కోసం పని చేయాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. 2016లో స్థాపించబడిన ఈ సంస్థకు ఆమె ముఖ్య సలహాదారు. ఇది మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీలలో అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజల కోసం పని చేస్తుంది. వివిధ కార్యక్రమాల ద్వారా 90పైగా పాఠశాలల్లోని 26,000 మంది పిల్లల జీవితాలపై ఈ సంస్థ ప్రభావం చూపింది. "పిల్లలకు విద్యతో పాటు రుతుక్రమ పరిశుభ్రత, వాష్ (నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత), పాఠశాలల సౌర విద్యుదీకరణ, జీవనోపాధిని సృష్టించడం మా ప్రధాన ప్రాజెక్టులు" అని మేఘా వివరించారు.

సుదూర ఫలితాలకై...

"మా సంస్థ ఎక్కువగా వాలంటీర్లు, ఉపాధ్యాయులు, పాఠశాలల, ప్రధానోపాధ్యాయుల నిర్వహణ కమిటీలతో కలిసి నడుస్తుంది. పౌర సమాజం, ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగంలో సరైన లబ్ధిదారులను గుర్తించడంలో, కార్యక్రమాలను కింది స్థాయిలో అమలు చేయడంలో అందరూ కలిసి రావాలి. సుదూర ఫలితాలను సాధించేందుకు మరికొంతమంది వాటాదారులందరితో కలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆమె అంటున్నారు.

చేయి చేయి కలిపి...

కోవిడ్ -19 సమయంలో, సమర్పన్ 25 లక్షల మందికి భోజనం, కుటుంబాలకు రేషన్, మహిళలకు శానిటరీ ఉత్పత్తులు, పిల్లలకు పాల ప్యాకెట్లను అందించడానికి బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (BMC)తో కలిసి పని చేశాము. బెంగళూరు, హైదరాబాద్, కోటతో పాటు ఇతర నగరాల్లో కూడా ఈ కార్యక్రమాలను చేయగలిగాం. అలాగే స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగం, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలు చేయి చేయి కలిపి పనిచేశాయి. సమాజాకి కార్యక్రమాలు చేయడం కోసం మంచి కెరీర్‌ని వదులుకోవడం కష్టంగా లేదా అడిగినప్పుడు మేఘా తన అభిరుచి అన్ని సవాళ్లను అధిగమిస్తుందని చెప్పారు.

చిరునవ్వు విలువైనది...

"ఏదైనా చేయాలనే అభిరుచి మనకు నిజంగా ఉంటే దాన్ని చేయడానికి సహకారం కచ్చితంగా దొరుకుతుంది. నేను నా సోదరితో కలిసి అంకితభావంతో పని చేస్తున్నాను. మేమిద్దరం కలిసి క్షేత్ర సందర్శనలు చేస్తాం. పిల్లల ముఖంలో చిరునవ్వు విలువైనది. ప్రజలకు సహాయం చేసినపుడే మన జీవితానికి నిజమైన అర్థం లభిస్తుంది" అంటారు మేఘ. ఆర్థిక, ఆరోగ్య, విద్యా రంగాలలో మంచి విధానాలను అభివృద్ధి చేయడానికి, అమలు చేయడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆమె ఎదురుచూస్తున్నారు.

అవగాహన కల్పిస్తూ...

రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలోని పిల్లలకు సుమారు 3,200 అధ్యాయన్ కిట్లు (స్టేషనరీ) పంపిణీ చేశారు. కరెంటు లేని గ్రామాల్లో వెలుగులు నింపేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ 18 గంటల పాటు పని చేసే సోలార్ లాంతర్లను పంపిణీ చేస్తోంది. యుక్తవయసులో ఉన్న బాలికలకు బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్‌లు అందిస్తున్నారు. పాఠశాలల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మొబైల్ మెడికల్ డయాగ్నస్టిక్, ట్రీట్‌మెంట్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టులను సజావుగా అమలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు చేయి చేయి కలిపి పనిచేయాలని ఆమె అభిప్రాయపడ్డారు.

సంధ్యా సమయాన...

మధ్యాహ్నం భోజనానికి రాత్రి భోజనానికి మధ్య సమయం కనీసం 6 గంటలు అయినా ఉంటుంది. మధ్యాహ్నం తీసుకున్న భోజనాన్ని బట్టి ఒక్కోసారి సాయంత్రం ఆకలి వేస్తుంది. ఆకలి వేయగానే ఏది పడితే అది తినకూడదు. లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. తక్కువగా తిన్నా పొట్ట నిండినట్లుండాలి. అంతేకాదు తక్కువ కేలరీలు ఉండేలా చూసుకోవాలి. అటువంటి ఆహారాన్ని ఎంచుకోవడం ఉత్తమం. అవేంటో చూద్దాం...

పుచ్చకాయ : పుచ్చకాయను డైట్ స్నాక్‌గా చెప్పుకోవచ్చు. దీనిలో నీటి శాతం ఎక్కువ. ఒక పుచ్చకాయలో కేవలం 88 కేలరీలు మాత్రమే వుంటాయి.

చెర్రీ : చెర్రీ పళ్లలో విటమిన్లు పుష్కలంగా వుంటాయి. కొవ్వు పదార్థం తక్కువగా వుంటుంది. 25 చెర్రీలలో కేవలం 100 కేలరీలే వుంటాయి.

బ్లూ బెర్రీలు : ఒక కప్పు బ్లూ బెర్రీలలో 83 కేలరీలు వుంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు విరివిగా వుండి, వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. రకరకాల గుండె జబ్బుల నుంచి కాపాడతాయి.

కివీ పండు : కివీలో విటమిన్ సి పుష్కలంగా అందుతుంది. కివీ పళ్ళు జీర్ణక్రియకు సాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన మేని ఛాయను కూడా పెంచుతాయి. రెండు కివీ పళ్ళతో కడుపు నిండుతుంది. వీటిలో కేవలం 58 కేలరీలే వుంటాయి.

ఆపిల్ : రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌కి దూరంగా ఉండొచ్చని అంటుంటారు. యాపిల్‌లో ఉండే పీచు పదార్థం వాతావరణంలోని కాలుష్య కారకాల నుంచి రక్షిస్తుంది. కొవ్వును తగ్గిస్తుంది. ఒక యాపిల్‌లో కేవలం 100 కేలరీలు వుంటాయి.



ద్రాక్ష : కడుపు నిండాలి తక్కువ కేలరీలు కావాలంటే 100 కేలరీలు మాత్రమే కలిగి ఉండే ద్రాక్ష పళ్ళు సరైన ఎంపిక. 30 ద్రాక్ష పళ్ళు తింటే, రక్తహీనతను, అలసటను, కీళ్ళ నొప్పులను, కీళ్ళ వాతాన్ని, రుమాటిజంను తగ్గించడానికి దోహదం చేస్తాయి.

పల్లీలు : పల్లీలు చాలా ఆరోగ్యకరమైన, పోషక విలువలున్న చిరుతిండి. రోజుకు కొన్ని పల్లీలు తీసుకోవడం వల్ల చాలా సేపు కడుపు నిండిన అనుభూతి వుంటుంది. ఇందులో కేవలం 74 కేలరీలే వుంటాయి. తక్కువ గ్లూకోస్ కలిగి వుండటంతో పాటు శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి.

బాదం పప్పులు : సాయం సమయంలో ఆకలి అయితే బాదం పప్పులు చక్కటి చిరుతిండి. త్వరగా కడుపు నిండటంతో పాటు త్వరగా శక్తి వస్తుంది.

నార్కోటెక్ పరీక్షలకు సిద్ధం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నార్కోటెక్ పరీక్షకు సిద్ధమని అగ్రశ్రేణి రెజ్లర్లు స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సవాల్‌ను ఢిల్లీలో నిరసన చేస్తున్న రెజ్లర్లు స్వీకరించారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తనతో పాటు వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియాలకు నార్కోటెక్ పరీక్ష చేయించుకోవాలని డిమాండ్ చేశారు. వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా మాత్రమే కాకుండా మైనర్ రెజ్లర్ల సహా ఏడుగురు ఫిర్యాదుదారులు కూడా తనిఖీకి సిద్ధంగా ఉన్నారని నిరసనకారులు మీడియాకు తెలిపారు. ఈ పరీక్షను దేశం ముందు ప్రత్యక్ష ప్రసారం చేయాలని వినేశ్ ఫోగట్ డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ నుంచి బాలికలు ఎదుర్కొంటున్న బాధలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ పరీక్షలు సుప్రీంకోర్టు పర్యవేక్షించాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఇప్పటికే అబద్ధాలు ఆడుతున్న ఆయన ప్రజలను తప్పుదోవ పట్టించడం మానేయాలని బ్రిజ్‌భూషణ్ ను బజరంగ్ పూనియా కోరారు. అదే సమయంలో మంగళవారం సాయంత్రం ఇండియాగేట్‌లో నిర్వహించనున్న క్యాండిల్‌లైట్ మార్చ్, 28న ప్రకటించిన నూతన పార్లమెంట్ ముట్టడి నిరసనపై పోలీసులు బలప్రయోగం చేయొద్దని క్రీడాకారులు అభ్యర్థించారు. ఆందోళన శాంతియుతంగా ప్రారంభమైందని వినేశ్ ఫోగట్ తెలిపారు. 28న పార్లమెంట్ ముట్టడి నేపథ్యంలో ఢిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని పోలీసులు నిర్ణయించారు.

లాఠీచార్జిని ఖండిస్తున్నాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సంగారెడ్డిలో ఐకేపీ వీఓఏలపై లాఠీచార్జిని, జిల్లాల్లో అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మెలో ఉన్న వీఓఏలతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలనీ, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని 36 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర సర్కారుకు పట్టదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విఓఏలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారనీ, మహిళలని చూడకుండా పిడి గుద్దులు గుద్దడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అనేక జిల్లాల్లో ఆ యూనియన్, సీఐటీయూ నాయకులను ముందే అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. వీఓఏలపై లాఠీచార్జిని, అక్రమ అరెస్టులను ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రకృతితో సామరస్యంగా ఉందాం

- ఎ.వాణీప్రసాద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రకృతితో సామరస్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్ ఎ.వాణీప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో ఈపీటీఆర్ఐ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు-సుస్థిర వ్యవసాయ జీవవైవిధ్యం అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాణీప్రసాద్ మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ ప్రకృతితో సామరస్య జీవనాన్ని ప్రపంచం అలవర్చుకోవాలని కోరారు. వ్యర్థాలను తగ్గించుకోవాలనీ, పర్యావరణం కోసం సుస్థిర జీవన విధానాన్ని అవలంభించాలని హితవు పలికారు. రూరల్ టెక్నాలజీ పార్క్ రిటైర్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వై.గంగిరెడ్డి, వ్యవసాయ జీవ వైవిధ్యంపై ప్రజంటేషన్ ఇచ్చారు.

జైలుకు పంపినా భూమిని వదలం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టంచేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో 255 సర్వే నెంబర్ భూమిలో సుమారు 50 ఎకరాల్లో 2000 మంది పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు అమానుషంగా కూల్చివేయడమే కాక, వారిని అరెస్ట్ చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసిన అమానుష ఘటనపై సోమవారం సీపీఐ(ఎం) రాష్ట్ర బృందం సభ్యులు గుడిసెవాసులను కలిసి వారితో మాట్లాడారు. పేదలు, దళితులు, గిరిజనులు, కార్మికులు బృంద సభ్యుల ముందు తమగోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా గుడిసెలు కూల్చివేసిన స్థలంలో పార్టీ పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం అధ్యక్షత నిర్వహించిన సభలో జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్యతో పాటు పట్టణ పేదల సంఘం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు మాట్లాడారు. 2022 నాటికి పేదరికం లేకుండా అందరికీ ఇండ్లు నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ నెరవేరలేదని, తొమ్మిదేండ్ల పాలనలో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ సైతం ఎన్నికల ముందు పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మిస్తానని ఇచ్చిన హామీనీ నెరవేర్చలేదన్నారు. మహబూబాబాద్ పట్టణంలో 255 సర్వే నెంబర్‌లో 170 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, ఈ భూమిని రెవెన్యూ అధికారులు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ధారదత్తం చేసేందుకు పట్టాలు కూడా చేశారన్నారు. దాంతో ఈ భూమిని పేదలకు పంచాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 2000 మంది పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని తెలిపారు. మూడు నెలలుగా పేదలు ఎండనకా.. వాననకా.. రాత్రి, పగలు కరెంటు లేకుండా.. రోడ్డు లేకున్నా.. నీళ్ల లేకున్నా.. ఆ భూమి పైనే నివసిస్తున్నారని, అద్దె గదుల్లో ఉండలేక కిరాయిలు కట్టలేక పది గజాల జాగా కోసం ప్రాణాలు తెగించి పోరాటం చేస్తున్నారని అన్నారు. పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తేనే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వానికి ఓట్లు పడతాయని స్పష్టంచేశారు. ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి, ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూపోరాటంలో పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారని, అయినా వెనక్కి తగ్గేది లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 33 జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు నిర్మించుకోవడానికి స్థలాలు ఇచ్చిందని, పేదలు నిర్మించుకోవడానికి ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు లేవా.. అని ప్రశ్నించారు. మానుకోట చుట్టూ 5000 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలీస్ రెవెన్యూ మున్సిపల్ యంత్రాంగం అర్ధరాత్రి గుడిసెలపై దాడి చేశారన్నారు. పోలీస్ దాడిని గుడిసెవాసులు వీరోచితంగా ఎదుర్కొన్నారని, ఇదే ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. భూమి దక్కేంతవరకు వదిలేది లేదని స్పష్టంచేశారు. గుడిసెలు తొలగిస్తే మళ్లీ వేస్తామని హెచ్చరించారు. సందర్శించిన వారిలో.. సీపీఐ(ఎం) కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్ణపు సోమయ్య, నాయకులు బానోతు వెంకన్న, సమ్మెట రాజమౌళి, తోట శ్రీను, చీపిరి యాకయ్య, బూర్గుల లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ఖర్గే, రాహుల్‌తో నితీశ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కలిశారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని ఎదుర్కోవడానికీ, ప్రతిపక్షాల ఐక్యతను బలోపేతం చేసే ప్రయత్నాలలో భాగంగా ఇది గత నెలన్నరలో జరిగిన రెండో సమావేశం కావటం గమనార్హం. న్యూఢిల్లీలోని 10, రాజాజీ మార్గ్‌లోని కాంగ్రెస్ చీఫ్ నివాసంలో నితీశ్.. ఖర్గే, గాంధీని కలిశారు. ఈ సమావేశంలో ప్రతిపక్షాల ఐక్యతను పటిష్టం చేసేందుకు రోడ్‌మ్యాప్‌తో పాటు పాట్నాలో ప్రతిపక్ష నేతల సమావేశం గురించి చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్, జేడీ(యూ) చీఫ్ లాలన్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

శనివారం కర్నాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారోత్సవానికి బీహార్ ముఖ్యమంత్రి కుమార్, తేజస్వీ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారైన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల ఐక్యత ప్రదర్శనలో భాగంగా బీహార్ సీఎం నితీశ్ దేశంలో వివిధ ప్రతిపక్ష నాయకులు, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులు, నాయకులను కలుస్తున్నారు.

జవాన్ల శవాలపై 2019 ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రాజస్థాన్‌లోని ఆల్వాల్ జిల్లా బన్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాలిక్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పుల్వామా ఉగ్ర దాడి జరిగిన సమయంలో ప్రధాని మోడీ జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో షూటింగ్‌లో ఉన్నారని మాలిక్ చెప్పారు. ఆయన అక్కడ నుండి బయటికి వచ్చి తనకు ఫోన్ చేస్తే సైనికులు చనిపోయిన విషయం చెప్పానని, తప్పు జరిగిందని అన్నానని, అయితే నోరు విప్పవద్దని ఆయన ఆదేశించారని వివరించారు. అదానీ వ్యవహారంపై కూడా మాలిక్ స్పందించారు. కేవలం మూడేండ్ల కాలంలోనే ఆయన చాలా సంపద పోగేసుకున్నారని తెలిపారు. అదానీ రూ. 20 వేల కోట్లు ఆర్జించారంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో చెప్పారని, ఆ డబ్బు ఎలా వచ్చిందో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరారని, అయితే ఆ వైపు నుంచి జవాబు రాలేదని అన్నారు. రాహుల్ రెండు రోజులు మాట్లాడినా ఎవరూ బదులివ్వలేదని, ఎందుకంటే మోడీ వద్ద జవాబు లేదని చెప్పారు. అదంతా మన సొమ్మేనని తాను చెబుతున్నానని అన్నారు.

'వాళ్లు వారి ముఖ్యమంత్రుల నుండి దోచుకొని అదానీకి ఇచ్చారు. ఆయన దానితో వ్యాపారం చేశాడు. ఆ డబ్బంతా మనదేనని అంటున్నా' అని మాలిక్ చెప్పారు. తాను గోవాలో ఉన్నప్పుడు అక్కడి ముఖ్యమంత్రి అవినీతిపై మోడీకి ఫిర్యాదు చేశానని, ఫలితంగా తనను గవర్నర్ పదవి నుంచి తొలగించారని, సీఎం మాత్రం పదవిలో కొనసాగారని వివరించారు. ప్రధాని పర్యవేక్షణలోనే అవినీతి జరిగిందని, అందులో ఆయనకూ వాటా ఉందని, మొత్తం డబ్బంతా అదానీకి పోతుందని విమర్శించారు. ప్రభుత్వాన్ని మార్చాల్సిందిగా మాలిక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మీరు మళ్లీ వారికే ఓటేస్తే ఆ తర్వాత మీకు మరోసారి ఓటేసే అవకాశమే ఉండదు. ఆయన మిమ్మల్ని ఓటు వేయనీయడు. ప్రతిసారీ నేనే గెలుస్తాను. అనవసరంగా ఎన్నికలపై దండగ ఖర్చు ఎందుకని అంటాడు' అని ఎద్దేవా చేశారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నియమించారు. ప్రస్తుత క్రమబద్ధీకరణ తర్వాత ఆయా స్థానాల్లో కూడా కొత్త జేపీఎస్‌ల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ శాంతికుమారితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీవో 111 రద్దు వెనుక భారీ కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

విలువను లెక్కించేందుకు ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేయాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అది అణువిస్ఫోటనం లాంటిదని ఆయన హెచ్చరించారు. హిరోషిమా,నాగసాకి లాగా హైదరాబాద్‌ను విధ్వంసం చేసేందుకు సోమేష్‌కుమార్, అర్వింద్‌కుమార్, కేసీఆర్, కేటీఆర్ దుష్టచతుష్టయం కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యావరణ విధ్వంసానికి కారమవుతున్న ఈ జీవో ఎత్తివేతపై బీజేపీ నేతలు కేంద్రానికి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అంజన్‌కుమార్, వీ హనుమంతరావు, కోదండరెడ్డితో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. జీవో రద్దు నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం వరదల్లో మునిగి వేల మంది చనిపోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయ్యాక హైదరబాద్ విధ్వంసం మొదలైందనీ, కేటీఆర్ రియల్ ఎస్టేట్ మాఫియాను నడుపుతున్నారని విమర్శించారు. సోమేశ్ కుమార్, అరవింద్ కుమార్ ఈ విధ్వంసానికి కారణమని ఆరోపించారు. ఆ నలుగురిని అమరవీరుల స్థూపం వద్ద కట్టేసి కొట్టినా తప్పు లేదన్నారు. జీవో పరిధిని పరిరక్షించేందుకు సోమేశ్ కుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీనే ఇప్పుడు ఆ జీవోను రద్దు చేయాలంటూ నివేదిక ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ఈ నేపథ్యంలో తమ పార్టీ వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పర్యావరణ వేత్తలతో చర్చించి ఒక సమగ్రమైన నివేదికను ఇస్తుందన్నారు. దాని ఆధారంగా భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఆ జీవోను జంటనగరాలకు మంచి నీటి సరఫరాకు సంబంధించిన చిన్న అంశంగా మాత్రమే చూపే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ అన్నారు. సీఎం కేసీఆర్ తన ధన దహం తీర్చుకునేందుకే 111 జీవో రద్దు చేసి జంటనగరాలపై బాంబు వేశారని విమర్శించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన భూ లావాదేవీలను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు నగరానికి కృష్ణా జలాలు పీజేఆర్ పోరాటం వల్ల వచ్చాయనీ, కాంగ్రెస్ హయాంలోనే గోదావరి జలాలు వచ్చాయని రేవంత్ గుర్తు చేశారు.అలాంటి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్లను విధ్వంసం చేస్తారా? అని ప్రశ్నించారు. రూపాయి ఖర్చు లేకుండా పైపు లైన్లు వేశామన్న కేసీఆర్ ఇప్పుడు పైపుల కంపెనీల దగ్గర కమిషన్ల కోసమే కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఆనాడు వచ్చిన భారీ వరదల వల్ల హైదరాబాద్‌కు తీవ్రమైన నష్టం జరిగిందనీ, మోక్షగుండం విశ్వేశ్వరయ్య పరిస్థితిని సమీక్షించి పలు సూచనలు చేశారని గుర్తు చేశారు. అందులో భాగంగా వరదల నివారణకు మూసీ ఉపనది 'ఈసా' పైన ఒక రిజర్వాయర్, మూసీ నదిపైన మరొక రిజర్వాయర్ నిర్మించాలని సూచించారని తెలిపారు. ఆ సూచనల ప్రకారం నిజాం ప్రభుత్వం1912లో ఉస్మాన్ సాగర్ నిర్మాణాన్ని ప్రారంభించి 1920లో పూర్తి చేసిందనీ, ఈసా నదిపై 1920లో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించి 1927లో పూర్తి చేసిందన్నారు. వీటి ద్వారా హైదరాబాద్ మహా నగరానికి నగరానికి కావాల్సిన నీళ్లను గ్రావిటీ ద్వారా ఏ ఖర్చు లేకుండా సరఫరా చేయవచ్చునని తెలిపారు. కేవలం ఒకే ఒక్క కలం పోటుతో అటువంటి ప్రాధాన్యత ఉన్న జంట జలాశయాలను కేసీఆర్ సర్కారు మనుగడ లేకుండా చేసిందని విమర్శించారు. పది కి.మీ విస్తీర్ణంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్న ఉద్దేశంతో 1996 మార్చి 8న ప్రభుత్వం జీవో 111 తీసుకొచ్చిందనీ, కాలుష్యకారక పరిశ్రమలు, భారీ హొటళ్లు ,, నివాస కాలనీలు, ఇతర కాలుష్య కారక నిర్మాణాలపై నిషేధం విధిస్తూ 1994లో తొలుత జీవో 192ను తీసుకొచ్చిందని తెలిపారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో జంట జలాశయాల పరిరక్షణ అంశం సుప్రీంకోర్టుకు చేరిందన్నారు. సుప్రీం తీర్పుకు అనుగుణంగా జలాశయాలను పరిరక్షించడానికి 111 జీవోను ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందన్నారు. జీవో పరిధిలో కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, దామోదర్‌రావు, రంజిత్‌రెడ్డి వంటి నేతలకు ఫామ్ హౌజులున్నాయని రేవంత్ ఆరోపించారు. 2019 తర్వాత బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున ఇక్కడ భూములు కొనుగోలు చేశారనీ, ఫలితంగా ఆ ప్రాంతంలో 80 శాతం భూములు కేసీఆర్ బంధుగణం, ఆయన బినామీల చేతుల్లోకి వెళ్లాయని చెప్పారు. ఈ తతంగం ముగిసిన తర్వాత 111 జీవోను కేసీఆర్ రద్దు చేశారని ఆరోపించారు. బందిపోట్లను, దావూద్‌నైనా క్షమించవచ్చు...కానీ కేసీఆర్, కేటీఆర్‌ను క్షమించ కూడదని హెచ్చరించారు. కేసీఆర్ దోపిడీలో వాటా లేకపోతే కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు చెప్పాలని డిమాండ్ చేశారు. కోకాపేటలో రూ. 600 కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ. 40 కోట్లకే 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్' పేరిట తమ పార్టీ కార్యాలయం కోసం కేసీఆర్ కేటాయించుకున్నారని రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

బాక్స్ లైన్ డ్రయినేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్ కేతన్ ఇంట్లో కాలనీలో నూతనంగా వేస్తున్న బాక్స్ లైన్ డ్రయినేజీ పనులను సోమవారం కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమవు తున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని డివిజన్‌లో జరుగుతున్న బాక్స్‌లైన్ డ్రయినేజీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-చైతన్యపురి

ఉస్మానియా జనరల్ దవాఖాన వద్ద రోగులకు రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడీ టు సర్వ్ ఫౌండేషన్ చైర్మెన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ దవాఖాన వద్ద ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదేండ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సహదేవు, వంశీ, శివకార్తీక్, కల్యాణ్, ప్రకాశ్, చైతన్య, సీవన్, నితిన్, ప్రవీణ్, శివ, అనిల్, నాగార్జున, మహేశ్, నరేశ్, అఖిల్, సాయి, లక్ష్మణ్ ఉన్నారు.

మూగ జీవాలపై ప్రత్యేక ప్రేమ

- పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో నోరు లేని జీవాల దప్పిక తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- నగర వ్యాప్తంగా నీటి తొట్ల ఏర్పాటు
- మేయర్ జక్క వెంకట్ రెడ్డి నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు





నవతెలంగాణ-బోడుప్పల్

మండుతున్న ఎండలకు తాళలేక తాగే నీటి కోసం మనుషులే అప్పుడప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు అలాంటిది మూగ జీవాల పరిస్థితి మరీ ఆందోళన కరంగా ఉంటుంది. భగభగ మండుతున్న భానుడి ప్రతాపానికి పల్లె, పట్టణ ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండటంతో డీహైడ్రేషన్‌తో కొందరు ప్రజలు దవాఖానల పాలైతుండగా... మూగ జీవులైన పక్షులు, జంతువులు గుక్కెడు తాగు నీటికోసం మౌనంగా రోదిస్తున్నాయి. జీవవైవిధ్యానికి వెన్నెముక లాంటి పశుపక్షాదులను సంరక్షించుకోవాలనే సంకల్పంతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వేసవిలో మూగ జీవుల దప్పిక తీర్చేందుకు గాను మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26 డివిజన్లలో ప్రతీ డివిజన్‌కు పది చొప్పున మొత్తం 260 నీటి తొట్లను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండ నీటి సరఫరా చేస్తున్నారు. మూగ జీవుల పట్ల జీవకారుణ్యాన్ని చాటుతోన్నపీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయంపై ప్రత్యేక కథనం...

మూగ జీవాలపై ప్రత్యేక శ్రద్ధతో....

ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో మనుషులు వెలుపలికి వెళితే.. తాగునీటిని వెంట తీసుకెళ్తారు. లేదంటే రోడ్డు పక్కన ఉన్న చలివేంద్రాలను ఆశ్రయిస్తారు. వేసవిలో పక్షులు, జంతువుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుంది. తమతమ దాహార్తిని తీర్చుకునేందుకు మూగజీవుల గోస పడుతాయి. ఈ క్రమంలోనే మూగజీవుల దప్పిక తీర్చడం ఒక సామాజిక బాధ్యతగా భావించి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నీటి తొట్లను ఏర్పాటు చేశామని మేయర్ జక్క వెంకట్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒక పట్టణం.. వంద పార్కుల ప్రణాళికతో అనేక పార్కులను నిర్మించుకున్నామని, దీంతో పీర్జాదిగూడ పార్కులలో, కాలనీ ప్రాంతాల్లో పక్షుల సందడి ఎక్కువుగా ఉంటుందని మేయర్ తెలిపారు. అలాగే తమ కార్పొరేషన్ పరిధిలో భాగ్యనగర నందనవనం, శాంతివనం రిజర్వు ఫారెస్టులు ఉండటం వలన పక్షులు, నెమళ్లతో పాటు ఇతర మూగ జీవులు ఎక్కువగా కాలనీల్లో సంచరిస్తుంటాయని, అయితే కాలనీల్లో నీటి వసతి లేక అవి సొమ్మసిల్లే ప్రమాదం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ నీటి తొట్ల ఏర్పాటు వలన పక్షులు, జంతువులు దాహం తీర్చుకుని వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నాయని మేయర్ జక్క వెంకట్ రెడ్డి తెలిపారు.

అందరూ భాగస్వామ్యం కావాలి...

మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు ప్రజలు ముందుకు రావాలని మేయర్ జక్క వెంకట్ రెడ్డి పిలుపునచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం కానీ, స్వచ్ఛందంగా నీటి తొట్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని మేయర్ సూచించారు. సాధారణంగా నగరాల్లో నివసించే ప్రజలు రోజువారి విధులు, దినచర్యలతో బిజీబిజీగా ఉంటారు. కానీ స్కూల్ పిల్లలకు వేసవి సెలవులు ఉన్న నేపథ్యంలో సామాజిక బాధ్యతగా కనీసం వేసవి వరకు ఉదయం, సాయంత్రం పక్షులకు తాగునీరు, ఆహారంను ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగిస్తే వారు ఉత్సాహంగా ఆ బాధ్యతను నిర్వర్తిస్తారని మేయర్ అన్నారు. ఇలా చేయడం వలన పరోక్షంగా చిన్నారులకు చిరుప్రాయం నుంచే సామాజిక బాధ్యతల పట్ల, పర్యావరణం పట్ల అవగాహన పెరుగుతుందని మేయర్ తెలిపారు.

మీరు ఇలా చేయండి... పీర్జాదిగూడ పౌరులకు మేయర్ సూచనలు



- వేసవిలో మనలో చాలా మంది ఉదయం, సాయంత్రం ముచ్చట్లతో కాలక్షేపం చేస్తూ అమూల్యమైన సమయాన్ని వృథా చేస్తారు. ఈ అమూల్యమైన సమయంను పక్షుల పరిరక్షణకు కేటాయిస్తే వాటిని ప్రాణాపాయం నుంచి కాపాడటంతో పాటు జీవవైవిధ్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించినవారవుతారు.

- నగరంలో చాలా మంది ఉదయం లేవగానే పూల కుండీలలో నీరు పోస్తారు. అయితే పూల కుండీలలో పోసిన నీరు కింది నుంచి వృథాగా పోతుంది. ఇలా పోకుండా ఉండేందుకు ఆ కుండీల కింద లోతైన మట్టి ప్రాతలను ఏర్పాటు చేయాలి. వరండాల్లో, గోడలపై, ఇంటి మేడలపై ఈ కుండీలను ఉంచడం వలన పక్షులు దాహం తీర్చుకోవడంతో పాటు వాటిలోనే స్నానం చేసే అవకాశం ఉంటుంది. దీంతో పక్షుల రెక్కలకు ఉన్న దుమ్ము దూళి పోయి గాలిలలో సులభంగా ఎగరగలుగడంతో పాటు తొందరగా అలసిపోవు.

- ఈ కుండిలలోని మొక్కల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో మట్టి మూతలను అమర్చి వాటిలో నీరు పోస్తే మరీ మంచిది. ఇందులోని నీరు చాలా చల్లగా ఉండటంతో పక్షుల దాహం త్వరగా తీరుతుంది.

- వేసవిలో పక్షులకు ఆహారం కొరత కూడా ఉంటుంది. కాబట్టి చిన్నగా కోసిన పండ్ల ముక్కలను, పండ్ల తొక్కలను ఇంటి ఆవరణలో వేయాలి. వీటిని గోరు వంకలు, కోయిలలు, బుల్బుల్ పిట్టలు, రామచిలుకలు తినే అవకాశం ఉంటుంది. పైన తెలిపిన చిన్నపాటి సూచనలు పాటిస్తే భవిష్యత్ తరాలకు మనం ఎంతో మేలు చేసిన వాళ్లవుతామని మేయర్ తెలిపారు.

మీర్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో రోడ్లకు మహర్దశ

- అంతర్గత రోడ్ల నిర్మాణాలకు రూ. 43.58 కోట్లు మంజూరు..
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నేతలు



నవతెలంగాణ-మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాల్టీల అంతర్గత రోడ్ల నిర్మాణానికి హెచ్‌ఎండీఏ నుంచి రూ 43.585 కోట్ల వ్యయంతో నిధులు మంజూరు అయినట్టు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 62 పనులకు రూ. 17 కోట్ల 68 లక్షల యాభై వేలు, జల్ పల్లి మున్సిపాల్టీలో 56 పనులకు రూ. 22 కోట్ల 40 లక్షలు, తుక్కుగూడ మున్సిపాల్టీలో 14 పనులకు రూ. 3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. సీసీ, బీటీ రోడ్లతో పాటు పలు చోట్ల రోడ్ల వెడల్పు పనులు కూడా చేపట్టనున్నట్టు చెప్పారు. మొత్తం 132 పనులు రూ. 43.585 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీ ఆర్, మంత్రి కేటీఆర్‌లకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

మంత్రికి నేతల కృతజ్ఞతలు..

సీసీ, బీటీ రోడ్లతో పాటు పలు చోట్ల రోడ్ల వెడల్పు పనులకు రూ. 43.585 కోట్లు మంజూరు చేసినందుకు మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, లార్డ్స్ బీరప్ప, బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జేటవత్ శ్రీనివాస్ నాయక్, కో అప్షన్ సభ్యులు, జల్పల్లి, తుక్కుగుడ మున్సిపాల్టీల కౌన్సిలర్లు, నాయకులు సోమవారం మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పనులను చేపట్టరాదు

- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఫుట్ పాత్ వల్ల వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని ఆదివారం కాలనీ వాసులతో కలిసి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ ఈఈ రమేష్ బాబు, డీఈ దామోదర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఫుట్ పాత్ నిర్మించడం వల్ల రహదారి ఇరుకుగా మారుతుందని, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడతారని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో దుర్గా సాయి నగర్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, యాదగిరి గౌడ్, నిట్టు కష్టా, గోపి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యాదయ్య గౌడ్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు మెట్టుపల్లి సంతోష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవి శంకర్, కిషోర్, సుధీర్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ-సంతోష్ నగర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మలక్ పేట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశం మేరకు అభివద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. సోమవారం మహబూబ్ మన్షన్ హవేలీ, హెరిటేజ్ బిల్డింగ్, ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ అధికారులు, హెర్టేజ్ అకాడమీ ట్రస్ట్ కంపెనీ సూర్యనారాయణమూర్తి, కార్పొరేటర్లు మహమ్మద్ సైఫుద్దీన్ షఫీ పలు సంస్థ అధికారులు సభ్యులు కార్యకర్తలు కలిసి నియోజక వర్గంలో సందర్శించారు. వర్షపు నీరు, డ్రయినేజీ వ్యవస్థ, మంచినీరు, పరిశుభ్రత, పరిరక్షణ, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన సత్వరమే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ కాలనీ, బస్తీలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి వాటి పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య తల్లెకుండా చూడవలసిన బాధ్యత అధికారులదేనని సూచించారు. రాబోయే వర్షాకాలం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు సీసీ రోడ్డు, డ్రయినేజీ పరిశుభ్రత పాటించా లన్నారు సమాజ సేవ కోసం యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, డివిజన్ అధ్యక్షులు, ఏఐఎంఐఎం నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పార్కింగ్ వసూళ్లకు అనుమతులు లేవు

- చార్జీలు వసూలు చేస్తే చర్యలు : డిప్యూటీ కమిషనర్ నరసింహ

నవతెలంగాణ-సంతోష్‌నగర్

కుర్మగూడ డివిజన్ మాదన్నపేట కూరగాయల మార్కెట్ పార్కింగ్ వసూళ్లకు అనుమతులు లేవని జీహెచ్ఎంసి సర్కిల్ – 7 డిప్యూటీ కమిషనర్ నరసింహ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమ పార్కింగ్ పై వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ తరువాత సరైన పత్రాలు లేకుండా పొందిన లైసెన్స్ రద్దు చేసినట్టు తెలిపారు. ఇక పై మార్కెట్‌లో పార్కింగ్‌కు వసూళ్లకు పాల్పడితే జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. శ్రీ వెంకటేశ్వర పార్కింగ్ పేరుతో పొందిన ట్రేడ్ లైసెన్స్ నెంబర్ కూడా రద్దు చేసినట్టు తెలిపారు. అక్రమ పార్కింగ్ వసూళ్ల పై మాదన్నపేట పోలీసులకు సమాచారమిస్తామన్నారు.



పేద మహిళకు కంటి ఆపరేషన్ చేయించిన చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బస్తీ కి చెందిన జీజీ బాయ్ అనే 77 సంవత్సరాల వద్ద మహిళకు కంటి చూపు లేక ఇబ్బందులకు గురవుతుందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆమెకు నేత్రలాయ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారిని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సామాజిక బాధ్యతల్లో భాగంగా పేదవారికి వివిధ రూపాల్లో ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ యాదవ్, రాజు నాయక్, సలీం, ప్రేమ్ నాయక్, పింటూ, భాస్కర్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాలువను తలపిస్తున్న రహదారి

- చినుకు పడితే ఈ రహదారిలో వాహనదారులకు తిప్పలు తప్పవు
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ రహదారి నుంచి ఇంజాపూర్ వెళ్లే రహదారి జిక్కిడి రాంరెడ్డి కమాన్ ముందు క్రిస్టల్ వెంచర్ ముందు దిగువ ప్రాంతం అవటంతో చినుకు పడితే ఆ ప్రాంతం కాలువను తలపిస్తోంది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లో ప్రజలు నిత్యం ఇంజాపూర్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లాలంటే ఈ రహదారి నుంచి ప్రయాణించ వలసిందే. ఎన్నో రోజులుగా ఈ రహదారి చినుకులు పడితే చాలు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తోంది. దాంతో ద్విచక్ర వాహనదారులు పలు ఇబ్బందులతో పాటు, ప్రమాదాలకు గురవుతున్నారు. వాటర్ వర్క్స్, డ్రయినేజీ గతంలో విడివిడి విభాగాలుగా విధులు నిర్వహించే అధికారులు ప్రస్తుతం డ్రయినేజీ వ్యవస్థని వాటర్ వర్క్స్ వ్యవస్థలోకి విలీనం చేయటంతో పలు ఇబ్బందులు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీ వాసులు ఆ రోడ్డు నుంచి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. అయితే ప్రమాదానికి కారణమవుతున్నా ఆ రహదారి గురించి అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి చొరవ తీసుకుని ఆ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, ప్రజలకు ఇబ్బందిగా తయారైన ఈ రహదారి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే హక్కు ఎమ్మెల్యేకు లేదు

- కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ మల్ రెడ్డి రాం రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

కాంగ్రెస్ పార్టీలో గెలిచి అధికార పార్టీలోకి వెళ్లిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ మల్ రెడ్డి రాం రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. సుధీర్‌రెడ్డి గెలిచిన రోజు నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఎంపీ రేవంత్ రెడ్డి మీద అవాకులు చవాకులు పేల్చుతున్నారని మండిపడ్డారు. ఇంకొకసారి రేవంత్ రెడ్డి గురించి తప్పుగా మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకో రని హెచ్చరించారు . సుధీర్ రెడ్డి గతం గుర్తు తెచ్చుకో.. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిని ఎల్బీనగర్‌లో పర్యటించమని బతిమిలాడిన రోజులు మరిచిపోయారా అని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులను కూడబెట్టుకోవడానికి పార్టీలు మారి నీకు రాజకీయ భిక్ష పెట్టిన తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ మీద అసత్య ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే ఒక్కసారి గుండెల మీద చెయ్యి వేసుకొని ఆలోచించుకోవాలి అన్నారు. ఈ స్థాయి ఎవరి వల్ల వచ్చింది అంటూ ఘాటుగా ప్రశ్నించారు. ఎల్బీనగర్‌లో ఫ్లైఓవర్లు కాంగ్రెస్ పార్టీ వల్లే వచ్చాయని ఎమ్మెల్యే మాట్లాడిన వీడియోలన్నీ తమ దగ్గర ఉన్నాయని తెలిపారు. సమయం వచ్చినపుడు అన్ని బయటకు వస్తాయని చెప్పారు. ఏది ఏమైనా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో గెలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

హయత్‌నగర్‌లో వక్ఫ్ బోర్డ్ భూములు కాపాడండి

- టీపీసీసీ సెక్రటరీ గజ్జి బాస్కర్ యాదవ్



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 88,89,147,71/1/2 లలో ఉన్న వక్ఫ్ బోర్ భూములు పూర్తిగా కబ్జాకు గురై అందులో విచ్చల విడిగా నిర్మాణాలు జరుగుతున్నా రెవిన్యూ అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ పట్టించుకోక పోవడం చాలా సిగ్గు చేటని టీపీసీసీ సెక్రటరీ గజ్జి బాస్కర్ యాదవ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ తిరుపతి రావుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ లో గల వక్ఫ్ బోర్డ్ భూమి సర్వే నెంబర్ 88.89.147లో గల 3.ఎ 36 గుంటల బోర్డ్ భూమిని భూ కబ్జా దారుల చెర నుంచి కాపాడాలని ప్రజావాణిలో పిర్యాదు చేసినట్టు తెలిపారు. స్పందించిన అధికారులు వెంటనే ఇట్టి భూమిని కాపాడడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు.

తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..

- టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్, ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కైలాస పురం కాచారం గ్రామంలో జరిగిన శ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం రేణుకా మాత ఆశ్రమంలో శ్రీ శ్రీ చండీ సహిత రుద్ర యాగం మహెూత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలో బంగారు తెలంగాణ కోసం బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వంద సంవత్సరాలు జీవించాలని, దేశ ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులు పాడి పంటలతో విరసిల్లాలని, ప్రజలందరూ ఆనందంగా వుండాలని యాగంలో కోరుకున్నట్టు తెలిపారు. దేశంలో రైతుల, బీదల బాధలు తెలిసిన ఒకే ఒక నాయకుడు తెలంగాణ సీఎం కేసీఆర్ అని, తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు వంటి పథకాలు దేశంలోనూ అమలు చేయాలని తెలంగాణ మాడల్ దేశవ్యాప్తం కావాలని అన్నారు. భవిష్యత్తుపై ముందు చూపు ఉన్న కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో మళ్ళీ ఎగిరేది గులాబీ జెండానే, వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం అని, బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ స్టేట్ ధార్మిక సమితి చైర్మెన్ వంగపల్లి అంజయ్య ,ఫౌండర్, గంప శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి,గోల్డెన్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు తోట హరీశ్, శ్రీ అయిత రత్నాకర్ ,మాంకాల నవీన్ కుమార్ ,మీలా సోమయ్య , రంగ శేఖర్ ,లెంకలపల్లి శ్రీనివాస్, ఐవీఎఫ్ మహిళా విభాగం అడ్వైసర్ బీచ జయశ్రీ, రవికుమార్ , ఐవీఎఫ్ స్టేట్ యూత్ వైస్ ప్రెసిడెంట్ కొండా శైలేందర్ గుప్త, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు..






సరికొత్త ఫార్ములాతో కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూతేపేస్ట్ రీలాంచ్

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ఓరల్ కేర్ బ్రాండ్ కోల్గేట్, రిఫ్రెష్ చేసిన ఫార్ములాతో తన ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తి కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూత్పేస్ట్ని తిరిగి విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా కోల్గేట్ - పామోలివ్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ గుంజిత్ జైన్ మాట్లాడుతూ... భారతదేశంలో సరైన నోటి సంరక్షణ అలవాట్లను పెంపొందించడంపై దృష్టి సారించడం తమ బాధ్యత అని, కోల్గేట్లో తాము విశ్వసిస్తున్నామన్నారు. కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూత్పేస్ట్ దాని ప్రత్యేకమైన అర్జినైన్ ఆధారిత సాంకేతికతతో రీలాంచ్ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇది మీ దంతాలను శుభ్రపరచడమే కాకుండా వాటికి పోషణను కూడా అందిస్తుందన్నారు. సైన్స్ మద్దతుతో ఈ అధునాతన ఫార్ములా మునుపెన్నడూ లేనంత మెరుగైన ఫలితాలను అందిస్తుందని తాము విశ్వసిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

'జంట జలాశయాలను రక్షించుకుందాం'

నవతెలంగాణ-సిటీబ్యూరో



జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్‌ను రక్షించుకుం దామని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పీ.సాయిబాబా అన్నారు. కేసీఆర్ తన అనుచరులు, బినామీల భూములను క్రమబద్ధీకరణ కోసమే 111 జీవో ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. సోమవారం నగర టీడీపీ కార్యాలయంలో సాయిబాబా మాట్లాడారు. తెలంగాణలోని వికారాబాద్ అడవుల్లో పుట్టి, హైదరాబాద్ ప్రజలకు దశాబ్దాలకుపైగా స్వచ్ఛమైన తాగునీరు అందించిన జంట జలశయాలు ఉస్మాన్ సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్‌లను కాపాడే విధంగా 111 జోవో ఆనాడు తీసుకొచ్చారని గుర్తు చేశారు. గండిపేట, హిమాయత్ సాగర్‌ల తాగునీరు అవసరం లేదంటునే, కాళేశ్వరం, గోదావరి నీటితో ఈ జంట జలాశయాలని అనుసంధానం చేసి నింపుతామని చెప్పడంలోనే కుట్ర బయటపడ్డదన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా లభించే స్వచ్ఛమైన నీళ్లుకాదని, ఎక్కడో పుట్టి వందల కిలోమీటర్ల నుంచి కోట్లు ఖర్చుచేసి నీళ్ల తీసుకొని రావాల్సిన అవసమేముందని ప్రశ్నించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు, బినామీల లాభంకోసమే 111జోవోను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. రెండు జలాశయాలను కాపాడుకోవడానికి ప్రజలు, మేథావులు, నాయకులు ఏకంకావాలన్నారు. తమ భవిష్యత్తు, తమ పిల్లల భవిష్యత్తు కాపాడుకోవడానికి సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజు గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, ప్రశాంత్ యాదవ్, కప్పు కృష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిని తలపిస్తున్న భానుడు

- అల్లాడిపోతున్న ప్రజలు
- శీతలపానీయాలతో సేద తీరుతున్న వైనం
- నాగోల్ డివిజన్‌లో బస్ షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులు



నవతెలంగాణ -నాగోల్

మండుతున్న ఎండలతో వీస్తున్న గాలులకు వచ్చే వేసవి తాపంతో నగరం నిప్పుల కొలిమిని తలపిస్తుంది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతున్న ఎండలు సాయంకాలం 6 గంటల వరకు కాస్తునే ఉంటుంది. దీంతో వచ్చే వేడి గాలులకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 దాటిందంటే వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అప్పుడప్పుడు వర్షం పడుతున్నా వేడి మ్రాతం తగ్గడం లేదు. దాంతో వివిధ పనుల కోసం బయటకు వచ్చే వారు వేసవి తాపానికి తట్టుకోలేక శీతల పానీయాలను సేవించి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. మరి కొంత మంది వేడి గాలుల కు వచ్చే ఉక్క పోతను తట్టుకోలేక ఈత కొలనులను ఆశ్రయించి చల్లదనం పొందుతున్నారు. అయితే ఈ వేసవిలో మధ్యాహ్నం ఒంటిగంట దాటిందంటే మండుతున్న ఎండలకు జనం లేక కొన్ని రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నాగోల్ డివిజన్‌లోని కొన్ని బస్ స్టాప్‌లలో బస్ షెల్టర్లు లేక నిలువ నీడ కరువై బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు మండుతున్న ఎండలకు అల్లాడిపోతున్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేసి ఎండల్లో దాహంతో అల్లాడుతున్న వారి దాహార్తిని తీర్చుతున్నాయి. చలివేంద్రాలు లేని చోట్ల ప్రజలు శీతల పానీయాల సెంటర్లను ఆశ్రయించి వారి వారి ఆర్థిక స్తోమతను బట్టి శీతలపానియాలను తీసుకొని తమ దప్పికను తీర్చుకుంటున్నారు.

రోజువారి కూలీలు కూడా ఎండలో పనికి వెళ్తితే ఎక్కడ అనారోగ్యాలకు గురికాల్సి వస్తుందోనని జంకుతున్నారు. రోడ్లపై వ్యాపారుల నిర్వహిస్తు జీవనోపాధి పొందుతున్న వివిధ చిరు వ్యాపారస్తుల కష్టాలు కూడా వర్ణనాతీతం. ఒకవైపు పెట్టుబడులు పెట్టి తెచ్చిన సరుకులను ఎండల నుంచి కాపాడుకోవడం, మరోవైపు మండుతున్న ఎండల్లో కూర్చొని కొనుగోలుదారుల కోసం వేచి చూస్తూ వ్యాపారం చేసుకోవడం గగనంగా మారిందంటున్నారు. ఎండల భయానికి వినియోగదారులు కూడా అంతగా లేకపోవడంతో నమ్ముకున్న వ్యాపారం కూడా సక్రమంగా జరగడం లేదని వాపోతున్నారు. ఏదేమైనా వేసవికాలం ముగిసే వరకు మధ్యాహ్నం వేళలో పని ఉంటే తప్ప బయటకి వెళ్ళొద్దని ,తప్పనిసరి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటిస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బండారి లక్ష్మారెడ్డికి చిత్రపటాన్ని బహూకరించిన ప్రశాంత్

నవతెలంగాణ-కాప్రా

రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, వాసవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బోనగిరి ప్రశాంత్ కుమార్ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి మీద ప్రేమతో ఆయన నిలువెత్తు ఆయిల్ పెయింట్ చిత్రపటాన్ని సోమవారం ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



కలుషిత మంచినీరు రావడంతో కార్పొరేటర్ పరిశీలన

నవతెలంగాణ-కాప్రా

అమీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలని ఫేజ్ 2 ఈడబ్ల్యూఎస్‌హెచ్ కాలనీలో కలుషిత మంచినీరు రావడంతో స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ సోమవారం పరిశీలించారు. డ్రయినేజీ లీకేజీ ద్వారా మంచినీరు కలుషితం అవుతుందని కాలనీ వాసులు చెప్పడంతో పరిశీలించి మంచినీటి క్వాలిటీ చెకింగ్ చేసారు. అనంతరం సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, స్థానిక నాయకులు చంద్రమోహన్, రాజు, వెంకటేష్, గణేశ్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.



సత్వరమే అర్జీలను పరిష్కరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- ప్రజావాణికి 98 అర్జీలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి ,రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి 98 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవడానికి వస్తున్న ప్రతీ ఒక్కరి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని అన్నారు. తీసుకున్న చర్యలపై ప్రజావాణి వెబ్ సైట్ లో ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్

దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డా. భాగ్యరెడ్డి వర్మ 135 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి అదనపు కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని ఆయన సేవలను కొనియాడారు. దళితుల అభ్యున్నతికి దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిచడం ఆనందంగా ఉందన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించుకోవడం ద్వారా వారిని గౌరవించుకోవడంతో పాటు మహనీయుల స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, లా ఆఫీసర్ చంద్రావతి , సీపీవో మోహన్ రావు , జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాలను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో బస్తీ దవాఖానాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఆరో వార్డులోని నందమూరి నగర్, 8వ వార్డులోని సరస్వతీ నగర్‌లలో ఆయన ఈ దవఖానాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు సరైన సమయంలో వైద్యం అందుబాటులో ఉండేందుకు ఈ బస్తీ దవఖానాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆరో వార్డులో మాజీ సభ్యుడు పాండు యాదవ్, విద్యావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్ క్రిశాంక్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జల నగేష్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు నందిత, నివేదిత, మాజీ సభ్యులు, కంటోన్మెంట్ మున్సిపల్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ భాగ్య రెడ్డి వర్మ జయంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ భాగ్య రెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి కార్యక్రమం కమలానగర్ ఆఫీసులో సోమవారం నిర్వహించారు. ముందుగా బొమ్మగాని రుక్కయ్య.. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో శ్రీ భాగ్యరెడ్డి వర్మ ఎస్సీ, ఎస్టీ వెనకబడిన తరగతులకు చెందిన బాలికలకు విద్య అవసరాన్ని గుర్తించి హైదరాబాద్ నగరంలోని 25 పాఠశాలలు అప్పటికే నిర్మించి వేలాదిమందికి విద్యాభ్యాసం జరిగేటట్టుగా చూశారని చెప్పారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి దగ్గర ఉన్న ఆది హిందూ భవన్ బాలికల కోసం నిర్మించిన విద్యాలయం అని చెప్పారు. అంతేకాకుండా జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. మూలవాసులు ఆది హింద ువులని చెప్పి ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేకతను చూపించారన్నారు. ఈ సందర్భంగా వారికి నివాళులర్పించటం అంటే వారు అందించిన లక్ష్యాలను మనం కూడా ఆచరణలో పెట్టినట్టని చెప్పారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ ఆయన సేవలను శ్లాఘించారు. అనంతరం సభ్యులు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత పి.బి చారి, కోమటి రవి, చంద్రశేఖర్, జి శివరామకృష్ణ, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, శోభ, వినోద, నాగయ్య, బ్యాగరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కీసర ఆలయ నూతన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ల ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ల ప్రమాణ స్వీకారం సోమవారం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతనంగా నియమితులైన ట్రస్ట్ బోర్డు సభ్యులు ముందుగా శ్రీరామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహా మంటపంలో ఈవో నరేందర్ నూతన ట్రస్ట్ బోర్డు మెంబర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి కీసరగుట్ట ఆలయానికి చేరుకొని నూతనంగా నియమితులైన మెంబర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు మంత్రి శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నియమితులైన ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రం లక్ష్మారెడ్డి, మచ్చని జంగయ్య యాదవ్, కందడి వెంకట్ రెడ్డి, జవాజి మణికంఠ ముదిరాజ్, కందడి ముత్యం రెడ్డి , వంగేటి బుచ్చిరెడ్డి, రాగి రాఘవేందర్ రెడ్డి , మామిళ్ల వెంకటేష్, రాగుల రమేష్ ముదిరాజ్, ఎంపాల సుధాకర్ రెడ్డి, మణిగండ్ల నాగరాజు, కష్టన్న గారి వర్షిత లింగం, శీలం శ్రీనివాసులను వివిధ పార్టీలకు చెందిన నాయకులు, శ్రేయోభిలాషులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ రమేష్ శర్మ వంశపారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.



కాలనీలలో రోడ్ల అభివృద్ధికి చర్యలు

- కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

నవతెలంగాణ-నేరేడ్ మెట్



మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ తెలిపారు. సోమవారం మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లిలో అంతర్గత రోడ్లు ,అలాగే సాయినగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు సహకారంతో డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నిరంతరం తాను డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని దశల వారీగా పరిష్కారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ మహేశ్, ఎస్ఎస్ ప్రభాకర్, ఏఈ రవళి, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, పరమేష్, శోభన్, వెంకటేష్, అనిల్ గౌడ్, నవీన్, యాదిరెడ్డి, ప్రవీణ్, కిట్టు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్ ఈశ్వర్ పూర్ కాలనీలో సుఖినోభవంతు ట్రస్ట్ ఫౌండర్ రత్న ప్రభకు ట్రస్ట్ అవసరాల నిమిత్తం రూ.50 వేల వ్యాన్ కొనడానికి ట్రస్ట్ సభ్యుడు వంజరి ప్రవీణ్ అందజేశారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బీఆర్ఎస్ ఉప్పల్ మైనార్టీ అధ్యక్షుడు బద్రు, ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి పాల్గొన్నారు.
నవతెలంగాణ-కాప్రా



వరద నీటి సమస్య పరిష్కారం కోసం బాక్స్ డ్రయినేజీ నిర్మాణం



- కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

వరద నీటి సమస్య పరిష్కారం కోసం బాక్స్ డ్రయినేజీ నిర్మాణం చేపడుతున్నట్టు వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు సోమవారం ఆమె సాయిదత్త కాలనీలో పర్యటించారు. కాలనీలో రూ 1.2 కోట్లతో నిర్మిస్తున్న బాక్స్ డ్రయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కాలనీలో వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద నీటి ముంపు సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే సహకారంతో బాక్స్ డ్రయినేజీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ పనులలో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, సుదేష్ ,జందార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చర్లపల్లి పోలీస్ స్టేషన్ ప్రారంభం : సీపీ

నవతెలంగాణ-కాప్రా

రాచకొండ కమిషనరేట్ పరిధిలో చర్లపల్లిలో ఏర్పాటు కానున్న నూతన పోలీస్ స్టేషన్ తాత్కాలిక భవనాన్ని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సోమవారం పరిశీలించారు. చర్లపల్లి ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మంజూరు చేసిన నూతన పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజా సమస్యలకు సత్వర న్యాయం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం త్వరలో జరుగతుందని తెలిపారు.కమిషనర్ వెంట మల్కాజిగిరి డీసీపీ జానకి, కుషాయిగూడ ఏసీపీ, ఇతర అధికారులు ఉన్నారు.



దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి

నవతెలంగాణ-సిటీబ్యూరో

దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ విశేషంగా కృషి చేశారని జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించుకోవడం ద్వారా వారిని గౌరవించుకోవడంతో పాటు మహనీయుల స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. భాగ్యరెడ్డి వర్మ 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి గాంచిన భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార సంబంధాల శాఖ అధికారి జి.వి.భాను ప్రసాద్, కలెక్టరేట్ ఏవో సునీల్, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.





హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపించడంతో భారతదేశంలో ప్రతి గంటకు నలుగురు మృతి చెందుతున్నారని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జీ.శంకర్‌రాజు తెలిపారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆస్పత్రిలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహనపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

సెల్ ఫోన్, బైక్ దొంగిలించిన ఇద్దరు అరెస్ట్

5 సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం

నవతెలంగాణ-దుండిగల్



నెల క్రితమే జైలు నుంచి విడుదలైన నేరస్తుడు ఒకరు తన స్నేహితుడితో కలిసి విలాసాల కోసం దొంగతనాలు పాల్పడుతూ తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో దుండిగల్ పోలీసులు పాపులాన్ డివైస్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించిన ఒక వ్యక్తిని గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా అతను నారాయణపేట తాండూరు గ్రామానికి చెందిన కూన పల్లి కరణ్ తేజ్‌గా తెలిసింది. అతను గండి మైసమ్మలో నివాసముంటున్నాడు. ఉపాధి కోసం వచ్చి ఉద్యోగం చేస్తూ విలాసాల కోసం తన కంపెనీలో పనిచేసే స్నేహితుడు మెగావత్ సాయి నాయక్‌తో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కరణ్ తేజ్‌ను అదుపులోకి తీసుకొని పాపి లోన్ అప్లికేషన్ ఫింగర్ ప్రింట్ స్కానర్ ద్వారా గుర్తించి పూర్తిగా విచారణ చేపట్టారు. దాంతో అతను మరో కేసులో నిందితుడని, గత నెల క్రితమే జైలు నుంచి విడుదలై వచ్చాడని గుర్తించారు. గండి మైసమ్మ పరిసర ప్రాంతంలో గల అయ్యప్ప హాసల్‌ల్లో ఐదు ఫోన్లు, యూనికాన్ బైక్ దొంగతనం జరిగిందని ఎఫ్ఐఆర్ సైతం అయిందని, పోలీసులు విచారణ చేపట్టగా దొంగతనాలను నిందితుడు అంగీకరించడంతో కేసులు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ, డీఐలను మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, మేడ్చల్ జోన్ డీసీపీలు అభినందించారు.



సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేసు ఛేదించడంలో పాపులాన్ చెకింగ్ ఫింగర్ ప్రింట్స్ డివైస్ ఎంతో ఉపయోగ పడిందని తెలిపారు.

నాలా పనులపై గూగుల్ మీట్‌లో మేయర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలోపు ఎస్.ఎన్.డీ.పీ. ద్వారా నాలా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌లకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశాలు జారీచేశారు. వచ్చే వర్షాకాలానికి ముందుగానే అసంపూర్తిగా ఉన్న నాలా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు జోనల్ కమిషనర్, ఎస్.ఇ సికింద్రాబాద్ చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్‌లతో నాలా పనులపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. నల్లకుంట పద్మ కాలనీలో మూసి నాలా రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో అక్కడ పది రోజులలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పద్మ కాలనీ, వెజిటేబుల్ మార్కెట్, ఓల్డ్ రామాలయం, ఫీవర్ హాస్పిటల్ గుండా నాలా ప్రవహిస్తుందని, నాగమయ్య కుంట నుండి పద్మ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్ ప్రతి సంవత్సరం వరదలతో దెబ్బతింటుంది. ఈ దెబ్బతిన్న వాల్ రీ-కన్స్ట్రక్షన్ కోసం డీ-సిల్టింగ్ అనంతరం పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాలా పనులను అధికారులతో ప్రతి రోజు రివ్యూ చేస్తూ నిర్దేశిత సమయానికి ముందే పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత జోనల్ కమిషనర్ పనులపై మేయర్‌కు వివరించారు. ప్రతి రోజు ఎస్.ఎన్.డీ.పీ వర్క్స్, ఫిర్యాదులపై గూగుల్ మీట్, కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని మేయర్ తెలిపారు.

ఘనంగా బీఆర్ఎస్ నాయకులు మోజెస్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ముషీరాబాద్



బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రావణ్‌కుమార్, ప్రవీణ్ ఆధ్వర్యంలో రామ్‌నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జై సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలన్నారు. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ సీనియర్ నాయకులు ఎర్రం శేఖర్, ముదిగొండ మురళి, కొండమడుగు మధు, రాజు చారి, ప్రవీణ్, గండు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎం.వీ.భాగ్యరెడ్డి వర్మకు నివాళ్ళు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సంఘ సంస్కర్త ఎం.వీ.భాగ్యరెడ్డి వర్మకు జీహెచ్ఎంలో నివాళ్లు అర్పించారు. భాగ్య రెడ్డి వర్మ 135వ జయంతిని పురస్కరించుకుని సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి జీహెచ్ఎం కమిషనర్ డి.ఎస్ లోకేష్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంటరాని కులాల ఉద్ధరణ, దేవదాసి, జోగిని వంటి దురాచారాలను నిర్మూలనకు ఆయన విశేష కృషి చేశారని కమిషనర్ తెలిపారు. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలు స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెన్నెడీ, పంకజా, సీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మజ, హెచ్ఆర్‌డీసీఎల్‌సీఈ సరోజ దేవి, చీఫ్ అకౌంట్స్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, ఏఎంసీ రమణ, జీవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపు

- నాంపల్లి నుంచి లక్డీకపూల్‌కు మార్పు
- ఫైల్స్, పర్నీచర్ తరలింపు
- రేపటిలోగా తరలించాలని ఆదేశాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాంపల్లి-అబిడ్స్ రోడ్డులోని హైదరాబాద్ కలెక్టరేట్‌ను లక్డీకపూల్‌లోని పాత రంగారెడ్డి కలెక్టరేట్ భవన సముదాయంలోకి తరలించే ప్రక్రియ మొదలైంది. ఆదివారం నుంచే మొదలైన ఈ ప్రక్రియ రేపటిలోగా పూర్తికానుందని కలెక్టరేట్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు తరలింపు పనులను సంబంధిత అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజుల్లోగా అన్ని శాఖలు కొత్త కలెక్టరేట్ నుంచి తమ కార్యకలాపాలు కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్వో విభాగం ఫైల్స్, ఫర్నిచర్‌ను తరలించారు. మంగళ, బుధవారాల్లో మిగతా శాఖల తరలింపు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. దీంతో దాదాపు 33 ఏండ్ల క్రితం నిర్మించిన హైదరాబాద్ కలెక్టరేట్ పాలనా వ్యవహారాలకు తెరపడనుంది. నాంపల్లిలో 1990లో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను నిర్మించారు. సుమారు ఎకరం స్థలంలో వివిధ విభాగాల కార్యకలాపాలను నిర్వర్తించేందుకు నాలుగు అంతస్తుల్లో భవనాలను కట్టారు. ప్రస్తుతం ఉన్న భవనానికి ఎదురుగా మరో రెండు భవనాలు కొనసాగుతున్నాయి. కలెక్టరేట్‌లో మొత్తం 32 విభాగాలు పని చేస్తుండగా.. దాదాపు 250 మంది అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

16 ఏండ్ల క్రితం..

1990లో నిర్మించిన హైదరాబాద్ కలెక్టరేట్‌కు నూతన భవనాన్ని నిర్మించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని కనబర్చాయి. సమీకృత కలెక్టరేట్ల పేరిట రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో శరవేగంగా పనులు చేపడుతూ అక్కడి అధికారులు, ఉద్యోగులకు ఆధునిక హంగులతో సౌకర్యాలు కల్పిస్తున్నా.. నగరం నడిబోడ్డున పని చేస్తున్న యంత్రాంగాన్ని మాత్రం పట్టించుకోని పరిస్థితి. హైదరాబాద్ జిల్లా గ్రేటర్ పరిధిలో ఉండటంతో ప్రొటోకాల్ డ్యూటీలు మినహా సాధారణ పరిపాలన వ్యవహారాలు ఇక్కడ తక్కువగా



ఉంటాయనే భావనతో కొత్త బిల్డింగు ప్రతిపాదనలను పట్టించుకునే వారు కరువయ్యారు. కొత్త భవనం నిర్మాణం పక్కనపెడితే.. కనీసం సౌకర్యాలున్న ఇతర ప్రాంతానికి తరలించడంపై కూడా ప్రభుత్వం అలసత్వం వహించడంతో ఉద్యోగులు కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా మాసబ్ ట్యాంక్ మహావీర్ ఆస్పత్రి సమీపంలో ఎకరం ప్రభుత్వ స్థలంలో 16 ఏండ్ల క్రితం హైదరాబాద్ నూతన కలెక్టరేట్ భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. 30 ఏండ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు కొన్ని గదుల్లోని స్లాబులు పెచ్చులూడి పడటం, తాగునీటి సమస్యతో పాటు మరుగుదొడ్ల అధ్వానంగా మారడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, వివిధ



శాఖలకు చెందిన ఉన్నతాధికారుల కార్యాలయాలు దూరంగా ఉండడంతోపాటు కలెక్టరేట్‌లో 32 విభాగాలను నిర్వహించేందుకు అనుకూలత లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో నూతన భవనాన్ని నిర్మించాలని అప్పట్లో ప్రభుత్వం భావించింది. ఒకే ప్రాంగణంలో అన్ని ఆఫీస్‌లో పాటు ప్రజలకు సులభతరమైన సేవలందించేందుకు కొత్త నిర్మాణానికి అప్పట్లో అడుగులు పడ్డాయి. అప్పట్లో ప్రభుత్వం ప్రతిపాదనలు అంగీకరించి కొత్త కాంపెక్స్ కోసం ఏప్రిల్ 2007లో రూ.10 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 10 అంతస్తుల్లో కాంప్లెక్స్‌కు ఆర్అండ్‌బీ శాఖ ప్రయివేట్ కన్సల్టెంట్‌తో కలిసి డిజైన్ చేసింది. కాంప్లెక్స్ అంచనా వ్యయం రూ.46 కోట్లు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. దీంతో నిధుల కొరతతో పనులు ముందుకు జరగలేదు. 2008లో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నవీన్ మిట్టల్ కలెక్టరేట్ కొత్త భవనంపై దృష్టి సారించారు. ఈ మేరకు మరో ఆర్కిటెక్ట్ ద్వారా గతంలో ప్రతిపాదించిన 10 అంతస్తులను 6 అంతస్తులకు తగ్గించారు. ఇందులో భాగంగా రూ.22 కోట్ల అంచనాతో 1.80.000 చదరపు అడుగుల విస్తీర్ణంతో సవరించి డిజైన్ చేశారు. కాగా, సవరించిన ప్రణాళికలు, అంచనాలను తిరిగి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించారు. పాత కలెక్టరేట్ కాంప్లెక్స్ భూమిని వేలం వేసి వచ్చిన మొత్తాన్ని ప్రతిపాదిత కొత్త కాంప్లెక్స్ కోసం ఉపయోగించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సూచించడంతో నిర్మాణం పెండింగ్‌లో పడింది. నగర శివారులోని కొంగరకలాన్‌లో ఇటీవల నిర్మించిన నూతన సమీకృత భవన సముదాయంలోకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను తరలించిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ బదిలీకి మార్గం సుగమైంది. పాత రంగారెడ్డి కలెక్టరేట్‌లో కొన్ని మరమ్మతు పనులు పూర్తి చేయాల్సి ఉందనీ, ఇందుకు రూ.3 కోట్లు కావాలని ఆర్థికశాఖకు కొన్నినెలల క్రితం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మరమ్మతు పనులు తర్వాత చేసుకోవచ్చనీ, ముందు ఇక్కడి నుంచి షిఫ్ట్ కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో షిఫ్టింగ్ చేస్తున్నారు. నాంపల్లి కలెక్టరేట్‌లో త్వరలోనే పోలీసు సౌత్ వెస్ట్‌జోన్ ఆఫీసు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

జీవవైవిధ్య పరిరక్షణ అధ్యయన కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో జీవవైవిధ్య పరిరక్షణ అధ్యయనం కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణతో కలిసి ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ పరిధిలోని రూసా ప్రాజెక్టులో భాగంగా ఓయూలో 2019లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి శాశ్వత భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ప్రొ.రవిందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పథకాలపై అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. హరితహారం, పల్లె ప్రకృతి వనాలు సహా జీవవైవిధ్యంపై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసి, పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేయాలని సూచించారు. ఫలితంగా జీవవైవిధ్యంలో మార్పులు, అందుకు అనుగుణంగా పరిరక్షణకు అధ్యయనాలు ఉపయోగపడాలన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఓయూకు పరస్పర అవగాహనా ఒప్పందాలు ఉన్నందున ఆయా వర్సిటీల అధ్యాపకులు జీవవైవిధ్యంపై పరిశోధనలు చేసేందుకు ఇక్కడకు వస్తారని స్పష్టం చేశారు. ఫలితంగా వారితో ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలపై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే వెసులుబాటు దక్కుతుందన్నారు."ఆక్సిజన్ పార్క్ ఏర్పాటుతో సహా క్యాంపస్‌లో జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడానికి, రక్షించడానికి ఓయూ అనేక చర్యలు తీసుకుంటోందని" అని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల.లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్రంలో ఉన్న జీవవైవిధ్యానికి సంబంధించిన పూర్తి శాస్త్రీయ సమాచారాన్ని డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నట్టు, ఓయూ జీవవైవిధ్య పరిరక్షణ కేంద్రం డైరెక్టర్ సి.శ్రీనివాసులు తెలిపారు. కార్యశాలలు, ఇతర కార్యక్రమాల ద్వారా జీవవైవిధ్యానికి సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ అధ్యయన కేంద్రం ద్వారా వృత్తిపరమైన సంస్థాగత అభివృద్ధి, సామర్థ్యాన్ని పెంపొందించటంతో సహా విశ్వవిద్యాలయ జీవవైవిధ్య ప్రయత్నాలను మరింత పెంచుతుందని స్పష్టం చేశారు. జీవవైవిధ్యం, వాతావరణ మార్పు, పరిరక్షణ పరిశోధనల కోసం అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు అధునాతన సౌకర్యాలతో 5158 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీవవైవిధ్య పరిరక్షణ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ప్రొ.బి.వీరయ్య, ప్రొ.భీమా, అధ్యాపకులు ప్రొ.బి.రాజెంద్ర నాయక్, ప్రొ.ఎ.ప్యాట్రిక్, పి.రఘుపతి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి : ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్



పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి మహిళలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలుగా డా.పద్మ లతను ఎన్నుకుని ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు జనాభా ప్రకారం సబ్-కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిలా బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికే మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందనీ, లోక్ సభలో కూడా ప్రవేశ పెట్టి పూర్తి చేయాలని కోరారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, లైంగిక దాడుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీలు అంటే చిన్న చూపా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మాణం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. మహిళా బిల్లు పాస్ కావాలంటే బీసీ మహిళలకు సబ్-కోటా ఇవ్వక తప్పదన్నారు. జనాభాలో సగం ఉన్న బీసీ మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. జాతీయ అధ్యక్షురాలు పద్మ లత మాట్లాడుతూ సమాజంలో మహిళలపై ప్రతి చోటా వివక్షత జరుగుతుందన్నారు. మహిళలను చిన్న చూపు చూస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత మహిళలకు తగిన రక్షణ కోసం పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున మహిళా వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎర్ర సత్యనారాయణ, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, అంజి, అనంతయ్య, నాని ముదిరాజ్, కుమార్ యాదవ్, సత్తిబాబు, జీపీటీ కుమార్, పెంకే శ్రీనివాస్, పి.భూషణం పాల్గొన్నారు.

ఓ బీసీ మేలుకో.. నీ రాజ్యం ఏలుకో



- బీసీ ముఖ్యమంత్రి ఏజెండాగా ముందుకెళ్తాం
- బీసీల రాజకీయ వేదిక ఏర్పాటు చేస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాబోయే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి ఏజెండాగా 'ఓ..బీసీ మేలుకో నీ..రాజ్యం ఏలుకో అనే నినాదంతో ముందుకెళ్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో "వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి భవిష్యత్ రాజకీయ కార్యచరణ ప్రకటించడానికి 33 జిల్లాల బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం" లక్డీకపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలకు ఈ భవిష్యత్తు రాజకీయ కార్యచరణ ద్వారా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని ప్రతి గ్రామ, జిల్లా, మండల, నియోజకవర్గాల్లో విస్తతంగా ప్రచారం చేస్తూ బీసీలకు అవగాహన కల్పిస్తూ రాబోయే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి ఏజెండాగా ముందుకెళ్తామని తెలిపారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయనీ, బీసీలు అంటే కేవలం ఓటు వేసే యంత్రాలుగానే ఈ రాజకీయ పార్టీల నేతలు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బడుగు, బలహీనవర్గాలు పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందనీ, తెలంగాణ వచ్చిన తర్వాత 5 శాతం ఉన్న అగ్రకులాలు ముఖ్యమంత్రి, మంత్రి పీఠాలు ఎక్కుతూ బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. బీసీలకు వచ్చే ఎన్నికల్లో 60 టికెట్లు ఇవ్వాలనీ, బీసీలకు రాజ్యాధికారంలో తమ వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ రాజకీయ కార్యాచరణలో భాగంగా బీసీ పార్టీని నెలకొల్పుతామనీ, బీసీల రాజకీయ వేదిక ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీ ముఖ్యమంత్రి ఏజెండాగా, ఓ బీసీ మేలుకో..నీ రాజ్యం ఏలుకో అనే నినాదంతో జులై రెండో వారంలో బీసీ ప్లీనరీలో 'బీసీల రాజకీయ ఏజెండా', ఆగస్టు రెండో వారంలో ఏపీ రాజధాని అమరావతి నుంచి తెలంగాణ వరకు 'బీసీల రథయాత్ర', 'బీసీ సింహ గర్జన' కార్యక్రమాలను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, రాష్ట్ర సమన్వయకర్త, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు, 33 జిల్లాల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, యువజన, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

వీఆర్ఏలను ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయండి

నవతెలంగాణ-ముషీరాబాద్



రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఎలకు పే స్కేలు వర్తింపజేసి, వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని వీఆర్ఎ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్టు వీఆర్ఎస్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీసీఎల్ ఏ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చైర్మన్ విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్ఎలకు పే స్కేలు వర్తింపజేయాలన్నారు. విద్యార్హతల కనుగుణంగా పదోన్నతులు కల్పించాలన్నారు. మెడికల్ ఇన్వాలి డేషన్లో భాగంగా 55 ఏండ్లు నిండిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయానుసారం ఏ శాఖలో సర్దుబాటు చేసినా ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వీఆర్ఎలకు 80 రోజుల సమ్మె కాలనికి వేతనం మంజూరు చేయాలని కోరారు. సీసీఎల్ఎ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసిన వారిలో వీఆర్ఎ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి అంబాల శ్రీధర్ గౌడ్, కన్వీనర్ కావలి సత్యనారాయణ యాదవ్, లక్ష్మీ నారాయణ, చిరంజీవి, యాట సునీత, కో-కన్వీనర్లు కరుణాకర్, మాధవి గౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

‘ఓలా, ఊబర్, రాపిడోలను నిషేధించండి’



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తూ వారి జీవితాలను రోడ్డున పడేస్తున్న ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేదించాలని ఏఐటీయూసీ తెలంగాణ మోటార్ ట్రాన్స్ పోర్టు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు బైరగోని రాజు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజుగౌడ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో ఓలా, ఉబర్ వైట్ నెంబర్ ప్లేట్ల వాహనాల దోపిడీ దందా కొనసాగుతుందన్నారు. ఎల్లో నెంబర్ ప్లేట్ల వాహనాలను ఎయిర్ పోర్ట్‌లోకి రానీయకుండా ఓలా, ఉబర్ బౌన్సర్ల దాడులు చేస్తున్నారని తెలిపారు. రోడ్డు టాక్స్ లేని వైట్ ప్లేట్ల వాహనాలను టాక్సీలుగా నడపడానికి రాష్ట్ర ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థ ఎలా అనుమతిస్తుందని ప్రశ్నించారు. కమర్షియల్ రోడ్డు టాక్స్ చెల్లించిన ఎల్లో నెంబర్ ప్లేట్ల టాక్సీ వాహనాలను అడ్డుకోవడం వల్ల క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు టాక్స్ చెల్లించిన ఎల్లో నెంబర్ ప్లేట్ల టాక్సీ వాహనాలను ఎయిర్ పోర్ట్‌లోకి అనుమతించి, టాక్స్ చెల్లించకుండా ప్రభుత్వానికి నష్టపరుస్తున్న ఓలా, ఉబర్ వైట్ నెంబర్ ప్లేట్ల వాహనాలను సీజ్ చేసి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో ఎలాంటి రుసుములు తీసుకోకుండా ఎల్లో ప్లేట్ వాహనాల క్యాబ్ డ్రైవర్లకు జీఎంఆర్ సంస్థ ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రోడ్డు టాక్స్ లేని వైట్ ప్లేట్ల బైక్‌లను ఓలా, ఉబర్, రాపిడో సంస్థలు వినియోగించి రూ.కోట్ల రోడ్డు టాక్స్ ఎగ్గొడుతున్నాయనీ, ఈ బైకులను ఎల్లో నెంబర్ ప్లాట్లుగా మర్చి వారి నుంచి టాక్స్ వసూలు చేయాలని లేదా పుర్తిగా నిషేదించాలని డిమాండ్ చేశారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఓలా, ఊబర్ సంస్థలు ఆశ చూపించి రూ.లక్షలు సంపాదించుకోవచ్చు అని చెప్పి 35 శాతం కమిషన్లు తీసుకుంటూ డ్రైవర్లకు దోపిడీకి గురి చేస్తున్నారనీ, వాళు మాత్రం రూ.కోట్లు సంపాదిస్తున్నారనీ, అధిక కమిషన్ దోపిడీ వల్ల ఇంధన కొనుగోలు, కుటుంబ పోషణకు, ఆటో, క్యాబ్‌ల లోన్ ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, మంత్రి కేటీఆర్ దీనిపై స్పందించి ఓలా, ఉబర్ సంస్థలతో చర్చించి తక్కువ కమిషన్ తీసుకునేటట్టు చేసి ఈ కమిషన్ దోపిడీ నుంచి రక్షించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు కొంరెల్లి బాబు, ఎస్.కె.లతీఫ్, సయ్యద్ మహమూద్ భాష, అమృతం, సత్యం నేత, బొంగు రవిగౌడ్, తిరుమలేష్‌గౌడ్, ఎం.శ్రీనివాస్, చంద్రశే ఖర్‌రెడ్డి, కృష్ణయ్య, రమేష్, రామకృష్ణ, ఎండి.మహబూబ్, మల్లేష్, ఆటో శీను నాయక్, పాపయ్య పాల్గొన్నారు.

రూ.12,999 ధరలో గెలాక్సీ ఏ14ను విడుదల చేసిన శాంసంగ్

నవతెలంగాణ-హైదరాబాద్

మీ స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని మెరుగు పరిచేలా ప్రీమియం డిజైన్, హై-రిజల్యూషన్ డిస్ప్లే, అసాధారణమైన కెమెరా సామర్థ్యాలు, దీర్ఘకాలం నిలిచి ఉండే బ్యాటరీ లైఫ్, అద్భుతమైన ఫీచర్ల శ్రేణిని మిళితం చేసే సరికొత్త గెలాక్సీ ఏ 14ని విడుదల చేస్తున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. మీకు అల్టిమేట్ సహచరునిగా ఉండేలా గెలాక్సీ ఏ14ని డిజైన్ చేశారు. సొగసైన, ప్రీమియం సౌందర్యాన్ని కలిగిన గెలాక్సీ ఏ14, ఐకానిక్ గెలాక్సీ సిగ్నేచర్ డిజైన్తో అందరినీ ఆకట్టుకునే పరికరంగా నిలుస్తోంది. పూర్తి హెచ్‌డి ప్లస్ రిజల్యూషన్తో కూడిన పెద్ద 6.6, స్క్రీన్, మీ అన్ని మల్టీమీడియా కార్యకలాపాల్లో శక్తివంతమైన వర్ణాలు, అద్భుతమైన డిటెయిల్స్ను నిర్ధారిస్తూ లీనమయ్యే విజువల్ అనుభవాన్ని అందిస్తుంది. అప్గ్రేడ్ చేసిన 13ఎంపీ సెల్ఫీ కెమెరాను కలిగిన గెలాక్సీ ఏ 14 అధిక రిజల్యూషన్ చిత్రాల కోసం 50ఎంపి ప్రైమరీ కెమెరాతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇది అల్ట్రా-వైడ్, మైక్రో కెమెరాను కూడా కలిగి ఉంది. వినియోగదారులు సృజనాత్మక అవకాశాలను అన్వేషించేందుకు, కచ్చితమైన, స్పష్టతతో క్లిష్టమైన డిటెయిల్స్ను బంధించేందుకు ఇవి అనుమతిస్తాయి, దాని ఆకట్టుకునే ఫీచర్లతో పాటు గెలాక్సీ ఏ 14 ఒక శక్తివంతమైన 5000ఎంఏహెచ్ బ్యాటరీని కలిగి ఉండగా, ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 2 రోజుల పాటు ఉంటుందని ఆ సంస్థ తెలిపింది.

ఆశా వర్కర్లకు ఎగ్జామ్‌ను వెంటనే రద్దు చేయాలి

- సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఆశా వర్కర్లకు ఎగ్జామ్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం.మీనా డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై చేపట్టే ధర్నా కోసం యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18 వేలకు పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. గతంలో ఇచ్చినట్టు ఆశాలకు ప్రతి నెలా ఒకటి, రెండో తేదీల్లో పారితోషకాలు చెల్లించాలనీ, పారితోషకం లేని అదనపు పనులు ఆశాలతో చేయించకూడదన్నారు. ఆశాలకు పని భారం తగ్గించాలనీ, జాబ్ చాటును విడుదల చేయాలన్నారు. ఏఎంసీల, పీఎస్సీల పేరుతో ఆశాలను ఒత్తిడి పెట్టొద్దన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియాస్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిస్టర్లు వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలన్నారు. క్వాలిటీతో కూడిన ఐదేండ్ల పెండింగ్ యూనిఫాం వెంటనే ఇవ్వాలనీ, జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అధికారుల వేధింపులను అరికట్టాలనీ, ఆశాలకి ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.కిషన్, ఆఫీస్ బేరర్‌లు, స్థానిక ఆశాలు, ఇతరులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే పార్టీ జెండాను ఎగరేస్తానని బీఆర్ఎస్ ఉద్యమకారుడు ఆర్‌వి.మహేందర్ కుమార్ అన్నారు. సోమవారం కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో 235 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వృద్ధాప్య పింఛన్, ఒంటరి మహిళ పింఛన్, వికలాంగులకు పింఛన్లు, అర్హులైన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. వీటన్నింటినీ ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏమీ చేయలేదనీ, తమ పార్టీకి ఈసారి ప్రజలు అవకాశం ఇస్తే అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలబెడుతామని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీని నమ్ముకుని కష్టపడుతున్నాననీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తనకు ఈసారి గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు.

ఆబ్కారీ శాఖలో లిక్కర్ లిఫ్టింగ్ పెంచటం పట్ల హర్షం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎక్సైజ్ శాఖలో లిక్కర్ లిఫ్టింగ్‌ను 5 శాతం నుంచి 7 శాతానికి పెంచడాన్ని తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ అసోసియేష్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆబ్కారీశాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా, గజమాలతో సత్కరించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ అసోసియేషన్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, గౌరవ సలహాదారులు అయిలి వెంకన్న గౌడ్, అధ్యక్షులు దామోదర్ గౌడ్ మాట్లాడుతూ కొంత కాలంగా నష్టాల్లో కూరుకుపోయిన రెస్టారెంట్ అండ్ బార్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవటానికి చర్యలు తీసుకుందని తెలిపారు. 90 ఎంఎల్, క్వార్టర్, ఆఫ్ బాటిల్స్‌ను రెస్టారెంట్లలో విక్రయించే అవకాశాన్ని ఇవ్వటంతోపాటు రెంట్స్‌ను 4 భాగాలుగా చెల్లించే వెసులుబాటును కల్పించటంపై సీఎం కేసీఆర్; మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు వారు చెప్పారు. మరికొన్ని పెండింగ్ సమస్యలపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గడ్డమీది విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజు గౌడ్, రామకృష్ణ, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ గౌడ్, నిరంజన్ గౌడ్, బత్తిని లతా గౌడ్ తోపాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : కార్పొరేటర్

నవతెలంగాణ-అడిక్‌మెట్



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాంకీ సంస్థ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మేరా లైఫ్ మేరా స్వచ్ షేహర్‌లి అనే ఉపశీర్షికతో లిస్వచ్ భారత్‌లో భాగంగా సెంటర్‌ను గాంధీ నగర్ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ జీహెచ్ఎంసీ ముషీరాబాద్ ఎంహెచ్ఓ మైత్రితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్‌ను పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పనికి రాని వస్తువులు, బట్టలు, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎవరి ఇంట్లో ఉన్నా, వాటిని ఈ సెంటర్ లో అందించాలనీ, తమ ఇంటి ఆవరణలో కానీ, చెత్తా కుప్పల్లో కానీ పడవేయకుండా, వాటిని ఈ సెంటర్‌లో అందించాలని కోరారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ హిత జీవన శైలి పై అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్ కుమార్ జవాన్, లింగం, విజయ్, రాజు, సోమేష్, శ్రీనివాస్, పారిశుధ్య సిబ్బంది, బీజేపీ నాయకులు నవీన్ కుమార్, ఆనంద్ రావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లా స్థాయి విజేతకు అభినందనలు

నవతెలంగాణ-మేడ్చల్

సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడల్లో భాగంగా రన్నింగ్ 100 మీటర్ల పోటీలో మొదటి స్థానంలో గెలుపొందిన మండల పరిధిలోని నూతన్‌కల్ గ్రామానికి చెందిన పి.సురేష్ సోమవారం సోషల్ మీడియా వేదికగా ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ అమ్మగారి శైలజ విజయానందారెడ్డి, ఎంపీడీవో పద్మావతి, మండల కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, మండల ప్రింట్ మీడియా అధ్యక్షుడు జెకె హరినాథ్, పిఎసిఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, వార్డు సభ్యుడు యూనిస్ పాషా, బీఆర్ఎస్ నాయకుడు చినోళ్ళ జీవన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో విజేతగా గెలుపొందాలని ఆకాంక్షించారు.



విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట : ఎంపీపీ దాసరి ఎల్లూబాయి

నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎంపీపీ దాసరి ఎల్లూబాయి అన్నారు. పాఠ్యపుస్తకాలను కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో (ఎం ఈ ఓ కార్యాలయంలో) ఎంఈఓ జె.వసంత కుమారి ఆధ్వర్యంలో సోమవారం జడ్పీటీసీ అనిత లాలితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరానికిగాను ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 'మెగా జాబ్ మేళా'

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్ర ప్రభుత్వం-యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ సోషల్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ నేతృత్వంలో సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో "మెగా జాబ్ మేళా" నిర్వహించారు. ఈ "మెగా జాబ్ మేళా"ను మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళాకు హాజరయ్యారు. 4725 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 269 మందిని వివిధ కంపెనీలు స్పాట్‌లో రిక్రూట్ చేసుకున్నాయి. 1458 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. స్పాట్‌లో ఉద్యోగాలు పొందిన వారికి మంత్రులు, ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. ఈ మెగా జాబ్ మేళాలో ఇద్దరు ట్రాన్స్ జెండర్లు ఉద్యోగాలు పొందారు. ముగ్గురు వికలాంగులు ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 18 జాబ్ మేళాలు నిర్వహించినట్టు తెలిపారు. మంత్రి కేటీఆర్ కృషితో ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉన్న కంపెనీలు హైదరాబాదులో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయన్నారు. సాఫ్ట్‌వేర్, బీపీఓ, ఫార్మా, రిటైల్, రియల్‌ఎస్టేట్ రంగాల్లో నిరుద్యోగ యువతకు వారి అర్హతలకు తగ్గట్లుగా ఉద్యోగాలు కల్పించమని చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన 18



జాబ్ మేళాల్లో 97 వేలా 19 మంది నిరుద్యోగ యువత టీఎస్‌టిప్‌కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి 30,902 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలను కల్పించి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన వారికి కనిష్టంగా నెలకు రూ.10వేల నుంచి గరిష్టంగా రూ.80 వేల వరకు జీతాలు అందుతున్నాయని చెప్పారు. హైదరాబాదులో త్వరలోనే 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు పూర్తయిన తర్వాత సమయాన్ని వధా చేయకుండా ఉద్యోగంలో స్థిరపడాలన్నారు.

ఇలాంటి మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు ఓ చక్కటి సువర్ణ అవకాశం అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ 118 కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించినట్టు తెలిపారు. యువత అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్దాసక్తులతో విద్యాభ్యాసం పూర్తి చేసి భవిష్యత్తుపై ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీపడాలన్నారు. సమాజంలో చిన్న చూపు చూడబడుతున్న ట్రాన్స్ జెండర్లు ఇలాంటి అవకాశాలు అందిపుచ్చుకోవడం సత్ఫలితాలు ఇస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఎండీ వేణు గోపాల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



పేద కుటుంబానికి వైద్యం అందించడమే లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

ప్రతి పేద కుటుంబానికి వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. అందులో భాగంగానే బస్తీ దావాఖానలు ప్రారంభించి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. సోమవారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 18, 9వ వార్డుల్లో బస్తీ దావఖానాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం 16వ వార్డులో రూ.52 లక్షల నిధుల నిర్మించిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 11 వార్డులో రూ.11 లక్షల నిధులతో చేపట్టిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సీఎం కేసీఆర్ బస్తీ దవఖానలను ఏర్పాటు నిర్ణయాన్ని తీసుకున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గ అభివద్ధి ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు కొడే మహేష్, తుడుం గణేష్, ఉమా నాగరాజ్, మానస శ్రవణ్ గుప్త, మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, హరికష్ణ యాదవ్, లావణ్య హన్మంత్ రెడ్డి, భవాని రాఘవేందర్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు గీత వంజరి, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు దొడ్ల రామకష్ణ గౌడ్ అధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి అనంతరం కార్పొరేటర్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎల్లమ్మ బండలోని ఎన్టీఆర్ నగర్ సాయిబాబా ఆలయంలో యువనేత దొడ్ల రామకష్ణ గౌడ్ అభిషేకం, కార్పొరేటర్ పేరున ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు, అనంతరం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస్ రావు, రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్ మాధ వరం రంగా రావుతో కలిసి దొడ్ల రామ కృష్ణగౌడ్ ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి కార్పొరేటర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు. డివిజన్ పరిధి లోని పీజేఆర్ నగర్ ఫేస్ 2 బస్తీ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దొడ్ల రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా పిల్లలకు పెన్‌లు, పెన్సిల్స్ తో కూడిన పౌచ్‌లను అందించారు. అనంతరం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లో గల శ్రీ రాజేశ్వరి వద్ధాశ్రమంలోని వద్దులకు దొడ్ల రామకష్ణ గౌడ్ చేతుల మీదుగా మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజేష్ చంద్ర, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, ఉమేష్, రవీందర్, వద్ధాశ్రమం నిర్వహకురాలు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పర్యటన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ 'గోస-శ్రీశైలం అన్న భరోసా' అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం సుభాష్ నగర్ 130 డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప, 60 యార్డ్స్, మైత్రినగర్, తెలుగు తల్లి నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పర్యటించారు. బస్తీల్లోని స్థానికులతో కలిసి పాదయాత్ర చేస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రాజీవ్ గహకల్పలో గతంలో నాణ్యతలేని డ్రైనేజీ పైప్ లైన్ వేసి, సీసీ రోడ్లు వేయకపోవడంతోనే పైప్ లైన్ ధ్వంసమైందనీ, రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి ఆయన హామీనిచ్చారు. రాజీవ్ గహకల్ప ఆటో స్టాండ్ వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు ఆర్‌జీకే ఆటో స్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సమస్యల వలయంగా తయారైందన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా జాబ్ మేళా పేరిట మళ్లీ యువతను మోసం చేయడానికి ఎమ్మెల్యే వివేకానంద్ సన్నద్ధం అయ్యారన్నారు. ముచ్చటగా మరో సారి ప్రజలను వంచించడానికి సిద్ధమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు ప్రజలే ఈసారి బుద్ధి చెప్తారన్నారు. కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పని ఖతమైందనీ, కమలం వికసిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, బావిగడ్డ రవి, బస్తీ నాయకులు చక్రి, నాగేశ్వర్, డాన్సర్ శీను, శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, ఉష, డివిజన్ సీనియర్ నాయకులు దారం సాయి కుమార్, హనుమాన్ కచవా, అంగడి మల్లేష్, గుబ్బల లక్ష్మీనారాయణ, దేవర రమేష్, విజేందర్ రెడ్డి, కుమ్మరి శంకర్, మల్లేష్ గౌడ్, క్రాంతి యాదవ్, రమణ, సంతోష్, బీజేవైఎం నాయకులు సాయిరాం రెడ్డి, జూల సందీప్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గ్రేటర్ హైదరాబాద్ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్కనాగరాజు ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతిని పురస్కరించుకుని మూసాపేట్ డివిజన్ అంబేద్కర్‌నగర్ గూడ్స్ షెడ్ రోడ్డు పీజేఆర్ స్టాచ్యు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రామిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఏ. శారదారెడ్డి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శారద, కర్క నాగరాజు వర్మ దళిత సమాజానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ అధ్యక్షులు కర్కడాకయ్య, బీఆర్‌టీయూ కార్మిక విభాగం సెక్రెటరీ పాషా, జగన్,రెడ్డి, సుధాకర్, దళిత నాయకులు గురజాల రాజు, అనిల్, వెంకన్న, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విత్తన ఉత్పత్తులు ప్రారంభించిన నూజివీడు సీడ్స్

నవతెలంగాణ-శామీర్‌పేట

నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కంపెనీ 3 కొత్త పరిశోధన వరి రకాలను శామీర్‌పేట్‌లోని లియోనియా రిసార్ట్స్‌లో సోమవారం డిస్ట్రిబ్యూటర్ల సమక్షంలో ప్రొడక్ట్ లాంచ్ ప్రోగ్రాం ద్వారా, ఆన్ లైన్ ద్వారా 4000 మందికి పైగా రైతులు పాల్గొన్న డిజిటల్ ప్లాట్ ఫారం ద్వారా విడుదల చేసింది. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కంపెనీ అధికారులు మాట్లాడుతూ ఉత్పత్తుల విశేషాలను వివరించారు. కొత్త పరిశోధన వరి రకాలైన ఎన్పి-7373 ఎన్ఎస్ఎల్ అన్నపూర్ణ, -9359 సంధ్య ఎన్‌పి-9153 పుష్కల్ ప్రస్తుతం తెలంగాణలో సాగు చేస్తున్న రకాల కంటే అధిక దిగుబడినిచ్చే రకాలు అని తెలిపారు. -7373 అన్నపూర్ణ అనేది నాన్-లాడ్జింగ్ సూపర్ ఫైన్ రైస్ రకం, ఇది ఖరీఫ్, రబీ సీజన్లలో నాటు పద్ధతిలో, నేరుగా విత్తిన సాగు పద్ధతిలో పెరుగుతుంది. -9359 సంధ్య అనేది 130-135 రోజులలో పక్వానికి వచ్చే చలిని తట్టుకునే సూపర్ ఫైన్ వరి రకం, అధిక దిగుబడి, అగ్గి తెగులును తట్టుకునే శక్తితో ఖరీఫ్, రబీ సీజన్లకు అనుకూలంగా ఉంటుంది.-9153 పుష్కల్ రకం ముతక ధాన్యం రకం, ఇది చాలా తక్కువ నిర్వహణ వ్యయం ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేయడానికి 120-125 రోజుల వ్యవధితో అధిక



దిగుబడిని కలిగి ఉంటుంది. కొత్తగా ప్రారంభించిన 3 విత్తన ఉత్పత్తులు తెలంగాణ రైతులకు వారి దిగుబడి, ఆదాయాన్ని పెంచడానికి మరింత ప్రయోజనం చేకూరుస్తాయి. నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కంపెనీ అధికారులు నీటిని పొదుపు చేసేందుకు, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు నేరుగా విత్తిన వరి సాగు పద్ధతిలో ఆధునిక శాస్త్రీయ వ్యవసాయం చేయాలని రైతులను ప్రోత్సహించారు. సారాంశంలో, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కంపెనీ పరిశోధన వరి రకాలు ఖరీఫ్, రబీ సీజన్లో రైతులకు తక్కువ ఖర్చుతో, మంచి దిగుబడి, అధిక రాబడితో ప్రయోజనం చేకూరుస్తుంది.

మై స్టైలిస్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన మింత్రా

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలో ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు ప్రముఖ గమ్యస్థానమైన మింత్రా తన వినియోగదారుల కోసం ఏఐ ఆధారిత ఎండ్-టు-ఎండ్ ఆటోమేటెడ్ పర్సనల్ స్టైల్ గైడ్ మై సైలిస్ట్ అనే విప్లవాత్మక ఫీచర్ను తన ప్లాట్ఫారమ్ ప్రవేశపెట్టింది. ఫ్యాషన్, జీవనశైలి కోసం షాపింగ్‌లో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ప్రత్యేకత కలిగిన ఈ కాన్సెప్టు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈసందర్భంగా మింత్రా చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ రఘు కృష్ణానంద మాట్లాడుతూ... మైసైలిస్ట్ అందుబాటు ద్వారా టెక్నాలజీని ఉపయోగించి ఫ్యాషన్ని ప్రజాస్వామ్యీకరించాలనే తమ నిబద్ధతను ఒక మెట్టు పైకి తీసుకువస్తుందన్నారు. మెషిన్ లెర్నింగ్, ఏఐ-ఆధారిత సాంకేతికతతో, భారతదేశంలోని ఫ్యాషన్ రంగంలో ఈ వినూత్న తరహా ఆవిష్కరణ ద్వారా ఫ్యాషన్పై అవగాహనతో రూపాన్ని సిఫార్సు చేస్తూ, వినియోగదారుల షాపింగ్ అనుభవాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందన్నారు. తమ నిపుణుల బృందం ఈ ఫీచర్ కస్టమర్-ఫ్రెండ్లీగా, సహజమైనదని నిర్ధారించేందుకు అవిశ్రాంతంగా పనిచేసిందన్నారు. తాము దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చినప్పటి నుంచి తాము సేకరించిన వాటి నుంచి తమ వినియోగదారులందరూ చాలా ఇష్టపడే మింత్రా యాప్ ద్వారా ఈ నిపుణులైన సైలిస్టు వారి చేతివేళ్ల వద్ద యాక్సెస్ చేయడానికి ఇష్టపడతారని తాము విశ్వసిస్తున్నామని తెలిపారు.

'ప్రజా సేవలో ఉన్నామే తప్ప గజం భూమి కూడా లేదు'



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి చేపట్టిన మూడున్నరేండ్ల ప్రజల సేవకే తమ డబ్బులతో ప్రజల అభివద్ధి పనులను చేశామే తప్ప ఎక్కడా కబ్జాకు పాల్పడలేదని సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ భర్త కొలను గోపాల్ రెడ్డి నిజాంపేట్‌లోని రూ.వేలకోట్ల భూములు కబ్జాలకు పాల్పడుతున్నారని బహిరంగంగానే తెలిపిన విషయం అందరికీ విధితమే. ఈ నేపథ్యంలో సోమవారం నిజాంపేట్ రాఘవరెడ్డి ఫంక్షన్ హాల్‌లో విలేఖర్ల సమావేశంలో గోపాల్ రెడ్డి మాట్లాడారు. కూన శ్రీశైలంగౌడ్ నిజాంపేట్ స్థానిక బీజేపీ నేతలు తనపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూడున్నరేండ్లుగా కార్పొరేషన్ అభివద్ధికి ఎల్లప్పుడూ కృషి చేశాం కానీ ఏ ఒక్క ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించలేదన్నారు. ఇప్పటికీ కార్పొరేషన్‌లో తమకు గజం భూమి కూడా లేదనీ, ఉందని ప్రజా దర్బార్‌లో నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అన్నారు. 58, 59 జీవో లో కూడా ఎప్పటినుండో ఉంటున్న పేద కుటుంబాల్లో స్థానిక గ్రామస్తులు అప్లయ్ చేసి ఉంటారేమో కానీ, తనకు సంబంధితులకు కానీ ఎలాంటి ప్రమేయం లేదన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారన్నారు. ఒకవేళ అర్హులైతే ప్రభుత్వం, రెవెన్యూ వారు ఎంక్వైరీ చేసి అర్హులైన వారికి అందజేస్తారని తెలిపారు. ఈ రోజుల్లో అంతా ఆన్‌లైన్ సిస్టం అయ్యిందనీ, ఇది అందరికీ తెలిసిన విషయమే అన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో 70 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అప్పగిస్తే కార్పొరేషన్ అభివద్ధికే వినియోగించాం అనే వాస్తవాలను గ్రహించాలన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కూడా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు, నర్సరీలు, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ళ, వంటి నిర్మాణ అభివద్ధి పనులకే వినియోగించామే తప్ప మరో ఇతర ప్రయోజానాల కోసం కాదన్నారు.

ప్రజా నాయకుడు వడ్డేపల్లి నర్సింగ్‌రావు 10'వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్, వివేకానందనగర్ డివిజన్ పరిధిలో గల వీఎన్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన అభిమానులు నివాళి అర్పించారు. కూకట్‌పల్లి విలేజ్‌లోని తాండ్రపాపారాయుడు చౌరస్తా వద్దగల వడ్డేపల్లి నర్సింగ్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి నర్సింగ్ రావు పేద ప్రజల కోసం చేసిన సేవలు మర్చిపోలేనివనీ, ప్రజల హదయాల్లో చెరగని ముద్ర వేశారనీ, వారి జ్ఞాపకాలు గుర్తుండి పోతాయ న్నారు. ఈ కార్యక్రమంలో అనంత నాగరాజు, శ్రీనివాస్, రమేష్, సత్యనారాయణ, దినేష్, దారసాయి, శివ, యోగి, అఖిల్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఒప్పో కొత్త స్మార్ట్ ఫోన్ ఎఫ్23 విడుదల

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణలో 18సేవా కేంద్రాల విస్తృత శ్రేణిని కలిగి ఉన్నటువంటి ప్రముఖ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయినటు వంటి ఒప్పో, రాష్ట్రంలో ఎఫ్ 21 సిరీస్ విక్రయాలతో హైదరాబాద్ లో 29శాతం దృఢమైన వృద్ధిని సాధించిందని ప్రతినిధులు పేర్కొన్నారు. ఒప్పో కౌంటర్ పాయింట్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో భారతదేశంలోని ప్రతి నలుగురిలో ముగ్గురికి బ్యాటరీ ఫోబియా ఉందని సూచించింది. తక్కువ బె డ్ బ్యాటరీతో తాము ఫోన్ను వినియోగించలె "కపోతున్నా మనే భయం వీరిని వెంటాడుతోందని పేర్కొన్నారు. సమీక్షకు స్పందించిన 46శాతం మంది తమ ఫోన్లను రోజుకు రెండుసార్లు ఛార్జ్ చేస్తామని, 92శాతం మంది బ్యాటరీ డిశ్చార్జ్ సమస్యలను ఎదుర్కొనేందుకు పవర్ సేవ్ మోడ్ ను ఉపయోగిస్తున్నామని 60శాతం స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ ప్రస్తుత బ్యాటరీ మంచి గా లేకుంటే కొత్త ఫోన్ ను కొనుగోలు చేస్తారని అధ్యయనం వెల్లడించిందని పేర్కొ న్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు, దీర్ఘకాలం ఉండి, భారీ సామర్థం, మన్నికైన బ్యాటరీతో కూడిన పరికరం కావాలన్న స్పష్టమైన అవసరాన్ని తీర్చేందుకు ఒప్పో ఎఫ్23 5జిని పరిచయం చేసిందని పేర్కొన్నారు. ఒప్పో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దమ్యంత్ ఖనోరియా మాట్లాడుతూ ఒప్పోలో, నోమోఫోబియా లేదా మొబైల్ ఫోన్ లేకుండా ఉండటం లేదా దానిని ఉపయోగించలేమనే భయం చాలా మంది వినియోగదారులకు నిజమైన ఆందోళన అని మేము అర్థం చేసుకున్నాము. ఒప్పో ఎఫ్23 56తో బ్యాటరీ హెల్త్ ఇంజిన్, సూపర్ పవర్ ఫాస్ట్ ఛార్జింగ్ వంటి వినూత్న సాంకేతికతలను అందించడం మాకు గర్వకారణం.

నేడు లండన్‌కు భారత క్రికెటర్లు

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్



ముంబయి : ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ సన్నద్ధత కోసం భారత క్రికెటర్లు నేడు ఉదయం లండన్‌కు బయల్దేరనున్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ప్లే ఆఫ్స్‌కు చేరని ఆరు జట్లకు ఆడుతున్న క్రికెటర్లు నేడు తొలి విడతగా ఇంగ్లాండ్‌కు చేరుకోనున్నారు. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్, శార్దుల్ ఠాకూర్ సహా స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ లండన్‌కు వెళ్లనున్న ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో మోకాలి గాయానికి గురయ్యాడు. అతడు లండన్‌కు మరో 2-3 రోజుల్లో చేరుకునే అవకాశం ఉంది. ఇక ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సైతం తొలి విడత బ్యాచ్‌తో కలిసి లండన్‌కు వెళ్లటం లేదు. అతడు కూడా కోహ్లితో కలిసి వెళ్లే అవకాశం కనిపిస్తుంది. ఇక ప్లే ఆఫ్స్‌లో ఆడుతున్న భారత క్రికెటర్లు ఐపీఎల్ ఫైనల్ అనంతరం మే 29న ఇంగ్లాండ్‌కు బయల్దేరనున్నారు. ఇంగ్లాండ్ కౌంటీ క్రికెట్‌లో ఆడుతున్న చతేశ్వర్ పుజార అక్కడితో జట్టుతో ఈ వారాంతంలో కలువనున్నాడు. రిజర్వ్, నెట్ బౌలర్లు ముకేశ్ కుమార్, అనికెత్ చౌదరి, ఆకాశ్ దీప్, యర్రా పృథ్వీ రాజ్‌లు సైతం నేడు రాహుల్ ద్రవిడ్, సహాయక సిబ్బందితో కలిసి ఇంగ్లాండ్‌కు వెళ్లనున్నారు. భారత్, ఆస్ట్రేలియా నడుమ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో జరుగనున్న సంగతి తెలిసిందే.

ఇక ఆడిడాస్ జెర్సీలు : భారత క్రికెట్ జట్టు అధికారిక జెర్సీ భాగస్వామిగా ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్ ఆడిడాస్ వ్యవహరించనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత క్రికెటర్లు ఆడిడాస్ జెర్సీలతోనే బరిలోకి దిగనున్నారు. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా సోమవారం ట్విట్టర్ వేదికగా తెలిపాడు.



ఆసియా పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో తెలంగాణ మాస్టర్ అథ్లెట్లు సత్తా చాటారు. తెలంగాణ నుంచి 32 మంది అథ్లెట్లు పోటీపడగా.. 24 పతకాలు సొంతం చేసుకున్నారు. మే 12-20 వరకు దక్షిణ కొరియాలో జరిగిన మాస్టర్స్ గేమ్స్‌లో పతకాలు సాధించిన తెలంగాణ మాస్టర్ అథ్లెట్లకు సోమవారం శంషాబాద్‌లోని విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ మాస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ చైర్మెన్ జగజీవన్ రెడ్డి, అధ్యక్షురాలు ఎం సంగీత, కార్యదర్శి సంతోశ్ కుమార్‌లు పతక విజేతలకు అభినందనలు తెలిపారు.

గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ క్వాలిఫయర్1 పోరుకు సిద్ధమయ్యాయి. ఐపీఎల్16 ఫైనల్లో తొలి అడుగు వేసేందుకు నేడు చెపాక్‌లో స్పిన్ సవాల్‌కు సై అంటున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో ఫైనల్లోకి చేరుకునేందుకు ఎదురుచూస్తుండగా.. నాలుగు సార్లు చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ రికార్డు స్థాయిలో మళ్లీ తుది పోరులో తలపడేందుకు ఉవ్విళ్లూరుతోంది. గ్రూప్ దశ మ్యాచుల్లో టాప్-2 నిలిచిన గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ అంతిమ సమరానికి చేరుకునేందుకు రెండు అవకాశాలు దక్కించుకున్నాయి. తొలి చాన్స్‌లోనే ఫైనల్లోకి అడుగుపెట్టే జట్టు ఏదో నేడు చెపాక్‌లో తేలనుంది.

తొలి అడుగు ఎవరిదో?



- సూపర్‌కింగ్స్, టైటాన్స్ ఢీ నేడు
- ఫైనల్లో చోటు కోసం అమీతుమీ
- చెపాక్‌లో ఫేవరేట్‌గా ధోనీసేన
- రాత్రి 7.30 నుంచి క్వాలిఫయర్ 1 పోరు

నవతెలంగాణ-చెన్నై

నిలకడ, బాధ్యతల్లో స్పష్టత, నిరూపించుకునే అవకాశం ఇవ్వటం, సహజశైలిలో రాణించేందుకు స్వేచ్ఛ కల్పించటం.. చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ విజయ మంత్ర ఇదే. సూపర్‌కింగ్స్, టైటాన్స్ మైదానంలో అనుసరించే వ్యూహాలు పూర్తి భిన్నం. కానీ జట్టును విజయ పంథాలో నడిపించేందుకు అనుసరించే మార్గాలు మాత్రం ఒకటే కావటం యాదృచ్ఛికం ఏమీ కాదు. ఎం.ఎస్ ధోని నాయకత్వ లక్షణాల నుంచి ప్రేరణ పొందిన హార్దిక్ పాండ్య.. మహి తరహాలోనే కూల్‌గా గుజరాత్ టైటాన్స్‌ను నడిపిస్తున్నాడు. అరంగేట్ర సీజన్లోనే చాంపియన్‌గా నిలిచిన టైటాన్స్.. రెండో సీజన్లో మళ్లీ టైటిల్ నిలుపుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక ఐపీఎల్ ఆరంభం నుంచీ అత్యంత నిలకడగా సూపర్‌కింగ్స్‌కు సారథ్యం వహిస్తూ ఏకంగా 12వ సారి చెన్నైకి ప్లే ఆఫ్స్‌కు చేర్చిన నాయకుడు ఎం.ఎస్ ధోని. ఇప్పుడు క్వాలిఫయర్ 1 పోరులో ధోని, హార్దిక్ నాయకులుగా మరోమారు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యారు. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో టైటాన్స్, సూపర్‌కింగ్స్ మ్యాచ్‌లో పాండ్యసేన పైచేయి సాధించగా.. ఇప్పుడు సీజన్ 71వ మ్యాచ్‌లో చెన్నై లెక్క సరిచేస్తుందేమో చూడాలి. చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్ 1 పోరు నేడు చెపాక్‌లో రాత్రి 7.30 గంటలకు ఆరంభం. స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

టాప్ ఆర్డరే కీలకం! :

చెన్నై సూపర్‌కింగ్స్‌కు టాప్ ఆర్డర్ అత్యంత కీలకం. ఓపెనర్లు డెవాన్ కాన్వే, రుతురాజ్ గైక్వాడ్ కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్నారు. ఇప్పటికే తాజా సీజన్లో ఓపెనింగ్ భాగస్వామ్యానికి వెయ్యికి పైగా పరుగులు జోడించిన కాన్వే, రుతురాజ్ క్వాలిఫయర్‌లో ధనాధన్ ప్రదర్శన పునరావృతం చేసేందుకు చూస్తున్నారు. కెరీర్ ముగిసిందనుకున్న తరుణంలో అనూహ్యంగా సరికొత్త రూపంలో దూసుకొచ్చిన బ్యాటర్ అజింక్య రహానె. తొలుత నాలుగు మ్యాచుల్లో దడ పుట్టించిన రహానె..ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడే భారత జట్టులో చోటు దక్కించుకున్న అనంతరం కాస్త నెమ్మదించాడు. డ్రెస్సింగ్‌రూమ్ నుంచి రహానెపై ఎటువంటి ఒత్తిడి లేదు. కానీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ముందు అజింక్య మళ్లీ ధనాధన్ విశ్వరూపం చూపించాల్సిన అవసరం ఉంది. కీలక క్వాలిఫయర్‌లో రహానె దంచికొడితే సూపర్‌కింగ్స్ ఫ్యాన్స్‌కు అది పండుగే. ఇక అంబటి రాయుడు, మోయిన్ అలీ, రవీంద్ర జడేజాలు ఈ సీజన్లో స్థాయికి తగ్గ ప్రభావం చూపించలేదు. టాప్ ఆర్డర్ ఎక్కువ బాధ్యత తీసుకోవటం సైతం అందుకు ఓ కారణమే. అయితే, కీలక క్వాలిఫయర్‌లో లోయర్ ఆర్డర్‌లోనూ ధనాధన్ మెరుపులు అవసరమే. చెపాక్‌లో మహీశ్ తీక్షణకు తోడు జడేజా, మోయిన్ అలీ 12 ఓవర్లు కీలకం కానున్నాయి. పవర్‌ప్లేలో దీపక్ చాహర్, డెత్ ఓవర్లలో మతీశ పతిరణలు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలువనున్నారు. ఇక ఎం.ఎస్ ధోని నాయకత్వం అంతిమంగా సూపర్‌కింగ్స్‌కు అతిపెద్ద బలం.

టైటాన్స్‌కు ఎదురేది :

గుజరాత్ టైటాన్స్ వరుస రెండు సీజన్లుగా అదరగొడుతుంది. ఆ జట్టుకు ఎదురు నిలిచే సత్తా ఎవరికుందనే తరహాలో హార్దిక్ సేన రాణిస్తుంది. గ్రూప్ దశలో 10 మ్యాచుల్లో గెలుపొందిన టైటాన్స్.. కేవలం నాలుగింటిలోనే ఓటమి చవిచూసింది. పది జట్లతో కూడిన లీగ్‌లో ఇది సాధారణ విషయం కాదు. టైటాన్స్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అపూర్వ ఫామ్‌లో ఉన్నాడు. వరుస శతకాలు సాధించిన గిల్.. చెపాక్‌లో మరో మూడెంకల స్కోరుపై కన్నేశాడు. వృద్ధిమాన్ సాహ కీలక మ్యాచుల్లో అనూహ్య ప్రదర్శన చేసే అలవాటు కొనసాగిస్తే టైటాన్స్‌కు తిరుగులేదు. టైటాన్స్‌ను వేధిస్తున్న ఒకే సమస్య నం.3 బ్యాటింగ్ పొజిషన్. కెప్టెన్ హార్దిక్ పాండ్య, విజయ్ శంకర్‌లు ఆ స్థానంలో ఆడుతున్నారు. డెవిడ్ మిల్లర్, రాహుల్ తెవాటియ, రషీద్ ఖాన్‌లు ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. ప్రత్యేకించి ఛేదనలో గుజరాత్ టైటాన్స్‌ను అడ్డుకోవటం ప్రత్యర్థి బౌలర్లకు సాధ్యపడటం లేదు. ఇక టైటాన్స్‌కు అదనపు బౌలర్ సమస్య సైతం ఉంది. చెపాక్ పిచ్‌పై రాహుల్ తెవాటియ, శనక సేవలను పాండ్య వినియోగించుకునే అవకాశం లేకపోలేదు. మహ్మద్ షమి, నూర్ అహ్మద్, మోహిత్ శర్మలతో కూడిన పేస్ త్రయం బాగుంది. స్పిన్ మాస్టర్ రషీద్ ఖాన్ చెపాక్‌లో మాయ చేయగల సమర్థుడు.

పిచ్, పరిస్థితులు :

చెన్నైలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. చెపాక్ పిచ్ సహజసిద్ధంగా స్పిన్ స్వర్గధామం. ఇక్కడ రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టు మంచు ప్రభావం నుంచి తప్పించుకునే మార్గాలు అన్వేషించాల్సిందే. ఈ సీజన్లో చెపాక్‌లో జరిగిన ఏడు మ్యాచుల్లో నాలుగింట రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టు విజయం సాధించింది. మంచు ప్రభావం సైతం అందుకు ఓ కారణం కావచ్చు!. టాస్ నెగ్గిన జట్టు ఎటువంటి ఆలోచన లేకుండా తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

తుది జట్లు (12 అంచనా) :

గుజరాత్ టైటాన్స్ : శుభ్‌మన్ గిల్, వృద్ధిమాన్ సాహ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (కెప్టెన్), విజయ్ శంకర్, డెవిడ్ మిల్లర్, దసున్ శనక, రాహుల్ తెవాటియ, రషీద్ ఖాన్, యశ్ ధయాల్, మహ్మద్ షమి, నూర్ అహ్మద్, మోహిత్ శర్మ.

చెన్నై సూపర్‌కింగ్స్ : డెవాన్ కాన్వే, రుతురాజ్ గైక్వాడ్, అజింక్య రహానె, శివం దూబె, మోయిన్ అలీ, అంబటి రాయుడు, రవీంద్ర జడేజా, ఎం.ఎస్ ధోని (కెప్టెన్, వికెట్ కీపర్), దీపక్ చాహర్, మహీశ్ తీక్షణ, తుషార్ దేశ్‌పాండే, మతీశ పతిరణ.

జూన్ 6 నుంచి హెచ్‌సీఏ సీజన్

లీగ్ సీజన్ షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఈ ఏడాది లీగ్ సీజన్ షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికైన ఆఫీస్ బేరర్ల అంతర్గత కుమ్ములాటలతో ఆటకు అన్యాయం చేస్తున్నారని, హెచ్‌సీఏ ప్రక్షాళనకు ఏక సభ్య కమిటీ ఎల్. నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించిన సంగతి తెలిసిందే. ఓ వైపు ఎన్నికల ప్రక్రియ కసరత్తు చేస్తూనే, మరోవైపు క్రికెట్ సీజన్ షెడ్యూల్ సైతం రూపొందించారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ దుర్గాప్రసాద్, సీఈవో సునీల్ 2023 సీజన్ షెడ్యూల్ విడుదల చేశారు. రంజీ ట్రోఫీ తరహాలో ప్రమోషన్, డిమోషన్ విధానం తీసుకొచ్చిన హెచ్‌సీఏ.. డివిజన్ ఏ, డివిజన్ బి, డివిజన్ సి విభాగాల్లో మ్యాచులు నిర్వహించనుంది. ఎ డివిజన్‌లో 21, బి డివిజన్‌లో 62, సి డివిజన్‌లో 105 జట్లు పోటీపడనున్నాయి. ప్రతి విభాగంలో జట్ల ఎంపిక, ఆటగాళ్ల ఎంపికకు అవసరమైన అర్హతలను హెచ్‌సీఏ స్పష్టంగా పేర్కొంది. జూన్ 6 నుంచి లీగ్ సీజన్ ఆరంభం కానుంది.



పండుగలా సిఎం కప్ పోటీలు

- జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలు షురూ
- ములుగు జిల్లా పోటీలు ఆరంభించిన శాట్స్ చైర్మెన్

నవతెలంగాణ-హైదరాబాద్ : సిఎం కప్ 2023 టోర్నీ రెండో అంచె పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో మొదలయ్యాయి. జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలను సోమవారం 33 జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు ఘనంగా ప్రారంభించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 85000 మంది గ్రామీణ క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటనున్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఐదు క్రీడాంశాలకు అదనంగా జిల్లా స్థాయి పోటీల్లో మరో ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ములుగు జిల్లా పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ఏటూరు నాగారంలో ప్రారంభించారు. ' ములుగు జిల్లాలో ఆరు వేల మంది క్రీడాకారులు సిఎం కప్ పోటీల్లో పోటీపడటం గొప్ప విషయం. ఏజెన్సీ ప్రాంతంలో క్రీడలకు అపూర్వ లభించింది. క్రీడలు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. సిఎం కప్ పోటీల్లో ప్రతిభ చూపిన గ్రామీణ క్రీడాకారులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణతో అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దుతాం. ప్రపంచ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు అందిస్తుంది. ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుంది. గ్రామీణ యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని రాణించాలి' అని ఆంజనేయ గౌడ్ అన్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ అధికారి అంకిత్, అదనపు ఎస్పీ సంకీర్త్, డివైఎస్‌ఓ రమణ రాజు, ములుగు స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా జింఖానా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలను క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్‌లు జిల్లాల్లో పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

విలక్షణ నటుడు శరత్ బాబు ఇకలేరు..

సంగీత సంచలనం రాజ్ మరణవార్తను పూర్తిగా జీర్ణించుకోకముందే టాలీవుడ్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. విలక్షణ నటుడు శరత్‌బాబు (72)ని చిత్ర సీమ కోల్పోయింది. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శరత్‌బాబు మెరుగైన వైద్యం కోసం నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఎఐజీ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. శరీరం మొత్తం విషతుల్యం (సెప్సిస్) కావడంతో కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం ఇతర అవయవాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత నెల రోజులుగా వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు.

శరత్‌బాబు అప్పట్లో అమ్మాయిల కలల రాకుమారుడు. టాలీవుడ్‌లో ఉన్న అతి కొద్ది మందిలో హీరోలను మించి అందంగా, హ్యాండ్సమ్‌గా కనిపిస్తూ ప్రత్యేకతను చాటుకున్నారు.

తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విలక్షణమైన నటుడిగా పేరు తెచ్చుకున్న ఆయన హీరోలకు సరి సమానంగా వెండితెరపై ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పించారు.

ఆహార్యం, యూనిక్ వాయిస్‌తో హీరోలా కనిపించే రూపంతో అందరి మనసులు దోచుకున్నారు. ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, స్నేహితుడిగా, తండ్రిగా, అన్నగా, విలన్‌గా.. ఇలా విభిన్నమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా, ఆల్‌రౌండర్‌గా ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సొంతం చేసుకున్న శరత్‌బాబు జీవిత విశేషాలు..

పోలీస్ ఆఫీసర్ కావాలనుకుని..

శరత్ బాబు అసలు పేరు సత్యం బాబు దీక్షితులు. 1951, జూలై 31న ఆంధ్ర ప్రదేశ్‌లోని ఆముదాల వలసలో జన్మించారు. 8 మంది అన్నదమ్ములు, ఐదుగురు అక్కా చెల్లెళ్లలో శరత్‌బాబు నాలుగోవారు. స్కూల్ రోజుల్లోనే ఆయన నాటకాల్లో నటించారు. హీరోకి ఉండాల్సిన లక్షణాలన్ని పుష్కలంగా ఉండటంతో కాలేజీ రోజుల్లో అందరూ సినిమాల్లో ట్రై చేయమని శరత్‌బాబుకి సలహా ఇచ్చారు. దీనికి తండ్రి నిరాకరించిన, తల్లి ప్రోత్సాహంతో డిగ్రీ తర్వాత సినిమా వైపు అడుగులు వేశారు. అయితే సినిమాల్లోకి వచ్చిన చాలా మంది డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యామని చెబుతుంటారు. కానీ శరత్ బాబు మాత్రం పోలీస్ ఆఫీసర్ కావాలనుకుని యాక్టర్ అయ్యారు. తండ్రి హోటల్ బిజినెస్ చేసేవారు. తనని కూడా అదే బిజినెస్ చూసుకోమనే వారట. కానీ శరత్ బాబు మాత్రం పోలీస్ ఆఫీసర్ కావాలనుకునేవారు. కాలేజీ రోజుల్లో కంటి చూపు దెబ్బతింది. అదే ఆయన పోలీస్ కావాలన్న కలని కలగానే మిగిల్చింది.

రామరాజ్యంలో హీరోగా..

మద్రాసు వెళ్లి ఆదుర్తి సుబ్బారావుని కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. అదే సమయంలో రామవిజేత అనే సంస్థ కొత్తవాళ్లతో సినిమాలు తీస్తున్నారని వెళ్లారు. అప్పటికే అక్కడ వెయ్యి అప్లికేషన్స్ ఉన్నాయి. వాటిల్లో మూడు సెలెక్ట్ చేశారు. అందులో శరత్‌బాబు ఒకరు. ఆయనే హీరోగా సెలెక్ట్ అయ్యారు.

అలా 'రామరాజ్యం' (1973) సినిమాతో హీరోగా తెలుగు తెరకు పరిచయం అయ్యారు. తొలి సినిమాలోనే జగ్గయ్య, ఎస్వీరంగారావు, సావిత్రి, చంద్రమోహన్, చంద్రకళ వంటి హేమాహేమీలతో నటించారు. ఈ సినిమా దర్శక, నిర్మాతలు సత్యంబాబు దీక్షితులు పేరుని శరత్‌బాబుగా మార్చారు.

ఆ తర్వాత అట్లూరి పూర్ణ చంద్రరావు స్క్రీన్ టెస్ట్ చేసి, 'స్త్రీ' చిత్రంలో సపోర్టింగ్ హీరోగా చేసే అవకాశాన్ని ఇచ్చారు. ఏవీఎం సంస్థ నిర్మించిన 'నోము'లోను, డూండీ తెరకెక్కించిన 'అభిమానవతి' చిత్రంలోనూ పవర్‌ఫుల్ నెగటివ్ రోల్స్‌లో నటించి ప్రేక్షకుల్ని మెప్పించారు. హీరోగానే కాకుండా ప్రతినాయకుడిగానూ నటించడానికి శరత్‌బాబు వెనుకాడలేదు. అదే ఆయనకు సినీ పరిశ్రమలో సుదీర్ఘ ప్రస్థానానికి బాగా ఉపయోగపడింది.



తెలుగులో నటించిన చిత్రాలు

రామరాజ్యం, మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, తాయారయ్యా బంగారమ్మ, మూడు ముళ్ళ బంధం, రాధా కళ్యాణం, సీతాకోక చిలుక, సాగర సంగమం, సితార, కాంచనగంగ, అన్వేషణ, స్వాతి, స్వాతిముత్యం, కాష్మోరా, సంకీర్తన, సంసారం ఒక చదరంగం, అభినందన, జీవన జ్యోతి, స్వాతి చినుకులు, కోకిల, క్రిమినల్, హలో బ్రదర్, సిసింద్రి, గమ్యం, పెళ్ళి సందడి, నువ్వు లేక నేను లేను, శంకర్‌దాదా ఎంబీబీఎస్, శ్రీరామదాసు, శౌర్యం, నాగవల్లి, షిర్డిసాయి, నేల టిక్కెట్ వంటి తదితర చిత్రాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించారు. అలాగే పలు సీరియల్స్‌లోనూ నటించారు.

ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో శివాజీ గణేషన్, జయలలిత, జయసుధ, రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, పవన్‌కల్యాణ్‌తో పాటు నేటి తరం హీరోలు రామ్‌చరణ్, సూర్య వంటి వారితోనూ కలిసి నటించారు. శరత్‌బాబు తెలుగులో చివరి సారిగా కనిపించిన చిత్రం నరేష్ నటించిన 'మళ్ళీ పెళ్ళి'.

మలుపు తిప్పిన దిగ్గర్శకులు

బాలచందర్ దర్శకత్వంలో నటించిన 'నిళల్ నిజమాగిరదు' తమిళ చిత్రం మంచి విజయం సాధించింది. శరత్‌బాబు తొలిసారి పరభాషలో సాధించిన సక్సెస్. దీని తర్వాత ఆయన కెరీరే మారిపోయింది. అయితే నటుడిగా ఓనమాలు దిద్దుకున్నది బాలచందర్‌గారి దగ్గరే అని శరత్‌బాబు ఎన్నో సందర్భాల్లో చెప్పారు. ఆయన్ని పరిశీలిస్తే చాలు.. నటనే నేర్చుకోవచ్చన్నారు.

అలాగే విశ్వనాథ్‌గారిని పరిశీలించడం ద్వారా టైమింగ్, ఎక్స్‌ప్రెషన్స్ గురించి తెలుసుకున్నానని తెలిపారు. బాపుగారితో సినిమా చేసేటప్పుడు నటన కాకుండా క్యారెక్టర్ మాత్రమే సహజంగా కనిపించేలా నటించడం అలవాటు చేసుకున్నారు. ఆర్టిస్ట్‌గా శరత్‌బాబు కెరీర్‌ని మలుపు తిప్పిన దర్శకులు వీళ్ళు.

ఆ తర్వాత దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావు, కోదండ రామిరెడ్డి.. ఇలా చాలా మంది దర్శకులు శరత్‌బాబుతో విలక్షణ పాత్రలు వేయించారు.

అలాగే సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రంగనాథ్ హీరోగా నటించిన 'పంతులమ్మ అమెరికా అమ్మాయి' వంటి సినిమాల్లో శరత్‌బాబు నటించారు. ఈ సినిమాలు ఆయనకు తెలుగు, తమిళ భాషల్లో నటుడిగా మంచి గుర్తింపుని తెచ్చి పెట్టాయి.

ఇక కె. బాలచందర్ రూపొందించిన 'చిలకమ్మ చెప్పింది' సినిమా కూడా రెండు భాషల్లోనూ మంచి విజయాన్ని సాధించడంతో తమిళ, తెలుగు భాషల్లో అవకాశాలు పెరగడం మొదలైంది. అలాగే కన్నడ ఇండస్ట్రీలోనూ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్నారు.

8 నంది పురస్కారాలు

పలు భాషల్లో దాదాపు 220కి పైగా సినిమాల్లో నటించిన శరత్‌బాబు తన కెరీర్‌లో బెస్ట్ సపోర్టింగ్ ఆర్టిస్ట్‌గా ఎనిమిది నంది పురస్కారాల్ని దక్కించుకున్నారు. 1981, 1988, 1989 సంవత్సరాల్లో వరుసగా మూడు నంది పురస్కారాలని సొంతం చేసుకున్నారు. "సీతాకోక చిలుక, ఓ భార్య కథ, నీరాజం' సినిమాలకు వరుసగా ఈ నంది అవార్డుల్ని అందుకున్నారు.నటుడిగా నిలదొక్కుకుంటున్న సమయంలోనే నటి రమా ప్రభను 1974లో వివాహం చేసుకున్నారు. పద్నాలుగేళ్ల తర్వాత వీరి వైవాహిక జీవితానికి తెర పడింది. 1990లో స్నేహ నంబియార్‌ని వివాహం చేసుకున్న శరత్ బాబు ఆమెకు కూడా 2011లో విడాకులిచ్చారు.

ఆల్‌రౌండర్‌ని కోల్పోయాం..

విలక్షణ నటునతో, వైవిధ్యమైన పాత్రలతో ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందిన శరత్‌బాబు భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం ఏఐజీ ఆస్పత్రి నుంచి సోమవారం సాయంత్రం 5.30 నుంచి 7.30వరకు ఫిల్మ్‌ఛాంబర్‌లో ఉంచారు. మంగళవారం చెన్నైలో శరత్‌బాబు అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

సీనియర్ నటుడు శరత్‌బాబు మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

ఐదు దశాబ్దాలుగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 220కి పైగా చిత్రాల్లో నటించిన శరత్‌బాబు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు. శరత్‌బాబు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. **- సీఎం కేసీఆర్**

అందం, హుందాతనం ఉట్టిపడే తన నటనతో ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకున్న శరత్‌బాబు నేను నటించిన అనేక చిత్రాల్లో నటించారు. ఆయన మరణ వార్త కలచివేసింది. **- చిరంజీవి**

శరత్‌బాబు విలక్షణమైన నటనతో చిత్రసీమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం ఉన్న నటులు. ఆయనతో కలిసి పని చేయటం మర్చిపోలేని అనుభూతి. **- బాలకృష్ణ**

నా మొదటి చిత్రం 'అక్కడ అమ్మాయి- ఇక్కడ అబ్బాయి', అలాగే 'వకీల్‌సాబ్'లో కూడా నటించారు. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా భిన్న భావోద్వేగాలను పలికించారు. **- పవన్‌కళ్యాణ్**

నవచిత్రం

2018.. తెలుగు హక్కులు దక్కించుకున్న బన్నీవాసు

ప్రస్తుతం ఆడియన్స్‌కి భాషతో సంబంధం లేకుండా ఒక మంచి సినిమా ఏ భాషలో ఉన్న కూడా చూడటం అలవాటు అయిపోయింది. రీసెంట్ టైమ్స్‌లో క్రిస్టి, ఇరట్ట, రోమాంచం వంటి మలయాళ సినిమాలు రిలీజై, మన తెలుగు ప్రేక్షకులను సైతం విపరీతంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈనెల 5న విడుదలైన మలయాళం సినిమా '2018'. ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్‌టాక్‌తో ముందుకు సాగుతూ అత్యద్భుతమైన కలెక్షన్స్‌ను రాబడుతోంది. ఈ సినిమా మొదటి రోజు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన కలెక్షన్స్ కేవలం రూ.1.85 కోట్లు మాత్రమే. కానీ అనూహ్యంగా ఈ సినిమా మౌత్ టాక్ తోనే పదిరోజుల్లో వంద కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది. 2018 ఆగస్టు నెలలో ఋతుపవనాల కారణంగా కురిసిన భారీ వర్షాలతో కేరళలో అధిక వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ వరదల్లో సుమారుగా 164 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కేరళ చరిత్రలో సుమారు ఓ శతాబ్దంలో ఇవే అతి పెద్ద వరదలు అని



చెప్పొచ్చు. దీనిని బేస్ చేసుకుని జూడ్ ఆంథనీ జోసెఫ్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. కేరళలోని ఒక మారుమూల పల్లెటూరు నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. దొంగ మెడికల్ సర్టిఫికెట్‌తో ఆర్మీలో చేరి, అక్కడ ఉండడం ఇష్టం లేక పారిపోయి వచ్చే యువకుడిగా టోవినో థామస్ 'అనూప్' పాత్రలో కనిపిస్తాడు. కున్చాకో బోబన్, వినీత్ శ్రీనివాసన్, అసిఫ్ అలీ, లాల్, అపర్ణ బాలమురళి.. లాంటి ప్రముఖ నటీనటులు ఈ సినిమాలో మనకు కనిపిస్తారు. ఇది పాన్ ఇండియా సినిమా కాకపోయినా సంచలనాలకు ఏ మాత్రం తగ్గడం లేదు. మలయాళంలో సంచలనం సృష్టిస్తున్న ఈ సినిమా తెలుగు రిలీజ్ హక్కులను నిర్మాత బన్నీవాసు దక్కించున్నారు. త్వరలోనే ఆయన ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వినోదభరిత ప్రేమకథా చిత్రం

అభిషేక్ పచ్చిపాల, నాజియాఖాన్, వినీషా, ఇషిత నటీనటులుగా రూపొందుతున్న చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. రెడ్ స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంతో కలిసి డా.ధర్మపురి ప్రకాష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్ణస్ యశ్వంత్ దర్శకుడు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెన్సార్ పనుల్లో ఉంది. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చూసిన ప్రతి ఒక్కరు చక్కని ప్రశంసలు అందించారు. త్వరలో చిత్రాన్ని థియేటర్‌లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'చక్కని ప్రేమకథతో సాగే వినోదాత్మక చిత్రమిది. 'ఏడు చేపల కథ' సినిమాతో ప్రేక్షకాదరణ పొందిన అభిషేక్ పచ్చిపాల ఇందులో హీరోగా మంచి నటన కనబర్చారు. ఆయన సినిమా సినిమాకు డిఫరెంట్ జోనర్ కథలు ఎంచుకుంటున్నారు. 'ఏడు చేపల కథ'తో ఎంటర్‌టైన్‌మెంట్, 'వైఫై' చిత్రంతో ఫ్యామిలీ డ్రామాతో అలరించారు. ఇప్పుడీ చిత్రంతో కామెడీ, లవ్ ఎంటర్‌టైనర్‌తో అలరించనున్నారు. జబర్దస్త్ ఫణి కామెడీ హైలైట్‌గా ఉంటుంది. టీజర్‌కు చక్కని స్పందన వస్తోంది. 'బుల్లెట్ బండి'తో పాపులర్ అయిన ఎస్.కె.బాజీ ఈ చిత్రానికి చక్కని బాణీలు అందించారు. పదహారేళ్ళ రేయాన్ మహ్మద్ ఈ చిత్ర టైటిల్ ట్రాక్ చేయడం విశేషం. ఇందులో ఉన్న నాలుగు పాటలు ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం సెన్సార్ పనుల్లో ఉంది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈచిత్రానికి స్టోరీ స్క్రీన్ ప్లే:అర్షద్ తస్వీర్, డైలాగ్స్: అభిషేక్ పచ్చిపాలా, ఫణి జబర్దస్త్, అర్షద్ తస్వీర్, లిరిక్స్: రాంబాబు గోసలా, మ్యూజిక్: బాజీ, ఆర్ట్ : రాజశేఖర్ ఇప్పకాయల, కొరియోగ్రాఫర్ : కళ్యాణ్ రామ్, సినిమాటోగ్రాఫర్ : అమీర్, ఎడిటింగ్: దుర్గా నరసింహ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూరిశ్రీ ఇనగంటి.



నాజియాఖాన్, అభిషేక్ పచ్చిపాల

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

టీసీఎస్‌కు బీఎస్ఎన్ఎల్ 4జీ ఆర్డర్

రూ.1500 కోట్ల పరికరాల సరఫరా



న్యూఢిల్లీ : టీసీఎస్ నేతృత్వంలోని కన్సోరియం రూ.1500 కోట్ల విలువ చేసే బీఎస్ఎన్ఎల్ 4జీ నెటవర్క్ ఆర్డర్‌ను సొంతం చేసుకుంది. టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన తేజస్ నెట్‌వర్క్స్ కన్సార్టియం బీఎస్ఎన్ఎల్‌కు రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ పరికరాలను సరఫరా చేయనుంది. అదే విధంగా సేవలను అందించనుంది. బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.15,000 కోట్ల విలువైన ముందస్తు కొనుగోలు ఆర్డర్‌ను పొందినట్టు టీసీఎస్ సోమవారం తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. బీఎస్ఎన్ఎల్ పాన్ ఇండియా 4జీ ప్రాజెక్ట్ కోసం వేసిన వేలంలో తేజస్ నెట్‌వర్క్స్ విజయవంతంగా బిడ్‌ను దక్కించుకుందని వెల్లడించింది. కోర్ డొమైన్ మొబైల్ నెట్‌వర్క్‌లో వివిధ ముఖ్యమైన విధులను నిర్వహించనున్నామని పేర్కొంది. వీటిలో కనెక్టివిటీ, మొబిలిటీ మేనేజ్‌మెంట్, అథెంటికేషన్, ఆథరైజేషన్, సబ్‌స్క్రయిబర్ డేటా, పాలసీ మేనేజ్‌మెంట్ మొదలైనవి ఉన్నాయని ఆ సంస్థ వెల్లడించింది.

రెడ్మీలో రెండు చౌక ధర ఫోన్లు

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ దిగ్గజం షావోమి భారత మార్కెట్లోకి చౌక ధరలో రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. రెడ్మీ ఏ2, రెడ్మీ ఏ2ప్లస్ పేరుతో వీటిని ఆవిష్కరించింది. వీటి ప్రారంభ ధరలను వరుసగా రూ.5,999, రూ.8,499గా నిర్ణయించింది. ఈ మొబైల్స్‌కు రెండేళ్ల వారంటీ ఇస్తున్నట్టు ఆ కంపెనీ తెలిపింది. మే 23 నుంచి వీటిని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచుతున్నట్టు వెల్లడించింది.

60కి పైగా నగరాలకు అమెజాన్ ఫ్రెష్



న్యూఢిల్లీ : భారత్‌లో 60కి పైగా నగరాలకు అమెజాన్ ఫ్రెష్ సేవలను విస్తరించినట్టు అమెజాన్ ఇండియా ప్రకటించింది. పండ్లు, కూరగాయలు, శీతల ఉత్పత్తులు, సౌందర్య, శిశు, వ్యక్తిగత సంరక్షణ, ఇతర రోజువారి కిరాణా సామాగ్రి తదితర విస్తృత శ్రేణీ గ్రోసరీ ఉత్పత్తులను ఇంటి వద్ద నుంచి ఆర్డర్ చేయడానికి వీలు కల్పిస్తున్నట్టు పేర్కొంది. వినియోగదారులు తమకు కావాల్సిన సమయంలో డెలివరీ పొందవచ్చని అమెజాన్ ఫ్రెష్ హెడ్ శ్రీకాంత్ శ్రీరామ్ పేర్కొన్నారు. రూ.249 పైన విలువ కలిగిన ఆర్డర్‌పై ఉచిత డెలివరీ పొందవచ్చన్నారు.

హైదరాబాద్‌కు విస్తరించిన ఫిగరోస్ పిజ్జా



హైదరాబాద్ : అమెరికాకు చెందిన ఫిగరోస్ పిజ్జా హైదరాబాద్‌లో తన నూతన అవుట్‌లెట్‌ను తెరిచింది. భారత్‌లో తన ఉనికిని విస్తరించడానికి మహారాష్ట్ర, గోవా, గుజరాత్ మినహా రాష్ట్రాల్లో దేశవ్యాప్త మాస్టర్ ఫ్రాంచైజీగా ఇచక్నానా వుడ్ సేవలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. నూతన రెస్టారెంట్‌ను కొండాపూర్‌లోని గూగుల్ ఆఫీస్ ఎదురుగా ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 'అసాధారణమైన నాణ్యత, అసాధారణమైన రుచి, అసాధారణమైన సేవలను మిళితం చేసే ఎప్పటికీ గుర్తుండిపోయేలా భోజన అనుభవాన్ని సృష్టించడం మా లక్ష్యం. పిజ్జా పట్ల మాకున్న ప్రేమను హైదరాబాద్ ప్రజలతో పంచుకోవడానికి సంతోషంగా ఉన్నాం. మా వద్ద 45 రకాల పిజ్జాలు లభిస్తాయి" అని ఫిగరోస్ పిజ్జా ఏరియా డెవలపర్ శర్వన్ కుమార్ గ్రాండి పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఎఫ్‌టీఐఐ విద్యార్థుల నిరాహారదీక్ష

- ఆరో రోజుకు చేరిన నిరసన

న్యూఢిల్లీ : ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) విద్యార్థులు చేస్తున్న నిరాహార దీక్ష ఇంకా కొనసాగుతున్నది. నలుగురు విద్యార్థులు చేస్తున్న ఈ దీక్ష ఆరో రోజుకు చేరుకున్నది. 2020 బ్యాచ్ నుంచి విద్యార్థిని బహిష్కరించి, తదుపరి బ్యాచ్‌లో అడ్మిషన్‌ను నిరాకరిస్తూ అకడమిక్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) నలుగురు విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.

బహిష్కరణకు సంబంధించిన ఫిర్యాదులు, బాధిత విద్యార్థి మానసిక ఆరోగ్య సమస్యలపై తగిన శ్రద్ధ చూపకపోవడాన్ని పేర్కొంటూ ఎఫ్‌టీఐఐ స్టూడెంట్స్ అసోసియేషన్ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నది. ఎఫ్‌టీఐఐ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రకారం.. 2020 బ్యాచ్ నుంచి ఐదుగురు విద్యార్థులను ముందస్తు నోటీసు లేకుండా బహిష్కరించారు. అయితే మే 1న జరిగిన అత్యవసర అకడమిక్ కౌన్సిల్ సమావేశాన్ని అనుసరించి, నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్దేశిత రెమెడియల్ అసైన్‌మెంట్‌లు, వ్యాయామాలను పూర్తి చేయాలనే షరతుపై నలుగురు విద్యార్థులు తరగతులకు హాజరు కావడానికి అనుమతించబడ్డారు. అయితే, ఒక విద్యార్థి రెండో సెమిస్టర్‌ని సూపర్‌న్యూమరీ విద్యార్థిగా పునరావతం చేయడానికి అవసరమైన ప్రమాణాలను చేరుకోలేకపోయాడు. ఫలితంగా అతను తదుపరి బ్యాచ్‌లో అడ్మిషన్‌కు నిరాకరించబడ్డాడు.

తరగతి నుంచి విద్యార్థిని మినహాయించడంతో డాక్యుమెంటరీలు చిత్రీకరించడం, డైలాగ్, ఫైనల్ ఫిల్మ్ ప్రాజెక్ట్‌లు వంటి చలనచిత్ర విద్యలో అంతర్భాగమైన ఆచరణాత్మక సమన్వయ కార్యకలాపాలు అతనికి దూరమవుతాయని అసోసియేషన్ వాదించింది. విద్యార్థి యొక్క దీర్ఘకాలిక మానసిక ఆరోగ్య సమస్యలను పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ యంత్రాంగం నిర్లక్ష్యం చేసిందని వారు చెప్పారు. కాగా.. నిరాహారదీక్ష కొనసాగుతుండగా ఒక విద్యార్థి పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి పాలయ్యాడు. అయితే, ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నదని అసోసియేషన్ తెలిపింది.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హజ్ యాత్రకు వెళ్తున్న వారికి మంత్రి హరీశ్ రావు వ్యాక్సిన్లు అందజేశారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లి హజ్ వ్యాక్సినేషన్ క్యాంపు కార్యాలయంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యాత్రికులు రాష్ట్ర ప్రభుత్వం కోసం ప్రార్థించాలని కోరారు. మైనార్టీల సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందనీ, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మెన్ మహమ్మద్ సలీం, మైనార్టీస్ కమిషన్ చైర్మెన్ తారిక్ అన్సారి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్,హెల్త్ కమిషనర్ శ్వేతా మహంతి పాల్గొన్నారు.

యూపీలో నర్సింగ్ సంక్షోభం

రాష్ట్రంలో కేవలం 1.38 లక్షల మంది నర్సులు

- కొరతతో రాష్ట్ర ఆస్పత్రుల్లో ఇక్కట్లు
- శ్రద్ధ పెట్టని యోగి సర్కారు

లక్నో : బీజేపీ పాలిత రాష్ట్రం యూపీ నర్సుల కొరతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. రాష్ట్ర జనాభాకు తగిన సంఖ్యలో నర్సులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో యోగి సర్కారు పాలనలో ఆరోగ్య వ్యవస్థ కొత్త సవాలును ఎదుర్కొంటున్నదని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 23 కోట్ల కంటే ఎక్కువ జనాభా కలిగిన ఈ రాష్ట్రంలో కేవలం 1.38 లక్షల మంది నర్సులు, మంత్రసానులు ఉండటం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ప్రమాణం ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ముగ్గురు నర్సులు ఉండాలి. అయితే యూపీలో మాత్రం ఇది 0.6 మాత్రమే కావడం ఆందోళనకరం.

రాష్ట్రంలో 27 కొత్త నర్సింగ్ కళాశాలలను నిర్మించడానికి కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్రానికి రూ.270 కోట్లు కేటాయించింది. అయినప్పటికీ ఇందులో రెండు ప్రధాన సవాళ్లు ఉన్నాయి. ఒకటి.. శిక్షణ కోసం అధ్యాపకుల కొరత. రెండోది.. అలాంటి సంస్థల నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థుల నాణ్యత. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో 23 నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి, వాటిలో 17.. 2021లో మాత్రమే విద్యార్థులను చేర్చుకోవడం ప్రారంభించాయి. బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ అనేది నాలుగు సంవత్సరాల కోర్సు. రాష్ట్రంలోని ఆరు నర్సింగ్ కళాశాలలు (లక్నోలో రెండు, ఝూన్సీ, కాన్పూర్, మీరట్, ఇటావాలో ఒక్కొక్కటి) సంవత్సరానికి 420 గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తుంది. ఇది 2025 నుంచి 620కి పెరుగుతుందని అంచనా. కానీ గ్రాడ్యుయేట్ అయిన వారందరూ ఆరోగ్య రంగంలో ఉద్యోగాల వైపు చూడరనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. నాణ్యమైన నర్సింగ్ విద్యార్థులు ప్రయివేటు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందేలా రాష్ట్రం నిర్ధారించాలని వైద్య రంగ నిపుణులు తెలిపారు.

గతంలో ఆరోగ్య శాఖలో, నిటి ఆయోగ్‌లో సలహాదారు (ఆరోగ్యం)గా పనిచేసిన 1993-బ్యాచ్ ఐఏఎస్ అధికారి శ్రీ కుమార్ మాట్లాడుతూ.. "మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో కలిసి ఉన్న నర్సింగ్ కాలేజీలకు మౌలిక సదుపాయాలను సష్టించాలి. 12వ తరగతి నుంచి ఎక్కువ మంది విద్యార్థులను నర్సింగ్‌లో చేరేలా చేయాలి. నీట్ లాంటి సాధారణ ప్రవేశ పరీక్ష నిర్వహించడం ద్వారా నాణ్యమైన విద్యార్థులను చేర్చుకోవడం దీని లక్ష్యం" అని ఆయన అన్నారు. యూపీలో మాత్రం నర్సుల సంఖ్య మిగతా రాష్ట్రాలతో పోలిస్తే దారుణంగా ఉన్నది. 1,000 జనాభాకు తొమ్మిది మంది నర్సులు ఉన్న కేరళ, ఆరుగురు నర్సులను కలిగి ఉన్న తమిళనాడు వంటి రాష్ట్రాల కంటే వెనుకబడి ఉంది. ఈ రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయుల సహాయంతో శిక్షణ పొందిన నర్సింగ్ ఫ్యాకల్టీ కొరత పూడ్చబడుతుందని శ్రీ కుమార్ చెప్పారు. అయితే యోగి ప్రభుత్వం రాష్ట్రంలోని ఆరోగ్య వ్యవస్థపై చిన్న చూపు చూస్తున్నదని సాధారణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యోగి సర్కారుకు ఎన్‌కౌంటర్లు, బుల్డోజర్ల కూల్చివేతలపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుతో ఆస్పత్రుల్లో రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారనీ, ఇటు నర్సింగ్ విద్యార్థులు కూడా నష్టపోతున్నారని వైద్య నిపుణులు చెప్పారు.

వేదికపై ఖాళీ కుర్చీ

తీస్తాకు అరుదైన గౌరవం



న్యూఢిల్లీ : మతతత్వంపై గళం విప్పుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం అనునిత్యం పోరాటం సాగిస్తున్న సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు అరుదైన గౌరవం దక్కబోతోంది. ఈ వారంలో స్లొవేనియాలోని బ్లెడ్‌లో జరిగే 55వ అంతర్జాతీయ రచయితల (శాంతి కమిటీ) సమావేశంలో ఆమెను ఖాళీ కుర్చీతో గౌరవిస్తారు. 2002లో గుజరాత్‌లో జరిగిన మతపరమైన హింసాకాండలో ప్రధాని మోడీ పాత్రపై తీస్తా విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. న్యాయం కోసం పోరాటం చేస్తున్న బాధితులకు ఆమె గత రెండు దశాబ్దాలుగా అండగా ఉంటున్నారు.

మతపరమైన నేరాలలో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ కార్యకర్తల ప్రమేయాన్ని ఎండగట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తన కృషికి దేశంలో ఎదురు దెబ్బలు తగులుతుంటే అక్కడ తగిన గుర్తింపుతో గౌరవం దక్కడం చాలా సంతోషాన్ని ఇస్తోందని తీస్తా తెలిపారు. 'నా తోడ్పాటుతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్‌కు, మా బృందానికి, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సమాజాలకు ఇది గొప్ప విషయం' అని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యంత శక్తివంతమైన వారు తనను లక్ష్యంగా చేసుకొని నిందలు వేస్తున్న సమయంలో ఈ గౌరవం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సమావేశాన్ని పెన్ ఇంటర్నేషనల్ అనే సంస్థ ఏర్పాటు చేసింది. 'గత సంవత్సరం జూన్ 25న గుజరాత్ పోలీసులకు చెందిన ఉగ్రవాద నిరోధక దళం సెతల్వాద్‌ను ముంబయిలోని ఆమె నివాసంలో అరెస్ట్ చేసింది. గుజరాత్ హింసకు ప్రభుత్వాన్ని బాధ్యురాలిని చేసే ప్రయత్నంలో నేరపూరిత కుట్రకు పాల్పడిందని, నకిలీ సాక్ష్యాలను సృష్టించిందని ఆరోపించింది.

గుజరాత్ హింసలో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్రపై నిగ్గు తేల్చేందుకు కేసును పునర్విచారించాలని తీస్తా, మరికొందరు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన మరునాడే ఆమెను అరెస్ట్ చేశారు' అని పెన్ ఇంటర్నేషనల్ తెలిపింది. జైలుశిక్ష విధించబడిన, ఆచూకీ తెలియకుండా పోయిన రచయితలను గౌరవించేందుకు ఈ సంస్థ వేదికపై ఖాళీ కుర్చీలు వేస్తుంది. ప్రయాణ నిషేధం విధించబడిన వారిని కూడా గౌరవిస్తుంది. తీస్తాకు బెయిల్ మంజూరు చేసిన సమయంలో విధించిన షరతుల కారణంగా ఆమె తన పాస్‌పోర్టును పోలీసులకు అందజేశారు. కాగా ప్రముఖ రచయిత సాల్మన్ రష్డీకి తొలిసారిగా ఇలాంటి గౌరవం లభించింది. మన దేశానికి సంబంధించి వరవరరావు, ఢిల్లీ యూనివర్సిటీ విద్యావేత్త హనీ బాబు ఎంటీలకు ఈ గౌరవం దక్కింది.

ఆశాలకు అర్హత 'పరీక్ష' రద్దు చేయాలి

- వేతనం రూ.18వేలు ఇవ్వాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు, అధికారులకు వినతి

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనం రూ.18వేలకు పెంచాలని, పరీక్ష నిర్వహణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ర్యాలీలు తీసి.. మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పతి ఆవరణలో ఆశాలు నిరసన చేశారు. అనంతరం డాక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ బల్మూర్ మండల కార్యదర్శి ప్రమోదమ్మ డిమాండ్ చేశారు.

వనపర్తి జిల్లా కొత్తకొటలో సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, ఆత్మకూరులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల ముందు ధర్నా చేశారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ యాస్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో, లైన్‌వాడలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. సీఐటీయు హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పాతబస్తీలో యుపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు సౌత్ జిల్లా అధ్యక్షులు ఎం.మీనా మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు ఎగ్జామ్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు రూ.18 వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు రూ.18,000 వేతనం చెల్లించాలని ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సీహెచ్ సీ, ఈజ్‌గాం పీహెచ్‌సీలో డిప్యూటీ డిఎంహెచ్ఓ సీతారాంకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందని, పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పాల్వంచ ప్రధాన సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ఖమ్మం జిల్లా వైరాలో సీఐటీయు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశా వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం వైద్యాధికారి ఉదయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. తల్లాడలో పీహెచ్‌సీలో డాక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకోవడం ఆపాలని, కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పారితోషికం లేని అదనపు పనులు చేయించొద్దని, అర్హత పరీక్షను రద్దు చేయాలని కోరారు.

రూ.1,000 నోట్లను ప్రవేశపెట్టబోం

రూ.50వేల పైన డిపాజిట్లకు పాన్ తప్పనిసరి

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

న్యూఢిల్లీ : రూ.1,000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టబోమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. వెయ్యి నోటును మళ్లీ తెస్తున్నారనేది ఊహాగానాలేనని అన్నారు. రూ.2వేల నోట్ల ఉపసంహరణ ప్రకటన తర్వాత తొలిసారి సోమవారం శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడారు. రూ.50,000 కంటే ఎక్కువ మొత్తంలో చేసే డిపాజిట్లకు పాన్ సమర్పించాలనే నిబంధన ఎప్పటి నుంచో ఉందన్నారు. ఆ నిబంధన ప్రస్తుతం రూ.2,000 నోట్ల డిపాజిట్లకు కూడా వర్తిస్తుందని తెలిపారు. రూ.2,000 నోట్ల స్థానంలో ఇతర నగదును ఇవ్వడానికి బ్యాంక్‌ల వద్ద సరిపడ మూల్యం అందుబాటులో ఉందన్నారు. చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.2,000 నోట్ల వాటా కేవలం 10.18 శాతం మాత్రమేనని దాస్ పేర్కొన్నారు. కరెన్సీ నిర్వహణలో భాగంగానే పెద్ద నోటును రద్దు చేశామన్నారు. క్లీన్ నోట్ పాలసీని ఆర్‌బీఐ ఎప్పటి నుంచో అమలు చేస్తున్నదన్నారు. వివిధ విలువ చేసే నోట్లలో కొన్ని సిరీస్‌లను ఆర్‌బీఐ అప్పుడప్పుడూ ఉపసంహరిస్తుందన్నారు. ఆ స్థానంలో కొత్త సిరీస్‌లను కూడా విడుదల చేస్తుందన్నారు. అదే విధంగా రూ.2 వేల నోట్లను కూడా ఉపసంహరించినట్టు తెలిపారు.

గతంలో రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసినప్పుడు ఏర్పడిన నగదు కొరతను ఎదుర్కోవడానికి రూ.2000 నోట్లను ప్రవేశపెట్టామని శక్తికాంత దాస్ అన్నారు. ఇప్పుడు ఆ లక్ష్యం నెరవేరడంతో ఉపసంహరించుకుంటున్నామన్నారు. సెప్టెంబర్ 30 వరకూ రూ.2,000 నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేయవచ్చన్నారు. నోట్ల మార్పిడికి తగినంత సమయం ఇచ్చామన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

నోట్ల మార్పిడికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటుందన్నారు. నోట్ల మార్పిడి కోసం బ్యాంకుల వద్ద ప్రజలు హడావుడి పడాల్సిన అవసరం లేదని శక్తికాంత దాస్ అన్నారు. పెద్ద మొత్తంలో చేసే డిపాజిట్లను తనిఖీ చేసే అంశాన్ని ఆదాయ పన్ను శాఖ చూసుకుంటుందన్నారు. ఆ అంశంలో బ్యాంక్‌లకు కచ్చితమైన కొన్ని నిబంధనలు ఉన్నాయన్నారు. నోట్ల డిపాజిట్లు, మార్పిడిపై నియంత్రణ కొనసాగుతుందన్నారు. రూ.2వేల నోట్ల డిపాజిట్లు చేయడానికి, మార్పిడి కోసం వచ్చే ప్రజలకు నీడ, మంచినీటి వసతి కల్పించాలని బ్యాంక్‌లకు ఆర్‌బీఐ సూచించిందన్నారు.

పెరుగుతున్న హృద్రోగ మరణాలు

ప్రపంచ ఆరోగ్య సమాఖ్య నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచంలో గుండె జబ్బులతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సమాఖ్య తన తాజా నివేదికలో తెలిపింది. గుండె నాళాలకు సంబంధించిన వ్యాధుల (సీవీడీ) కారణంగా 1990లో 1.21 కోట్ల మంది చనిపోతే 2021 నాటికి ఆ సంఖ్య 2.05 కోట్లకు పెరిగిందని ఆ నివేదిక వివరించింది. ఈ తరహా మరణాలకు అధిక రక్తపోటు, వాయు కాలుష్యం, పొగాకు వినియోగం, చెడు కొలెస్ట్రాల్ పెరగడం వంటివి ప్రధాన కారణాలు. సీవీడీ వంటి సంక్రమణ యేతర వ్యాధుల (ఎన్‌సీడీ) కారణంగా చనిపోతున్న వారి సంఖ్యను 2025 నాటికి 25% తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం ప్రపంచ దేశాలకు కష్టమవుతోంది. మన దేశంలో ఎన్‌సీడీలు ప్రజారోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. దేశంలో ఎన్‌సీడీ మరణాలు కనీసం 63% పెరిగాయని ప్రభుత్వ నివేదిక తెలిపింది. 'దేశంలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. అయితే ఇంతకంటే మరింత ఆందోళన కలిగించే విషయమేమంటే ప్రజలు చిన్న వయసులోనే ఈ వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం, ఊబకాయం, పొగతాగడం, మద్యం వినియోగం వంటివన్నీ ప్రాణాలకు ముప్పు కలిగించేవేనని ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కార్డియాలజీ విభాగం మాజీ అధిపతి డాక్టర్ వీకే బాహల్ తెలిపారు. ప్రజల ఆదాయం తక్కువగా లేదా ఓ మోస్తరుగా ఉన్న దేశాలలో గుండె జబ్బులు తీవ్రమైన ముప్పుగా పరిణమించాయని నివేదిక స్పష్టం చేసింది. గుండె జబ్బులలో 80% వ్యాధులను ముందుగానే నివారించవచ్చునని, అయితే ఇందుకు ప్రభుత్వాలు తగిన విధానాలను రూపొందించి ప్రజలకు రక్షణ కల్పించాలని నివేదిక సహ రచయిత ఫాస్టో పింటో తెలిపారు. కాగా ఆరోగ్యంపై ప్రభుత్వాలు తమ వ్యయాన్ని మరింత పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. జీడీపీలో ఆరోగ్య రక్షణకు ఎక్కువ మొత్తం ఖర్చు చేసే దేశాలలో గుండె సంబంధమైన వ్యాధుల కారణంగా జరిగే మరణాలు తక్కువగా ఉంటున్నాయని వారు గుర్తు చేశారు. మన దేశం జీడీపీలో 2.9 శాతాన్ని ఆరోగ్య రంగానికి ఖర్చు చేస్తోంది. ఈ వ్యయం కనీసం ఐదు శాతమైనా ఉండాలని పౌర సమాజం కోరుతోంది. తగిన చర్యలు చేపడితే 2030 నాటికి గుండె జబ్బుల మరణాల సంఖ్యను మూడో వంతు తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

ప్రజారోగ్యానికి కేసీఆర్ ప్రథమ ప్రాధాన్యత

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- నూతనంగా ఎంపికైన 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు




నవతెలంగాణ-మియాపూర్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వైద్యశాఖలో నియామకాలు జరుగుతున్నాయని, ప్రజారోగ్యానికి సీఎం కేసీఆర్ ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మాదాపూర్ శిల్పాకళ వేదికలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మంత్రి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేశామని తెలిపారు. డాక్టర్లు, నర్సులను పెద్ద ఎత్తున నియమకాలు చేపడుతున్నామని తెలిపారు. 1061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఒకేరోజూ నియామక పత్రాలను అందచేయడం వైద్య చరిత్రలోనే ఓ రికార్డు అని తెలిపారు. 5 నెలల్లోనే ఇంత పారదర్శకంగా నియమాకాలు జరిగాయని తెలిపారు. గత నెలలో వైద్య, ఆరోగ్యశాఖలో 9,056 ఉద్యోగాలు ఇచ్చామని, అలాగే 1,331 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేశామన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో మొత్తంగా 22,263 మందికి కొత్తగా ఉద్యోగాలు ఇచ్చామని, మరో 9,282 మందికి కొత్తగా ఉద్యోగాలు రాబోతున్నాయని, స్టాఫ్‌నర్స్ నోటిఫికేషన్ కూడా ఇచ్చినట్టు వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది రోగులకు వైద్యం అందించేప్పుడు వారిలో మీ తల్లితండ్రులను చూడాలని, బాధ్యతగా డాక్టర్లు ట్రీట్మెంట్ చేయాలని సూచించారు. ప్రభుత్వంలో వర్క్‌లోడ్ ఉంటుందని, ఓపికగా ఉండాలని, ప్రజలకు మేలు చేసే విధంగా డాక్టర్లు పని చేయాలని అన్నారు. భవిష్యత్‌లో ఏ ఇతర దేశాల్లో లేని విధంగా మెడికల్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అన్ని వృత్తుల కంటే పవిత్రమైనది వైద్య వృత్తి అన్నారు. సమాజంలో డాక్టర్లది అమోఘమైన పాత్ర అన్నారు. జవాన్‌లకు ఉండే గౌరవం డాక్టర్‌కు ఉంటుందని, ఆపదలో ఉన్నవారికి మరో జన్మ ఇచ్చేది డాక్టర్లని కొనియాడారు. పైసలు సంపాదించే మార్గాలు చాలా ఉంటాయి కానీ డాక్టర్ అంటే గౌరవం గొప్పదని, కుటుంబంలో డాక్టర్ ఉంటే గ్రామానికి గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

రెండు ఇండ్లు దగ్ధం

మరోసారి కర్ఫ్యూ అమలు

ఇంఫాల్ : బీజేపీ పాలిత మణిపూర్‌లో హింసాకాండ ఆగడం లేదు. రాష్ట్రంలో మళ్లీ తాజాగా అల్లర్లు చెలరేగాయి. ఇంఫాల్ తూర్పు జిల్లాలో న్యూ చెకాన్ ప్రాంతంలో సోమవారం రెండు ఇండ్లను దుండగులు తగులపెట్టారు. సోమవారం మధ్యాహ్నం ముందుగా బలవంతంగా దుకాణాలను మూయించిన సాయుధ దుండగులు తరువాత వారి ఇండ్లను దగ్ధం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తేవడానికి బాష్పవాయువును ప్రయోగించారు. దీంతో కొంత మంది గాయపడ్డారు. మరోవైపు ఇండ్లను తగులబెట్టిన సంఘటనకు నిరసనగా స్థానికులు ఆందోళనకు దిగారు. రోడ్లపై టైర్లను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో ఇంఫాల్ తూర్పు జిల్లాలో మళ్లీ కర్ఫ్యూను అమల్లోకి తెచ్చారు. గతంలో సడలించిన నిబంధనలను మళ్లీ కఠినతరం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ 'రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి ఇదే సమయం' అని చెప్పిన కొన్ని గంటల్లోనే మళ్లీ హింసాకాండ చెలరేగడం విశేషం. బిజెపి ప్రభుత్వ అసమర్థతతోనే మళ్లీ హింస చెలరేగిందని విమర్శలు వెళ్లువెత్తుతున్నాయి. ఈ నెల 3 నుంచి కుకీలు, మైతీలకు మధ్య ఘర్షణలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. సుమారు వారం రోజులు పాటు కొనసాగిన ఘర్షణల్లో 70 మందికి పైగా మరణించగా, వందల సంఖ్యలో వ్యక్తులు గాయపడ్డారు. 35 వేలకు పైగా ఇళ్లను పూర్తిగానూ, పాక్షికంగానూ దగ్ధమయ్యాయి. దీంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కుకీలు, మైతీలకు మధ్య సమస్యను కేంద్రం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు తప్పుగా అర్థం చేసుకోవడం వల్లనే మణిపూర్ అల్లకల్లోమయిందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

మాజీ ఎమ్మెల్యేతో సహా ముగ్గురి అరెస్టు

సోమవారం అల్లర్లకు సంబంధించి ఒక మణిపూర్ మాజీ ఎమ్మెల్యేతో సహా ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ సోమవారం సాయంత్రం వెల్లడించారు. న్యూ చెకాన్ ప్రాంతంలో ఇండ్లను దగ్ధం చేయడం, షాపులను బలవంతంగా మూయించడంలో ఈ ముగ్గురి పాత్ర ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. వీరు ముగ్గురూ ఆయుధాలు ధరించి స్థానికులను భయపెట్టారని చెప్పారు. అస్సాం రైఫిల్స్ వీరిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారని, వారి వద్ద నుంచి మూడు షాట్‌గన్స్ కూడా స్వాధీనం చేసుకున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

గయానా పాఠశాలలో అగ్ని ప్రమాదం

20 మంది చిన్నారులు మృతి

జార్జ్ టౌన్ (గయానా) : గయానాలోని ఒక పాఠశాల వసతిగృహంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 20 మంది చిన్నారులు మృతి చెందారు. అనేక మంది గాయాలపాలైనట్లు అధికారులు తెలిపారు. మహదియా పట్టణంలోని ఒక సెకండరీ పాఠశాలకు చెందిన వసతి గృహంలో ఈ అగ్ని ప్రమాదం జరిగిందని గయానా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం తెల్లవారుజామను చిన్నగా ప్రారంభమైన అగ్ని ప్రమాదం తరువాత ఒక్కసారిగా భవనం మొత్తం వ్యాపించాయని తెలిపింది. అదే సమయంలో భారీ ఉరుములు, తీవ్రమైన గాలులతో వర్షం కురువడంతో సహాయక కార్యక్రమాలకు ఆటకం కలిగిందని ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది. అయినా చిన్నారులను రక్షించడానికి సహాయక బృందాలు శక్తి మేరకు అన్ని ప్రయత్నాలు చేశాయని తెలిపింది. అనేక మందికి గాయాలయ్యాయని, ఇందులో ఏడుగుర్ని చికిత్స కోసం రాజధాని జార్జ్ టౌన్ తరలించినట్లు అధికారులు చెప్పారు.

ఆస్ట్రేలియాలో మేయర్‌గా ఎన్నికైన

తొలి భారత సంతతి వ్యక్తి

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాలోని సిడ్నిలో పర్రామట్టా నగర కౌన్సిల్‌కు నూతన మేయర్‌గా తొలిసారిగా భారత సంతతికి చెందిన సమీర్ పాండే ఎన్నికయ్యారు. అంతకు ముందు 2017 నుంచి 2022 ఈ నగర డిప్యూటీ మేయర్‌గా సమీర్ పాండే బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మేయర్‌గా ఉన్న డోన డేవిస్ పార్లమెంట్‌కు ఎన్నికకావడంతో నూతన మేయర్‌గా సమీర్ పాండేను ఎన్నుకున్నారు. ఒక చిన్న ఐటి సంస్థకు యజమాని అయిన సమీర్ పాండే వ్యక్తిగత ఆసక్తితో రాజకీయాల్లో చేరారు.

నల్లధనం దాచుకునేవారికి రెడ్ కార్పెట్

రూ.2వేల నోట్ల ఉపసంహరణపై చిదంబరం

న్యూఢిల్లీ : నల్ల ధనం మార్చుకునే బడా కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. 2016 నాటి పెద్ద నోట్ల రద్దు అనంతరం మోడీ ప్రభుత్వం నల్ల ధనాన్ని వెలికి తీసేందుకు మరోసారి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటోందని ఎద్దేవా చేశారు. సాధారణ ప్రజల వద్ద రూ.2,000 నోట్లు లేవని, రోజువారీ చిల్లర నగదు మార్పిడికి అవి పనికిరావని, 2016లో వాటిని ప్రవేశపెట్టినా ప్రజలు పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. నల్ల ధనాన్ని కాపాడుకునేవారికి ఇవి సహాయపడ్డాయని, ఇప్పుడు వారు తమ నోట్లను మార్చుకునేందుకు రెడ్ కార్పెట్‌పై మోడీ ప్రభుత్వం స్వాగతం పలుకుతోందని ట్వీట్ చేశారు. 2016లో రూ.2,000 నోటును ప్రవేశపెట్టడం ఓ మూర్ఖపు చర్య అయితే ఏడేళ్ల అనంతరం ఆ మూర్ఖపు చర్యను వెనక్కి తీసుకున్నందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు.

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ ప్రారంభించిన సీఎంకు కృతజ్ఞతలు

జేపీఎస్‌లకు శుభాకాంక్షలు : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియకు ఆదేశాలు జారీ చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. జేపీఎస్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమబద్ధీకరణ విధివిధానాలపై చర్చించేందుకుగానూ సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎస్ శాంతికుమారి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో ఆయన భేటీ అయ్యారు. వారి సర్వీసును క్రమబద్ధీకరించే మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమనీ, సీఎం కేసీఆర్ మాట తప్పకుండా, మడమ తిప్పకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేయడానికి అంగీకరించడమేగాక, ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జేపీఎస్‌లు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రపంచ స్థాయి గుర్తింపు

- అవార్డు ప్రకటించిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సంస్థ కాళేశ్వరం ప్రాజెక్టును 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్'గా గుర్తించి అవార్డును ప్రదానం చేసింది. అమెరికాలోని నేవెడా రాష్ట్రం హెండర్సన్ నగరంలో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నిర్వహించిన 'వరల్డ్ ఎన్విరాన్మెంటల్ అండ్ వాటర్ రిసోర్స్' కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కేటీ రామారావు ఈ అవార్డును స్వీకరించి, ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల గురించి వివరించారు. అవార్డు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ఇంజనీరింగ్ అద్భుతమని వర్ణించారు.

కలెక్టరేట్ల ఎదుట గొల్ల కురుమల ధర్నా

- రెండో విడత గొర్రెల పంపిణీకి డిమాండ్
- నగదు రూపంలో ఇవ్వాలని నినాదాలు


ఖమ్మంలో....


జనగాంలో....

నవతెలంగాణ- విలేకరులు


రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని, లబ్ధిదారులకు నగదు రూపంలో ఇవ్వాలని గొల్ల కురుమలు డిమాండ్ చేశారు. సోమవారం జీఎంపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు.


ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్‌కి వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఐదు మండలాల గొల్ల కురుమలు ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాస్ మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు పూర్తి సబ్సిడీతో నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించి నగదు బదిలీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనగామ కలెక్టరేట్‌ను గొల్ల కురుమలు ముట్టడించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. అక్కడ ఒక్కసారిగా కలెక్టరేట్లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఇనుప ముండ్ల కంచె వేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కురవి రోడ్‌లోని ధర్నా చౌక్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు.

అనంతసాగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు మృతి
- ఒకరు రైల్వే ట్రైనీ టీసీ.. మరొకరు సాఫ్టువేర్..


హరికృష్ణ (ఫైల్)


శివరామకృష్ణ (ఫైల్)

నవతెలంగాణ-హసన్‌పర్తి

హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ క్రాస్ రోడ్డు వద్ద కరీంనగర్-హన్మకొండ ప్రధాన రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. ఎదిగిన బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల ఆర్తనాదాలు స్థానికులను కన్నీరు పెట్టించింది. ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ పరమేష్, హసన్‌పర్తి ఎస్‌ఐ దేశిని విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగులకు చెందిన ఇప్పాలపల్లి మనోహర్ కందుగులలో హోటల్ నడుపుకుంటూ తన ఇద్దరు పిల్లలను కష్టపడి పెద్ద చదువులు చదివించి ప్రయోజకులను చేశాడు. పెద్దకుమారుడు శివరామకృష్ణ (24) ఇటీవలే రైల్వేలో టికెట్ కలెక్టర్ కొలువుకు ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. రెండవ కుమారుడు హరికృష్ణ (23) హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, వీకెండ్ కావడంతో స్వగ్రామానికి వచ్చిన అన్నదమ్ములు.. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు తమ ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో అనంతసాగర్ క్రాసు రోడ్డు వద్ద తెల్లవారుఝామున 5:39 గంటలకు ఎదురుగా అతివేగంతో వచ్చిన మరో వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. దాంతో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద స్థితిని పరిశీలించారు. మృతుల తల్లిదండ్రులకు సమాచారం అందించి మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మృతుల తండ్రి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు హసన్‌పర్తి అడ్మిన్ ఎస్‌ఐ దేశిని విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

గీత దాటితే వేటే

ఓటర్లను కలువకుండా షో చేస్తే టికెట్లు ఇవ్వం

- క్రమశిక్షణ ఉల్లంఘించేవారిపై కఠినంగా ఉంటాం
- పార్టీ నేతలకు బండి సంజయ్ హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అనీ, గీత దాటితే వేటు తప్పదని ఆ పార్టీ నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ హెచ్చరించారు. ఓటర్లను కలువకుండా షో చేస్తే టికెట్లు రావని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని చంపాపేటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. అందులో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు, జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, ఏపీ జితేందర్ రెడ్డి, ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ కేవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి అధ్యక్షోపన్యాసం చేశారు. నిరుద్యోగులకు కొలువులు కావాలంటే కమలం పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావాల్సిందేనన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. తాము అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఏటా జాబ్‌క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీచేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థినీ ప్రయివేటు స్కూళ్లలోని స్టూడెంట్స్‌తో పోటీపడేలా చదివిస్తామన్నారు. బకాయిల్లేకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లిస్తూ చిన్న ప్రయివేటు కాలేజీలను ఆదుకుంటామన్నారు. కార్పొరేట్ విద్యాలయాల దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు హెల్త్ కార్డు అందిస్తామనీ, ఏ జబ్బుకైనా ఉచితంగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తామని హామీనిచ్చారు. మోడీ పాలనలో తెలంగాణకు వచ్చిన కేంద్రం నిధులను గణాంకాలతో వివరించారు. వాటిని ప్రజలకు చెప్పేందుకుగానూ ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు మహా జన సంపర్క్ అభియాన్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏం సాధించారని కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణకు కేసీఆర్ మెయిన్ విలన్ అయితే కాంగ్రెస్, ఎంఐఎం సహ విలన్లు అనీ, కమ్యూనిస్టులు ఆకు రౌడీలని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గెలవలేని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ ఎన్నికల నిధిని ఇస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ విశ్వాసఘాతకుడనే విషయం పలు సందర్భాల్లో స్పష్టమైందన్నారు. 'సారు- కారు- 60 పర్సంట్ సర్కార్' నినాదంతో కేసీఆర్‌ను ఇంటికి సాగనంపేదాకా పోరాడతామని నొక్కి చెప్పారు. 111 జీవో రద్దు, కోకాపేట భూముల కేటాయింపు వెనుక కుట్ర ఉందనీ, లీగల్ సెల్ ద్వారా న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

రాజమండ్రి తెలుగుదేశం మహానాడుకు..

పెద్ద ఎత్తున తరలి రావాలి

టీడీపీ శ్రేణులకు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు

- మహానాడు విజయవంతంపై పార్టీ శ్రేణులతో కాసాని టెలికాన్ఫరెన్స్

నవతెలంగాణ - హైదరాబాద్



రాజమండ్రిలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు వేడుకకు తెలంగాణ రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ మిత్రులైన నాయకులకు, కార్యకర్తలకు ఆహ్వానం పలుకుతున్నామని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు వేడుకలో పాల్గొని విజయవంతం చేయడంపై కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్లమెంట్, మండల స్థాయిలలో ఉన్న అన్ని కమిటీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ మహానాడుకు వచ్చే వారందరూ ముందుగా రాష్ట్ర పార్టీ ఆఫీసులో ఎవరెవరూ వస్తున్నారో సమాచారం ఇవ్వవలసిందిగా కోరుతున్నాం. అలాగే రాజమండ్రిలో తెలంగాణ రాష్ట్ర పార్టీ విభాగానికి చెందిన కౌంటర్లలో తప్పనిసరిగా ఎన్రోల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి వెళ్లిన వారికి అకామిడేషన్, భోజన వసతుల కొరకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడడానికి పార్టీ మహిళా, యూత్, విద్యార్థి విభాగాలకు చెందిన నాయకులతోపాటు రాష్ట్ర పార్టీ కార్యాలయ సిబ్బంది సమన్వయం చేస్తారని జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఎండ ఎండే.. వానవానే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం కాగానే ఒక్కసారిగా వాతావరణం మారిపోయి తేలికపాటి వర్షం పడుతున్నది. ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉదయం పూట మాత్రం ఎండ వేడిమికి, ఉక్కపోతకు తాళలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో అత్యధికంగా 43.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

అదే సమయంలో వికారాబాద్ జిల్లా బొమరాస్‌పేటలో అత్యధికంగా 3.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాబోయే మూడు రోజుల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లో 38 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులు వీయొచ్చనీ, అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే సూచనలున్నాయని తెలిపారు. రాబోయే 48 గంటల పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశముందని పేర్కొన్నారు.

సీఎంకు ఎంపీ రంజిత్‌రెడ్డి ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికోసం ముఖ్యమంత్రి కేసీఆర్ జీవోనెం.111ను పూర్తిగా ఎత్తివేశారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసిన రంజిత్‌రెడ్డి జీవోను ఎత్తివేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 111 జీవోను సీఎం ఎత్తేశారని వివరించారు. తద్వారా తమకిచ్చిన మాటను నిలుపుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతోపాటు 111 జీవో పరిధిలోని 84 గ్రామాల ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధించేంత వరకూ పోరాటం ఆపొద్దు

- జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల
- సాగునీరు ఇవ్వకుండా రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పాలమూరు అధ్యాయన వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్
- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధన కోసం షాద్‌నగర్‌లో మహాధర్నా



నవతెలంగాణ-షాద్‌నగర్

సాగునీటిని ఇవ్వకుండా రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహిస్తూ ప్రజలను దోచుకునే పనిలో కేసీఆర్ ఉన్నారని జన సమితి అధ్యక్షులు ప్రొ॥ కోదండరాం, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల, పాలమూరు అధ్యాయన వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధించేంత వరకూ పోరాటం ఆగదని వారు స్పష్టంచేశారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ సాధన కోసం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ముందుగా షాద్‌నగర్ ముఖ్య కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా మహాధర్నాకు చేరుకున్నారు. కాంగ్రెస్, బీఎస్పీ, వైఎస్సార్‌టీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున నియోజకవర్గ స్థాయిలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. అధికారం ఉందని ప్రజలను చిన్నచూపు చూడొద్దని, అధికారం ఇచ్చిన ప్రజలు అధికారాన్ని దూరం చేయడానికి వెనకడుగు వేయరని తెలిపారు. తెలంగాణ రావడానికి ఎన్నో ఉద్యమాలు చేశామని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను సాధించుకోవడానికి మరో ఉద్యమం చేయాల్సి వస్తుందని స్పష్టంచేశారు. గ్రామగ్రామాన కమిటీలు వేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం షర్మిల మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో రైతన్నల గోడు తెలుసుకొని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలంగాణ వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేస్తూ ప్రజలకు సాగునీరు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఓట్ల లబ్ది కోసం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి తీరుతామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఇప్పుడు ఏమయ్యారంటూ ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఆఖరి ఆరో పాయింట్‌గా సూచిస్తూ ఆ తర్వాత దాని ఊసే ఎత్తలేదని అన్నారు. మతతత్వ బీజేపీ రాష్ట్రంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వకుండా మత కల్లోహాలు సృష్టించు కుంటూ ఆ చిచ్చులో చేతులు కాచుకుంటుందని విమర్శించారు.

పాలమూరు అధ్యాయన వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఎకరాల్లో భూమిని కొని గజాల్లో ప్లాట్లు చేసి అమ్ముతున్నారని, దీనినంతటిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తుందన్నారు. తాను మొగిలిగిద్ద గ్రామవాసినిని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో హామీలు ఈ ప్రాంత అభివృద్ధికై ఇచ్చిన సీఎం కేసీఆర్ ఆ తర్వాత కాలంలో పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ సాధనకై ఎన్నో సందర్భాల్లో ముఖ్యమంత్రితో కలవడానికి ప్రయత్నం చేయగా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.1000 కోట్లు అయితే లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధకు తాళలేక రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-రేగొండ

అప్పుల బాధ భరించలేక రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రూపిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ముద్దనపెల్లి రాజయ్య (56)కు చెందిన మిర్చి పంట, వరి ధాన్యం ఇటీవల కురిసిన భారీ వర్షానికి తడిసింది. దాంతో తెచ్చిన అప్పులు కట్టలేమనే మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి అతని కుమారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు రాజయ్యను పరకాలలోని ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

- పట్టాలిచ్చే 135వ జయంతి సందర్భంగా సీఎం నివాళి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ అనీ, దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతిని పురస్కరించుకొని సోమవారం సీఎం కేసీఆర్ నివాళులర్పించారు. మహనీయుడు భాగ్యరెడ్డి వర్మను గౌరవించుకోవడంతో పాటు వారి స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించేందుకు వారి జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ సంస్థానంలో దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి విద్యాభివృద్ధికి, ఉన్నతికి ఆయన గట్టి పునాదులు వేశారన్నారు. దళితజాతి విద్యా వికాసానికి, సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా చైతన్యం తీసుకురావటానికి భాగ్యరెడ్డి వర్మ విశేషంగా కృషి చేశారని సీఎం కేసీఆర్ కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ఎస్సీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నదని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలకు ప్రత్యేక ప్రగతి నిధి, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, దళితులకు మూడెకరాల భూమి, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టీఎస్ ప్రైడ్, నిరుపేద ఎస్సీ కుటుంబాలకు 101 యూనిట్ల వరకు ఉచిత్ విద్యుత్, ఎస్సీలకు గొప్ప భవిష్యత్ ను అందించేందుకు గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యాబోధన వంటి ఎన్నో పథకాలు, కార్యక్రమాలతో ఎస్సీల సమగ్రాభ్యున్నతికి ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నదని తెలిపారు.

సామాజిక ఉద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్

నవతెలంగాణ-కల్చరల్

నైజాం ఏలుబడిలో సామాజిక సమస్యలపై ఉద్యమించిన వైతాళికుడు భాగ్య రెడ్డి వర్మ అని సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఎస్సీ అభివృద్ధి శాఖ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ నిర్వహణలో సోమవారం భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరి మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ 18వ ఏటనే సాంఘిక దురాచారాలు, అంటరానితనంపై గళమెత్తి అంబెద్కర్ కన్నా ముందే వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ సంస్థానంలో దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎస్టీ, ఎస్సీ ఆల్ ఇండియా నాయకులు మురళీధరరావు, రాజు ఉస్తాద్‌ను భాగ్యరెడ్డి వర్మ స్మారక పురస్కారాలతో సత్కారించారు. రాష్ట్ర గిడ్డంగులు సంస్థ చైర్మెన్ సాయి చంద్, ఎస్సీ అభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సుధా రాణి, జ్ఞాన ప్రకాష్, దళిత ఉద్యమ నాయకులు జ్ఞానేశ్వర్, అజయ్ గౌతమ్, శ్రీలత గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు గవర్నర్ నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ సంఘ సంస్కర్త ఎం.వీ.భాగ్యరెడ్డి వర్మకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఘనంగా నివాళులర్పించారు. సోమవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా ఆమె నివాళులర్పించారు.

శరత్ బాబు మరణం పట్ల దిగ్భ్రాంతి

ప్రముఖ తెలుగు సినీ నటుడు శరత్ బాబు మరణం పట్ల గవర్నర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలుగు చలనచిత్రసీమకు గుర్తిండిపోయే నటుడు. ఆయన లేని మరణం పెద్ద లోటు అని తెలిపారు. శరత్ బాబు యాక్టింగ్ స్టైల్‌తో ప్రత్యేకత చాటుకున్నారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జైన్‌భవన్‌కు రెండెకరాలు కేటాయింపు మహావీర్ ఆస్పత్రి లీజు ఉచితం

సీఎం కేసీఆర్‌ను కలిసిన జైన్ మతపెద్దలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివద్ధికి కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. దేశంలోని పలు ప్రాంతాలు, విభిన్న మతాలు, సంస్కృతుల ప్రజలు రాష్ట్రంలో సుఖశాంతులతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారంజైన మత పెద్దలు ఆయనతో సమావేశమయ్యారు. తమ మైనార్టీ హక్కులను గుర్తిస్తూ, కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించినందుకు వారు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జైన మత పెద్దల కోరిక మేరకు జైన్ భవన్ నిర్మాణానికి ఉప్పల్ భగాయత్‌లో రెండెకరాల భూమిని కేటాయిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. అలాగే మాసబ్‌ట్యాంక్‌లోని మహావీర్ ఆస్పత్రి లీజు స్థలాన్ని ఉచితంగా ఇస్తామని తెలిపారు. దీనికి జైన మతపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం కేసీఆర్ వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీ జైన్ సేవా సంఘ్ చైర్మెన్ అశోక్ బర్మేచా, ప్రెసిడెంట్ యోగేష్ జైన్, వైస్ ప్రెసిడెంట్ వినోద్ సంచతి, సెక్రటరీ జీమురా, జైన్ రత్న అవార్డు గ్రహీత, ఫౌండర్ సెక్రటరీ సురేందర్ లోనియా, మహావీర్ హాస్పటల్ మాజీ చైర్మెన్ మోతీలాల్ జైన్, మాజీ అధ్యక్షులు గౌతం లోడ, మాజీ కార్యదర్శి బసంత్, మాజీ అధ్యక్షులు గౌతంచంద్ జైన్, జువెల్లరీ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ షెర్మల్ జైన్, జయప్రకాష్ బాంగడ్, హిమాన్షు, తలసాని సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

- రైతులను మోసం చేసిన బాండ్ పేపర్ ఎంపీ
- ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా



నవతెలంగాణ-మల్లాపూర్

మూసేసిన చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట పెద్దమ్మ ఆలయం నుంచి చక్కెర కర్మాగారం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించి సీఎం కేసీఆర్, నిజామాబాద్ ఎంపీ అరవింద్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. అనంతరం జువ్వాడి మాట్లాడుతూ.. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ కర్మాగారం మూసివేసి నేటికి ఎనిమిదేండ్లు అవుతుందని చెప్పారు. బంగారు తెలంగాణ అంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన చక్కెర ఫ్యాక్టరీ మూసేయడమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి రైతులను అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతోందన్నారు. నడుస్తున్న ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని కచ్చితంగా తెరిపిస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని, ఆ తర్వాత హామీని నెరవేర్చలేదని విమర్శించారు. గతంలో నిజామాబాద్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన కల్వకుంట్ల కవిత కూడా షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తెరిపిస్తానని మాట ఇచ్చి నెరవేర్చకుంటే ఈ ప్రాంత రైతులు 2018 ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రాబో యే ఎన్నికల్లో కోరుట్ల ఎమ్మెల్యేను చెరుకు రైతులు రాజకీయంగా సమాధి చేయడం తథ్యమన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత నిజామాబాద్ ఎంపీ బాండ్ పేపర్ అరవింద్ ఫ్యాక్టరీ కొనుగోలు చేసి నడిపిస్తానని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. రైతులు ఎక్కడ అడ్డుకుంటారోనన్న భయంతో బాండ్ పేపర్ ఎంపీ అరవింద్ అదనపు భద్రత లేకుండా వీధుల్లోగాని సొంత పార్లమెంట్ నియోజకవర్గంలోగాని తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.



ఎం.ఎస్.రాజు, నరేష్, జయసుధ, పవిత్ర లోకేష్

లైఫ్‌లోనూ ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలి

నరేష్ వి.కె, పవిత్ర లోకేష్ జంటగా నటించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎం ఎస్ రాజు రచన, దర్శకత్వం వహించారు. విజయ కృష్ణ మూవీస్ బ్యానర్ పై నరేష్ స్వయంగా దీనిని నిర్మించారు. ఈనెల 26న సినిమా విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లోని జె.ఆర్.సి. ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. కృష్ణ, విజయనిర్మల ఫొటోలకు చేసిన జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమైన ఈ వేడుకలో 'ఆకాశమే..' అనే సాంగ్‌ను జయసుధ లాంచ్ చేశారు. అలాగే 50 ఏళ్లు నటిగా పూర్తిచేసుకున్న జయసుధను నరేష్ దంపతులు ఈ సందర్భంగా సన్మానించారు. ఇదే వేడుకలో ఈ చిత్ర బిగ్‌టికెట్‌ను జయసుధ ఆవిష్కరించగా, నటుడిగా 50ఏళ్ళు పూర్తి చేసుకున్న నరేష్‌ని ఎం.ఎస్.రాజు అధ్వర్యంలో జయసుధ సత్కరించారు.


> ఈ స్టేజీ పై నరేష్, పవిత్ర దండలు మార్చుకుని 'మళ్లీ పెళ్లి' చేసుకోవడం బాగుంది. వనితా విజయ్‌కుమార్ దేవీ సినిమాలో పాత్రకు ప్రాణం పోసింది. ఇప్పుడు ఈ సినిమాలో నటించింది. నేను 12 ఏళ్ళప్పుడు 'మీనా' సినిమా చూశాను. కానీ ఇప్పుడు వారి బ్యానర్‌లో సినిమా చేస్తానని అనుకోలేదు. ఇది బోల్డ్ కథ అని కచ్చితంగా చెప్పగలను.
> - ఎం.ఎస్.రాజు

ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, '9వ ఏట 'పండంటి కాపురం'తో అనుకోకుండా నా నటన ప్రారంభమైంది. మా అమ్మ నాతో నీకు మంచి లైఫ్ ఇవ్వలేకపోయాను అని చివరిలో అంది. ఇప్పుడు నేను ఇంకో అమ్మని కలిశాను అని చెప్పి కృష్ణ ఆశీస్సులు తీసుకున్నాను. ఇప్పుడు 50 ఏళ్లకు మా అమ్మ తర్వాత ఇంకో అమ్మను పవిత్ర రూపంలో కలుసుకున్నా. పెండ్లిలో నమ్మకం, ఆప్యాయత, తోడును కోరుకుంటాం. వృద్ధాప్యంలో బలాన్ని కోరుకుంటాం. అందుకే సినిమా మాదిరిగా జీవితంలోనూ ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలి చెబుతాను. ఎం.ఎస్.రాజు దర్శకత్వంలో ఈ సినిమా చేయటం చాలా ఆనందంగా ఉంది. ఈనెల 26న యు.ఎస్.ఎ. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో విడుదల కాబోతుంది. దీన్ని తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి తీశాం' అని తెలిపారు.

'నాది ఇప్పటినుంచి కొత్త లైఫ్. చిన్నతనంలో పేరెంట్స్‌ను కోల్పోయా. నటిగా కష్టపడుతూ సౌకర్యాలను సమకూర్చుకున్నా ఆ క్రమంలో కొన్ని దుష్టశక్తులు నన్ను పడగొట్టేందుకు ప్రయత్నించాయి. అప్పుడు నాకు ఒక శక్తిగా నరేష్ నిలబడ్డారు. ఎం.ఎస్.రాజు, నరేష్ సినిమా తీయాలని డిసైడ్ చేసుకున్నారు. నేను అందులో ఓ భాగం మాత్రమే. ప్రతి విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని నాకు వివరించారు ఎం.ఎస్.రాజు. ఈ సినిమాలో నాకు మంచి పాత్ర ఇచ్చినందుకు థ్యాంక్స్ చెబుతున్నాను' అని పవిత్ర లోకేష్ చెప్పారు.

నవచిత్రం

మరో అరుదైన గౌరవం


కమల్‌హాసన్

ఆరు దశాబ్దాలుగా విలక్షణ నటనతో అలరిస్తున్న కమల్‌హాసన్ ఖాతాలో మరో అవార్డు చేరనుంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకుగానూ జీవిత సాఫల్య పురస్కారం అందుకోనున్నారు. ఈ నెల 27న అబుదాబిలో జరగనున్న అంతర్జాతీయ భారతీయ చలనచిత్ర వేడుకల్లో ఆయన ఈ అవార్డును పొందనున్నారు. ఈ విషయాన్ని ఐఫా నిర్వాహకులు వెల్లడించారు. విశ్వనాయకుడిగా కమల్ ఇప్పటికే ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పుడీ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు రావడంతో అభిమానులు హర్షిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నారు.

కమల్‌హాసన్ ప్రస్తుతం 'ఇండియన్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో శరవేగంగా జరుగుతోంది. ఇటీవల కమల్ తన పాత్రకు సంబంధించిన పలు సన్నివేశాలకు డబ్బింగ్ పూర్తి చేశారని తెలుస్తోంది. ఈ చిత్రంలో కాజల్, రకుల్‌ప్రీత్ సింగ్ నాయికలుగా నటిస్తున్నారు.



ఆ విలువలు.. మన భారతీయ సినిమాల్లో ఉన్నాయి

2023లో భారత సినీ పరిశ్రమలో తనదైన మార్క్‌ను క్రియేట్ చేసి, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న రామ్ చరణ్ మరోసారి భారతదేశానికి గర్వకారణంగా నిలిచారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలో అద్భుతమైన నటనను కనబరిచి, అందరి ప్రశంసలను అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులందరికీ మరింత చేరువయ్యారు. శ్రీనగర్‌లో జరుగుతున్న జీ 20 సమ్మిట్ – టూరిజం వర్కింగ్ గ్రూప్ మీటింగ్‌కు భారతీయ సినీ పరిశ్రమ తరపున ఆయన ప్రతినిధిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా సినీ చిత్రీకరణకు సంబంధించిన ప్రాంతాల్లో మన దేశం సామర్థ్యం చాలా గొప్పదన్నారు. భారతదేశంలోని గొప్ప సాంస్కృతిక వైవిధ్యం, సుందరమైన ప్రదేశాలు, ఖర్చు, సినిమా ప్రభావం, అత్యాధునిక సాంకేతికతతో పాటు ఇది చలనచిత్ర నిర్మాణానికి అనువైన ప్రదేశంగా ఎలా మారిందనే విషయాలను ఆయన బలంగా వినిపించారు. ఫిల్మ్ టూరిజం గురించి ఆయన మాట్లాడుతూనే జీ20లోని సభ్య దేశాలు మన దేశంలో చురుకైన భాగస్వామ్యం వహించాలని తెలిపారు.

> ఎన్నో ఏళ్లుగా గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మికతలతో మిళితమైన మన గొప్పదనాన్ని సినీ రంగం తరపున తెలియజేసే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నాను. మంచి కంటెంట్‌ను ఎంతో విలువైన జీవిత పాఠాలుగా అందించే గొప్పదనం మన భారతీయ సినిమాల్లోనే ఉన్నాయి.
> - రామ్‌చరణ్

నాటు .. పాటకు స్టెప్పులు

కాశ్మీర్‌లో జరుగుతున్న జీ 20 సదస్సులో భారతీయ చలన చిత్ర పరిశ్రమకి ప్రాతినిధ్యం వహిస్తున్న రామ్ చరణ్ ఈ సదస్సులో దక్షిణ కొరియా రాయబారితో 'నాటు నాటు' పాటకి స్టెప్పులేసి అందరినీ అలరించారు. కాశ్మీర్‌లో టూరిజంని ప్రోత్సహించడానికి సుమారు 20 దేశాలకి చెందిన నాయకులూ ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు.

టూరిజం మినిష్టర్ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, 'రామ్ చరణ్ అద్భుతంగా తను చెప్పాలనుకున్న విషయాలను వివరించారు. ఆయన తన వినయంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. ఈ జీ20 సమ్మిట్‌కు ఇండియన్ సినీ ఇండస్ట్రీ తరపున చరణ్ ప్రతినిధిగా రావటం గర్వంగా ఉంది. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ–పర్యాటక రంగం పట్ల ఆయన అంకితభావం మన దేశ సహజ సౌందర్యాన్ని సంరక్షించడానికి, గొప్పగా ప్రదర్శించడానికి యువతను ప్రోత్సహించటమే కాకుండా వారికి శక్తివంతమైన ప్రేరణగా నిలుస్తుందన్నారు.

వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో టీఎఫ్‌సీసీ నంది అవార్డుల వేడుక

రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ సహాయ సహకారంతో తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023' వేడుకలు ఆగస్టు 12న దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న విషయం విదితమే. తాజాగా ఈ నంది అవార్డ్స్ ఇన్విటేషన్ బ్రోచర్‌ను ఫిలిం ఛాంబర్‌లో గ్రాండ్‌గా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వటైజర్, నటుడు ఆలీ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఇన్విటేషన్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైటర్ మిట్టపల్లి సురేందర్, పల్లె లక్ష్మణ్ గౌడ్, ఆర్టిస్ట్ జ్యోతిరెడ్డి, హీరోయిన్ భవ్యశ్రీ, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, బి. శ్రీనివాస్ గౌడ్, రాజ్, ప్రేమ్, శ్రీశైలం, వాహిద్, నిర్మాత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.కె.గౌడ్, అలీ, భవ్యశ్రీ

ఈ సందర్భంగా టియఫ్ సీసీ చైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'దాదాపు 6, 7 సంవత్సరాల తర్వాత రెండు ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం కొంత స్పాన్సర్ కూడా చేస్తామని తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్ నుండి కూడా సహకారం లభిస్తుందని ఆశిస్తున్నాను. ఆగస్టు12 న దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాల సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. తెలుగు కళాకారులను ప్రోత్సహించాలానే ఉద్దేశ్యంతో ఏమీ ఆశించకుండా స్వచ్ఛందంగా నేను చేస్తున్న కార్యక్రమం ఇది. అయితే నేను కొంతమంది దగ్గర డబ్బులు తీసుకుంటున్నానని నిందలు మోపుతున్నారు. నేను ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోకుండా నిజాయితీగా పనిచేస్తున్నాను. ఈ నంది అవార్డ్స్ వేడుకలను ప్రతి సంవత్సరం దుబాయ్‌లోనే కంటిన్యూ చేస్తాం' అని తెలిపారు.

'1964 నుండి నంది అవార్డ్స్ ఉన్నాయి. నంది అవార్డు అనేది ప్రతి ఆర్టిస్ట్ కల. అలాంటిది 7 సంవత్సరాలక్రితం ఆగిపోయిన నంది అవార్డ్స్‌ను మళ్ళీ స్టార్ట్ చేస్తున్న ప్రతాని రామకృష్ణ గౌడ్‌కి ధన్యవాదములు. అలాగే సీనియర్ నటుల పేరుతో కూడా స్మారక అవార్డ్స్ ఇవ్వడం అనేది హర్షించదగ్గ విషయం' అని నటుడు ఆలీ అన్నారు.

అంచనాలు పెంచిన టక్కర్ ట్రైలర్

హీరో సిద్ధార్థ్ అంటే తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక అభిమానం ఉంటుంది. 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి సినిమాలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న సిద్ధార్థ్ నుంచి కొత్త సినిమా వస్తుందంటే అందరిలోనూ ఆసక్తి నెలకొనడం సహజం. లేటెస్ట్‌గా ఆయన 'టక్కర్' అనే సినిమాతో సరికొత్తగా అలరించడానికి సిద్ధమవుతున్నారు.

ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో భారీ స్థాయిలో విడుదల కానుంది.


సిద్ధార్థ్

హీరో సాయి ధరమ్ తేజ్ సోషల్ మీడియా వేదికగా 'టక్కర్' ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా నిర్మాతలు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'టక్కర్' సినిమా ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. అలాగే ఈ ట్రైలర్ ఉత్కంఠభరితంగా, వినోదాత్మకంగా ఉండటం విశేషం' అని అన్నారు.విడుదలైన 'టక్కర్' ట్రైలర్ అందర్నీ ఆకట్టుకుంటోంది.

'ఆశే ఈ లోకాన్ని నడిపిస్తుంది. అదే ఆశ మన లైఫ్‌ని నిర్ణయిస్తుంది. ఆ ఆశని నెరవేర్చుకోడానికి ధనమే ఇంధనం. దానిని సంపాదించుకోడానికి ఒక్కొక్కరిది ఒక్కో దారి. ఆ దారి అందరికీ ఒకటైనప్పుడు' అంటూ సిద్ధార్థ్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్న సాధారణ యువకుడిగా కథానాయకుడు కనిపిస్తుండగా, బాగా డబ్బున్న యువతిగా కథానాయిక కనిపిస్తోంది. వారి మధ్య వచ్చే రొమాంటిక్ సన్నివేశాలు మెప్పిస్తున్నాయి. తనని ఎంతగానో నమ్మిన కథానాయికని డబ్బు కోసం కిడ్నాప్ చేయాల్సిన పరిస్థితి కథానాయకుడికి ఎందుకు వచ్చింది? ప్రశ్నతో ఉత్కంఠను రేకెత్తిస్తూ ట్రైలర్ ఆద్యంత ఆసక్తికరంగా సాగింది.

ఇక ట్రైలర్‌లో యోగిబాబు హాస్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు చూస్తుంటే.. ఖర్చు విషయంలో వెనకాడకుండా భారీ స్థాయిలో నిర్మించారని అర్థమవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో 'టక్కర్'పై రోజురోజుకి అంచనాలు పెరిగిపోతున్నాయి. సాధారణంగా సిద్ధార్థ్ సినిమాలలో ప్రేమ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే ఈ సినిమాలో ప్రేమ సన్నివేశాలతో పాటు ఉత్కంఠను రేపేలా అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు కూడా ఉండనున్నాయి. ఇప్పటికే విడుదలైన 'టక్కర్' టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమా నుంచి విడుదలైన 'కయ్యాలే', 'పెదవులు వీడి మౌనం' పాటలు కూడా విశేష ఆదరణ

విమానం.. భావోద్వేగాల సమాహారం

"సుమతీ.. సుమతి నీ నడుములోని మడత చూస్తే ప్రాణమొణిక వనితా, నువ్వు పూసే రంగులన్నీ చూస్తే నేను పొంగిపొర్లుతా..' అని తన ఆరాధ్య దేవత సుమతి (అనసూయ)ని చూసి ప్రేమికుడు కోటి (రాహుల్ రామకృష్ణ) పాట పాడుకుంటున్నాడు. పాట వింటుంటే ఆమెకు తన ప్రేమను చెప్పకుండానే గాఢమైన ప్రేమను మనసులో పెంచుకున్నాడని అర్థమవుతుంది. అసలు ఇంతకీ ఈ సుమతి, ఆమె అజ్ఞాత ప్రేమికుడు కోటి ఎవరు?, కోటి ప్రేమ సక్సెస్ అయ్యిందా?అనే విషయాలు తెలియాలంటే 'విమానం' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.


రాహుల్ రామకృష్ణ, అనసూయ భరద్వాజ్

యాంకర్‌గా బుల్లి తెర ప్రేక్షకులను మెప్పించిన అనసూయ భరద్వాజ్ సిల్వర్ స్క్రీన్‌పై కూడా విలక్షణమైన పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అందులో భాగంగా 'విమానం' చిత్రంలో సుమతి అనే బోల్డ్ పాత్రలో నటించారు. ఇప్పటి వరకు అనసూయ చేసిన సినిమాల్లో చేయనటువంటి పాత్ర. అలాంటి ఆమెను ఓ యువకుడు ప్రేమించి తన ప్రేమను చెప్పలేక అవస్థలు పడుతుంటే ఎలా ఉంటుందనే విషయాన్ని 'సుమతి' అనే పాట ద్వారా తెలియజేశారు మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్. ఆయన సంగీతం అందిచటమే కాకుండా ఈ పాటకు లిరిక్స్ రాసి, ఆయనే పాడటం విశేషం. ఇప్పటికే విడుదలైన 'విమానం' టీజర్, 'రేలా రేలా' అనే లిరికల్ సాంగ్‌తో పాటు సుమతి పాత్ర ఫస్ట్ లుక్, వీడియో గ్లింప్స్‌తో సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా విడుదలైన 'సుమతి' లిరికల్ సాంగ్ యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ఉంది. పాట వింటే తప్పకుండా అందరూ హమ్ చేసుకుంటారనటంలో సందేహం లేదనిపిస్తోంది. 'విమానం' సినిమా ఓ ఎమోషనల్ జర్నీ. వైవిధ్యమైన పాత్రలు చేసే ప్రయాణం అసలు ఎలాంటి మజిలీలు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎదురయ్యే భావోద్వేగాలు ఏంటి? అనే విషయాలను విమానం సినిమాలో చూడాల్సిందే. వీరయ్య అనే అంగ వైకల్యం ఉన్న తండ్రి పాత్రలో సముద్ర ఖని, కొడుకు పాత్రలో మాస్టర్ ధ్రువన్ నటిస్తుండగా, సుమతి పాత్రలో అనసూయ భరద్వాజ్, రాజేంద్రన్ పాత్రలో రాజేంద్రన్, డేనియల్ పాత్రలో ధన్‌రాజ్, కోటి పాత్రలో రాహుల్ రామకృష్ణ ఇతర కీలక పాత్రల్లో మెప్పించబోతున్నారు. ఈ సినిమా జూన్ 9న వరల్డ్ వైడ్‌గా తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఆసక్తికరంగా రాముడా..కృష్ణుడా?


వర్ష విశ్వనాథ్

బేబి డమరి సమర్పణలో శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ పతాకంపై సుమన్ బాబు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాముడా కృష్ణుడా'. భర్తని భార్య అర్థం చేసుకుంటే సంసారం స్వర్గం అవుతుంది. చెప్పుడు మాటలు – నమ్మిన భర్తని అనుమానిస్తే రాముడు కూడా కృష్ణుడిలా రాసలీలల్లో తేలుతాడు అనేది ప్రధాన ఇతివృత్తంగా ఈ సౌత్ ఇండియన్ సినిమా తెరెక్కుతోంది. వృత్తిని, ఇంటిని ఎలా బ్యాలెన్స్ చేయాలి అని సతమతం అయ్యే హీరో పాత్ర ఆసక్తికరంగా ఉంటుంది. తానే హీరోగా నటిస్తూ సుమన్ బాబు దర్శకత్వం కూడా వహిస్తున్న ఈ సినిమాని ఆసక్తికరంగా అందరిని ఆకట్టుకునే విధంగా, ప్రతి కుటుంబాన్ని కదిలించే హస్యభరిత చిత్రంగా, యాక్షన్ ఫ్యామిలీ చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖ, నెల్లూరులో షుటింగ్ జరుగుతుందని డైరెక్టర్, హీరో సుమన్ బాబు తెలిపారు. వర్ష విశ్వనాథ్, మిస్ నెల్లూరు వర్షిత చౌదరి, రఘుబాబు, షవర అలీ, హైపర్ ఆది, నవీనా రెడ్డి. అలోక్ జైన్, గౌతమి ప్రధాన తారాగణంగా ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రానికి రచన: మురళిరమేష్, డీఓపీ : చందు, మ్యూజిక్: రాప్ రాక్ షకీల్, ఎడిటర్: వెంకట్ ప్రభు, స్టంట్స్ : నందు – దేవరాజ్, ఆర్ట్ : నాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఏవీఎమ్ మురళి, లైన్ ప్రొడ్యూసర్: అబ్దుల్ రెహమాన్.

డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్

హీరో బెల్లంకొండ గణేష్ తన కెరీర్ ఆరంభం మంచి కథలు ఎంపికలు చేసుకుంటున్నారు. ఆయన రెండో సినిమా 'నేను స్టూడెంట్ సార్!'. ఈ చిత్రానికి రాఖీ ఉప్పలటి దర్శకత్వం వహించారు. నవల కాన్సెప్ట్‌తో కూడిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను ఎస్‌వి2 ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'నాంది' సతీష్ వర్మ నిర్మించారు. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. కథానాయకుడు ఐఫోన్‌ను ప్రదర్శించడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అతను దానిని తన సొంత సోదరుడిలా చూస్తాడు. అయితే, ఒక హత్య కేసులో పోలీసులకు అతనిపై బలమైన సాక్ష్యం లభించడంతో అదే ఫోన్ అతని జీవితాన్ని తలకిందులు చేస్తుంది. అతని ఖాతాలో 1.75 కోట్ల భారీ మొత్తం జమ కావడంతో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. దర్శకుడు రాఖీ ఉప్పలపాటి ఒక ఆసక్తికరమైన కథతో ముందుకు వచ్చారు. కథనంలో మలుపులతో దానిని ఆకర్షించాడు. గణేష్ తన పాత్రను అవలీలగా పోషించాడు. సముద్రఖని ప్రతినాయకుడిగా సీరియస్ నటనతో తన ఉనికిని చాటుకున్నాడు. గణేష్ ప్రేయసిగా అవంతిక దాసాని బాగుంది. మహతి స్వర సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత ఆసక్తికరంగా సమకూర్చాడు. ఇందులో అనిత్ మదాడి కెమెరా పనితనం చెప్పుకోదగినది. కృష్ణ చైతన్య కథ అందించారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ అందించారు. ట్రైలర్ యువతను ఆకట్టుకోవడంతో పాటు థ్రిల్లర్‌లను ఇష్టపడే వారిని కూడా ఆకట్టుకుంటుంది. జూన్ 2న సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.


బెల్లంకొండ గణేష్

యూనిక్ పాయింట్‌తో ఐక్యూ

ఇదొక బ్రెయిన్‌కు సంబంధించిన సినిమా. మేధావి అయిన ఓ అమ్మాయి మెదడును అమ్మడానికి వాళ్ళ ప్రొఫెసర్ ఎలా ప్లాన్ చేశాడు?, దాని ద్వారా జరిగిన పరిణామాలు ఏంటి అనే కథాంశంతో తెరకెక్కిన సినిమా 'ఐక్యూ' (పవర్ అఫ్ స్టూడెంట్). కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కె.యల్.పి మూవీస్ పతాకంపై సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ నటీనటులుగా జి.యల్.బి. శ్రీనివాస్ దర్శకత్వంలో కాయ గూరల లక్ష్మీపతి నిర్మించారు.

ఈ చిత్రం.అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 2న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, దుబాయ్, యు.కె, యు.యస్.ఎ, నేపాల్‌లో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది.


పల్లవి, సాయిచరణ్

ఈ సందర్భంగా నిర్మాత కాయగూరల లక్ష్మీపతి మాట్లాడుతూ,'యూత్ బ్యాక్ డ్రాప్‌లో ఇప్పటి వరకు రానటువంటి డిఫరెంట్ యూనిక్ పాయింట్‌తో తెరకెక్కిన ఈ సినిమా చాలా బాగా వచ్చింది. సినిమాలో మా అబ్బాయి హీరోగా నటిస్తున్నాడు. సీనియర్ నటులు సుమన్, బెనర్జీ, సత్య ప్రకాష్, సూర్య, పల్లె రఘునాథ్ రెడ్డి, జబర్దస్త్ శేషు, గీతా సింగ్, వంటి నటీనటులతో కలిసి హీరోగా నటించిన మా అబ్బాయికి ఈ సినిమా ద్వారా మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాను. నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ ఫుల్‌సపోర్ట్ చేయడంతో సినిమాను త్వరగా పూర్తి చేయగలిగాం. అన్ని కార్యక్రమాలు పూర్తయిన మా చిత్రాన్ని జూన్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని తెలిపారు.

'మంచి ఐక్యూ ఉన్న అమ్మాయిని హీరో ఎలా సేవ్ చేశాడు అనే ఈ కథ చాలా ఇంట్రెస్ట్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో హీరో, హీరోయిన్స్‌తో పాటు ఇందులో నటించిన వారంతా చాలా బాగా నటించారు. మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రానికి టెక్నీషియన్స్ అందరూ చక్కగా కుదిరారు. ఓ మంచి యూనిక్ పాయింట్‌తో రూపొందిన ఈ చిత్రం అందర్నీ కచ్చితంగా అలరిస్తుందని ఆశిస్తున్నాను' అని దర్శకుడు శ్రీనివాస్ జి.యల్.బి అన్నారు. సంగీత దర్శకుడు పోలూరి ఘటికాచలం మాట్లాడుతూ,'రెగ్యులర్ స్టోరీలకు భిన్నంగా వస్తున్న ఇలాంటి మంచి సినిమాకు కథ, మాటలు, సంగీతం అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది చిన్న సినిమా అయినా మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా బాగా రావాలని చిత్ర నిర్మాతలు బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా కంప్లీట్ చేశారు. ఈ సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు.

ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ..

సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్‌పై పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకత్వంలో సుమయా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్ర ప్రారంబోత్సవ వేడుకలు అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా జరిగాయి. రచయిత, నిర్మాత కోన వెంకట్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. విజయ్ కనకమేడల గౌరవ దర్శకత్వం వహించారు.


పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి

ఈ సందర్భంగా దర్శకుడు సాయి రాజేష్ మహాదేవ్ మాట్లాడుతూ 'మా హీరోయిన్, నిర్మాత సుమయా రెడ్డి ఈ కథ రాశారు. కథపై నమ్మకంతో పాన్ ఇండియా మూవీగా దీన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రతి వ్యక్తి జీవితంలోని ఓ ఎలిమెంట్ ఈ కథలో ఉంటుంది. ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది' అని అన్నారు. 'ప్రతి ఇంట్లో జరిగిన, జరుగుతున్న కథ. అందరూ కనెక్ట్ అవుతారు' అని నిర్మాత, హీరోయిన్ సుమయా రెడ్డి తెలిపారు. హీరో పృథ్వీ అంబర్ మాట్లాడుతూ, ' ఫీల్ గుడ్ లవ్ స్టోరీ. మంచి మెసేజ్ ఉంటుంది' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.